ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక


REGD. No. M4479



4 అణాలు

21-11-'51

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



సోవియెట్ రష్యాలో శాస్త్రవిజ్ఞానంద్వారా ప్రజాసేవ: లెనిన్‌గ్రాడ్‌లోని
హైడ్రో టెక్నిక్స్ ఇన్‌స్టిట్యూట్‌లోని పరిశోధకులు.

3 వ వారము

ఆంధ్రదేశమంతటా విజయవంతముగా నడుచుచున్నది!

1950 నుంచి 1960 కి మనజీవిత పరిణామాన్ని నిరూపించే **50 - 60** నాటకం ప్రత్యేక ఆకర్షణ :



ఏసెస్కే వారి

పెళ్లికూతురు

అద్భుత తెలుగు చిత్రం

శ్రీరామా-విజయవాడ
మినర్వా-విజయనగరం
మినర్వా-విశాఖపట్నం
పూర్ణా-కాకినాడ
మినర్వా-రాజమండ్రి
కేసరి-ఏలూరు
సత్యనారాయణ-తెనాలి
సరస్వతి-గుంటూరు
మినర్వా-బందరు
స్వామీజీ-భీమవరం
ప్రభాత్-బళ్లారి
రాధాకృష్ణ-కర్నూలు

15-11-51 మొదలు
మణి-నెల్లూరు

16-11-51 మొదలు
సత్యనారాయణ-చీరాల

17-11-51 మొదలు
రఘువీర్-అనంతపురం

20-11-51 మొదలు
కృష్ణబాలాజీ-తాడేపల్లిగూడెం

త్వరలో
ఒంగోలు
గుడివాడ
నంద్యాల
అనకాపల్లి

డైరెక్టర్: N. S. కృష్ణన్... చమ్రియా రిలీజ్

విషయానుక్రమణిక 1951 నవంబరు 21

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0 విడిపత్రిక 4 అణాలు

ప్రతి బుధవారము ప్రకటింపబడును

Founder : K. NAGESWARA RAO

సంపుటము 44 సంచిక 12 21.11-51

ఖర సంవత్సర కార్తీక బహుళ సప్తమి బుధవారము

రాజకీయాలు :

చెన్నపట్నానికి కృష్ణనీరు

ఈ సంవత్సరంకూడా వర్షాలు సకాలంలో కురవనందువల్ల దక్షిణాదిని పంటలు పాడైనాయనీ పంట బాగా తరిగిపోతుందనీ మద్రాసు ప్రభుత్వం అంచనాలు వేసింది. పెద్ద తుపాను నవంబరులోనైనా ఒకసారి వస్తేగాని పంటలకు నీరు చాలదని వాతావరణ పరిశీలకు లోకరన్నారు. వర్షాభావంవల్ల పంటల నష్టంతోపాటు చెన్నపట్నానికి నీటికరువుకూడా వస్తోందని కార్పొరేషన్ కమిషనర్ చెప్తున్నారు. డిసెంబర్ నించి రోజుకి మూడు గంటలకంటె ఎక్కువ పంపులద్వారా నీరు సప్లై చెయ్యలేరట. ఈ విషయమై ప్రజారోగ్య శాఖామంత్రి కళా వెంకట్రావుగారు పత్రికా సమావేశంలో వివరంగా ముచ్చటించారు.

పత్రికా సమావేశంలో వచ్చిన ప్రశ్నల్ని చూసినా, నవంబరు 8వ తేదీని శ్రీ టి. ఆర్. వెంకట్రామశాస్త్రిగారు చేసిన ప్రకటన చూసినా ఆంధ్రదేశంపట్లా, ఆంధ్రుల సమస్యలపట్లా, రాష్ట్రోద్యమంపట్లా, తమిళుల వింతమనస్తత్వం చక్కగా బోధపడుతుంది. పత్రికా సమావేశంలో విలేఖరులు చెన్నపట్నం అవసరాలకు కృష్ణా - పెన్నా ప్రాజెక్టు అగత్యమని సూచించారు. నిజానికి చెన్నపట్నానికి నీరు సమృద్ధిగా లభ్యం కావాలంటే అటువంటి ఏ ప్రాజెక్టో తప్ప వేరే గత్యంతరం లేనట్లు తోస్తుంది. సమీపంలో ఉన్న చిన్నచిన్న నదులన్నీ వర్షాలపైన ఆధారపడినవే. వర్షాలు సమృద్ధిగా ఉంటే ఇప్పుడున్న మూడు చెరువులూ నగరానికి తగినంత నీరు ఇవ్వగలవు. ఆ వర్షాలు లేకపోతే ఈ చెరువులతోపాటే ఆ నదులూ ఇంకిపోతాయి. పెన్నానది నీరు తెచ్చుకోడం తప్ప వేరే దారి కనపడదు. పెన్నానది నీరు కూడా ఇంతదూరం తీసుకొచ్చేసరికి ఇటు నగరానికీ పూర్తిగా ఇవ్వలేక, అటు నెల్లూరు పంటలకీ దెబ్బతగలడం సంభవించవచ్చు. అందువల్లనే కృష్ణానది నించి నీరు తీసుకురాక తప్పదేమో ననిపిస్తుంది. అయితే భక్తవత్సలంగారు చెన్నపట్నం సంగతీ, నెల్లూరుజిల్లా సంగతీ ఆలోచించారే కాని కృష్ణా గుంటూరు జిల్లాలవారి సంగతి ఆలోచించలేదు. కృష్ణానదిని పెన్నతో కలిపి అక్కడనించి చెన్నపట్నానికి నీరు తీసుకొచ్చినట్లయితే అదనంగా లక్షలకొద్దీ ఎకరాల్ని సాగులోకి తెచ్చి నెల్లూరు చిత్తూరు, చెంగల్పట్టు జిల్లాల్ని బాగుచేసేమాట అలా ఉంచి కృష్ణా, గుంటూరుజిల్లాల్లో ఇప్పుడు సాగౌతున్న భూముల్ని నష్టపరచడమౌతుందేమో ఆలోచించాలి. మళ్ళీ వీని కోసమైనా గోదావరి నీరు కృష్ణలోకి తీసుకు రావలసి వస్తుంది. అంటే రామపాదసాగర్ ప్రాజెక్టుని తిరిగి పునరుద్ధరించుకోవలసి వస్తుంది. కాని భక్తవత్సలం గారికి ఇది ముందు అవసరమని తోచడంలేదు. ముందు నెల్లూరు, చెంగల్పట్టు పచ్చబడి చెన్నపట్నానికి నీరులభిస్తే వారికి చాలు. ధాన్యపుకొట్టం కృష్ణా డెల్టానుంచి నెల్లూరు చెంగల్పట్టు జిల్లాలకి చేరుతుంది.

బొంబాయి నగరానికీ చెన్నపట్నానికీ పోలికలేదనీ, చెన్నపట్నాన్ని ప్రత్యేక రాష్ట్రంగా నిర్మించడానికి వీలుపడదనీ నెహ్రూ-పటేల్-పట్టాభి కమిటీ నివేదించింది. చెన్నపట్నానికి సమీపప్రాంతాలతో అత్యంత సన్నిహితసంబంధం ఉండడమే ఇందుకు కారణమని కమిటీ చెప్పింది. అయితే ఆ సన్నిహిత సంబంధాలలో నెల్లూరు బియ్యం రవాణా, కృష్ణా-పెన్న ప్రాజెక్టువల్ల లభ్యమయ్యే నీటిసప్లై మొదలైనవి కూడా ఉన్నాయన్న సంగతిని వారు గుర్తించలేదు. అదే గుర్తించిఉంటే, తప్ప

కుండా అదే కారణంవల్ల, అంటే సమీప ప్రాంతాలపైన నగరం ఆధారపడి ఉన్నదన్న కారణంవల్లనే, చెన్నపట్నం మొదటి నుంచీకూడా ఏ విభాగానికీ చెందకుండా ఉభయప్రాంతాలకీ చెందాలని వారే ఒప్పుకోవలసి ఉంటుంది.

శ్రీ టి. ఆర్. వెంకట్రామశాస్త్రిగారు ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి ఆదినుంచీ ప్రతికూలంగానే ఉన్నట్లు చెప్పారు. అంత స్పష్టంగా వారు వాదించినదానిని కాదనలేం. కనీసం వారైనా మనస్సులో ఒకటి పెట్టుకుని పైకి మరొకటి చెప్పడం లేదని సంతోషించాలి. కేవలం దేశక్షేమాన్నే దృష్టిలో పెట్టుకుని, వారు అలా చెప్తున్నారని అంగీకరించవలసిందే. కాని ఇతరుల మాదిరిగానే వారుకూడా కృష్ణా–పెన్నార్ ప్రాజెక్టుకీ ముడివేసి వాదించడమే వింతగా ఉంది. ఈ సందర్భంలో వారేం చెప్పారో సరిగ్గా అదే కారణం పురస్కరించుకుని ఆంధ్రరాష్ట్రంకోసం ఆంధ్రులు ఉద్యమం నడపవలసివచ్చిందని వారు కాని ఇతరులు కాని గుర్తించడం లేదు.

రాయలసీమకు లాభించే ప్రాజెక్టుల్ని సర్కార్లవారు ప్రతిఘటిస్తున్నారని తమిళులందించడం, రాయలసీమ వారది అందుకుని తాళం వెయ్యడం, వెంకట్రామశాస్త్రిగారి వంటివారు కూడా అదే పాటపాడ్డం వింతగా ఉంది. ప్రకృతి ఇచ్చిన సహజ సంపదపైన దేశంలో అందరికీ హక్కుండే మాట నిజమే. నదీ జలాన్ని ఎంతదూరం వరకూ తీసుకుపోయి వినియోగించడానికి వీలుంటుందో, అంతమేరా ఆ నదీ జలాన్ని వినియోగించుకునే హక్కు ఆ ప్రాంతంలోని వారందరికీ ఉండేమాట నిజమే. కాని అసలు ఆ ప్రాంతానికి చెందినవారికి వినియోగపడకుండా, వారినోట మన్నుకొట్టి చెన్నపట్నం తీసుకుపోతామంటే అందుకు ఎవ్వరూ అంగీకరించలేరు. ముందు సమీపప్రాంతాల వారి అవసరాలను తీర్చిన, అక్కడి ప్రజలను సంతృప్తిపరిచిన తరవాతనే ఇంకా నీరు మిగిలితే ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లాలి. భక్తవత్సలంగారు కృష్ణా తీరప్రాంతవాసుల్ని తృప్తిపరిచినట్లయితే కృష్ణానది నీటిని చెంగల్పట్టు చెన్నపట్నాలకే కాదు కుంభకోణం వరకూ కూడా తీసుకు వెళ్ళవచ్చు. లేదా రాయలసీమని ముంచెత్తవచ్చు.

చెన్నపట్నంలోని ఆంధ్రులే సర్కారు వారి స్వార్థబుద్ధిని కనిపెట్టాలని వెంకట్రామశాస్త్రిగారు చెప్తున్నారు. చెన్నపట్నంలో తమిళులకు లేకుండా చెయ్యడం కోసం సర్కారు ఆంధ్రులు కృష్ణా-పెన్నార్ ప్రాజెక్టును ప్రతిఘటిస్తున్నారంటున్నారు. ఆంధ్రదేశం అవసరాలను నిర్లక్ష్యపరిచి ఇటువంటి బూటకపు వాదాలను తెచ్చిపెడుతున్నందువల్లనే తమిళులపట్ల ఆంధ్రులకు అసంతృప్తీ అనుమానమూ కలిగినాయి.

ఈనాడు ఆంధ్రరాష్ట్రాన్ని కోరుతున్నవారిలో పరిపాలనా సౌకర్యంకోసం ప్రజాస్వామ్య పరిపాలనా విధానాన్ని ప్రజలందరికీ సుబోధకమయ్యేరీతిని నిర్వహించడంకోసం కోరేవారు అరుదైనారు. ఆంధ్రులకు అన్యాయం జరిగిందని భావించినందువల్లనే ప్రత్యేకరాష్ట్రాన్ని అందరూ కోరుతున్నారు. ఇలా అన్యాయం జరిగిందని ఆంధ్రులు భావించడానికీ, పరిపాలకులపట్ల ప్రజలకు విశ్వాసం నశించడానికీ ఇటువంటి తంత్రాలే ముఖ్యకారణం. ఈనాడు నిజంగానే భక్తవత్సలంగారు దీక్షవహించి ఆంధ్రదేశం అభివృద్ధికోసం పాటుపడినా ప్రజలు విశ్వసించేస్థితిలో లేరు. భక్తవత్సలంగారు పబ్లిక్‌వర్క్సుశాఖను చంద్రమౌళిగారికో, కళా వెంకట్రావుగారికో ఒప్పగించినట్లయితే ప్రభుత్వం తలపెట్టే ప్రాజెక్టులు సక్రమంగా కొనసాగే అవకాశం ఉంటుంది. కృష్ణా పెన్నార్ ప్రాజెక్టును గురించి ఉభయపక్షాలవారు చెప్పే వాదాలనూ ఆంధ్రదేశం విశ్వసించలేని స్థితిలో ఉంది. ఈ మార్పు జరిగినప్పుడు, లేదా ప్రభుత్వం తలపెట్టే ప్రాజెక్టులపట్ల ప్రజలకు విశ్వాసం కలిగించినప్పుడు, ఆంధ్రదేశానికి నష్టం వాటిల్లదని విశ్వాసం కలిగినప్పుడు ఇటువంటి ప్రాజెక్టుల్ని ప్రారంభించడం మేలు. ప్లానింగ్ కమిషన్‌వారి నిపుణుల ఉపసంఘమైనా ఈ సమస్యల్ని సాకల్యంగా విచారించి వీలైనంత త్వరలో విషపూరిత ప్రచారాలను అరికట్టడం అవసరం.

కోదండరావుగారి సూచన

ఇటీవల విజయవాడలో ప్రసంగిస్తూ శ్రీ పి. కోదండరావుగారు భాషారాష్ట్ర నిర్మాణ వాదాన్ని ఖండించారు. పరిపాలనకూ, భాషకూ, సంస్కృతి పెంపొందించడానికీ భాషారాష్ట్రాలకూ సంబంధం లేదని వీరన్నారు.

ఈనాడు ఆంధ్రులు ప్రత్యేకరాష్ట్రాన్ని రెండు ముఖ్య హేతువులకోసం కోరుతున్నారు. 1. ఆంధ్రులకు జరిగిన అన్యాయాలు. 2. స్వభాషలో పరిపాలనా కలాపం నిర్వహించుకునే అవసరం. శ్రీ కోదండరావుగారు రెండు హేతువుల్నీ ఖండిచారు. ఆంధ్రులకు అన్యాయం జరిగిందంటే అందుకు బాధ్యతగలవారి ఉపేక్ష హేతువన్నారు. అంటే ప్రజలు ఎన్నికల్లో ముందు ఇటువంటివారిని కాక ఉపేక్షవహించనివారిని ఎన్నుకుంటే ఈసమస్య తీరిపోతుందని కోదండరావుగారి అభి

ప్రాయమై ఉండవచ్చు. కాని ఈ సమస్య ఇంత తేలిగ్గా పరిష్కారమయ్యేది కాదు. ప్రజాస్వామ్యం సక్రమంగా కొనసాగాలంటే ప్రజలు తమ హక్కుల్ని చక్కగా గుర్తెరిగి, శాసనసభ్యులను, పరిపాలకులను ఒకకంట కనిపెట్టి చూడ్డం అవసరం. ప్రజలకు కాపాటి విద్య, విచక్షణ, అవకాశమూ లేకపోబట్టే బ్రిటన్ అమెరికాలవంటి దేశాలలోకూడా ప్రజాస్వామ్యం తృప్తికరంగా కొనసాగడం లేదు. మిగిలిన దేశాలలోకంటె బ్రిటన్‌లోనూ, స్విట్జర్లెండులోనూ ప్రజలు ప్రజాస్వామ్యంలో తమ హక్కులను అవసరాలను గుర్తించగలుగుతున్నందువల్లనే అంతవరకైనా మేలుగా ఉన్నాయి. మన దేశంలో శాసన సభ్యులే తెలుసుకోలేని విషయాలు ప్రజలు తెలుసుకోగలుగుతారనుకోడం భ్రమ అందువల్ల ప్రజాప్రాతినిధ్య ప్రభుత్వం అమలులో ఉన్న దేశాలలో రాజ్యాంగమూ శాసన విధానమూ కూడా ప్రజల అవసరాలకూ సమర్థతకూ సమన్వయం కాగల విధంగా రూపొందుతాయి. ఇవి ఎన్నడూ దోషరహితమైనవని భావించరానివి. ఉన్నంతలో, తెలిసినంతలో మేలైనవిగా మాత్రమే వీనిని పరిగణించాలి. అందువల్లనే లోపాలకు ఆట్టే అవకాశంలేని విధంగా రాజ్యాంగం, పరిపాలన నిర్వహించబడాలని ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రయత్నిస్తాయి. వీలైనంతవరకూ పరిపాలకులు ప్రజల క్షేమానికి విరుద్ధంగా ప్రవర్తించకుండా కట్టుబాట్లు ఏర్పాటు చెయ్యడంలోనే రాజ్యాంగం అధికంగా తోడ్పడాలి.

భాషారాష్ట్రాల సమస్యను ఈ దృష్టితో చూస్తే అల్ప సంఖ్యాక వర్గాల సమస్యగా పరిగణించవలసి వస్తుంది. ప్రాంతీయ స్వపరిపాలనా విధానం అనుసరించబడుతున్నంతవరకూ, ప్రాంతీయ విభజన పరిపాలనా సౌకర్యాన్నిబట్టే జరుగుతుంది. జాతిమతాది భేదాలనుబట్టికూడా జరక్కపోదు. కాని ప్రధానమైనది పరిపాలనాసౌకర్యమే. దీనినిబట్టి చూసినట్లయితే తప్పకుండా ఆంధ్రరాష్ట్ర విభజనకు నైసర్గిక హేతువులు తోడ్పడుతున్నాయని చెప్పాలి. ప్రకృతి సంపద గమనించినట్లయితే రాయలసీమ సర్కారు జిల్లాల ఐక్యత, విశిష్టత ప్రకృతి సిద్ధమైనవని చెప్పవలసి వస్తుంది. చెన్నరాష్ట్రం ఇప్పటి మాదిరిగా నేఉన్నంతకాలం రాయలసీమ ఖనిజసంపద వృద్ధికావడం కల్ల. విద్యుచ్ఛక్తి, పారిశ్రామికాభివృద్ధి దృష్ట్యా చూస్తే ఎంత అధికావకాశాలున్నప్పటికీ సర్కారు రాయలసీమలు హీనస్థితిలోనే ఉండిపోవడానికి తప్పకుండా కొన్ని భాషాప్రాంతాలపట్ల పరిపాలకుల నిర్లక్ష్యభావమే హేతువని చెప్పాలి.

ద్విభాషా ప్రాంతాలు విస్తారంగా ఉన్నందువల్ల భాషారాష్ట్ర విభజన కష్టమని కొందరు వాదించవచ్చును. కాని పైన చెప్పిన అల్పసంఖ్యాకవర్గాల సమస్య కేవలం ప్రాంతీయ సమస్య అన్న మాట మరిచిపోకూడదు. ప్రాంతీయసమస్యగా పరిగణించినట్లయితే ద్విభాషా ప్రాంతాలను ఏదో ఒక భాషాప్రాంతంతో చేర్చడానికి సులువౌతుంది. ఉదాహరణకి బళ్లారిజిల్లా భవితవ్యాన్ని నిర్ణయించడంలో భాషకంటె పరిపాలనా సౌకర్యాన్ని ప్రాంతీయ విభజన సౌలభ్యాన్ని ముఖ్యమైనవిగా పరిగణించాలి. అదే విధంగా చెంగల్పట్టు జిల్లాలోని తెలుగు తాలూకాల్ని తమిళనాడులో ఉంచవలసి రావచ్చును.

తరవాత భాషారాష్ట్ర నిర్మాణవాదంలో పరిపాలనా సౌకర్యానికీ భాషా సంస్కృతులకు సంబంధంలేదని కోదండరావుగారన్నారు. ఐక్యరాజ్యసమితి, ఆంగ్లభాషా ప్రాధాన్యం మొదలైన ఉదాహరణలూ, హేతువులూ చూపారు. కాని అదంతా పునాది ఏర్పడిన అనంతరం కృషి చెయ్యవలసినదిగా వారు భావించలేదు. కేంద్రంలో నానాభాషల కలగలుపు ఉన్నంతమాత్రంచేత ప్రాంతీయ స్వపరిపాలన నిమిత్తం ప్రాంతీయభాష నుపయోగించనవసరంలేదని చెప్పకూడదు. నిజానికి భాషా సమస్య వల్లనే కేంద్రంకంటె రాష్ట్రాలకు అధికమైన పరిపాలనాధికారాలుండాలని వాదించేవారున్నారు. ఏ దేశంలోనైనా ప్రభుత్వం ప్రజలకు సన్నిహితంగా ఉన్నప్పుడే పరిపాలన సులభంగా సక్రమంగా కొనసాగుతుందని అనుభవంవల్లనే తెలుస్తుంది. ప్రజలకు పరిపాలనతో శాసనసభలలో ఉపన్యాసాలు, పత్రికలద్వారానే సంబంధం ఉండనుకోడం పొరపాటు. నేడు దేశంలో వాస్తవ పరిస్థితి అలానే ఉందంటె అంగీకరించక తప్పదు. కాని ఈ పరిస్థితి మారక తప్పదు. రెండుమూడుసార్లు ఎన్నికలు జరిగి ప్రజాప్రాతినిధ్య సభల సంగతి ప్రజలకు తెలిసినప్పుడైనా, ప్రతినిధులు ప్రజలకు మరింత సన్నిహితంగా సంచరించడం అనివార్యమని బోధపడకమానదు. ప్రజలకూ శాసనసభలకూ ప్రజలకూ పరిపాలకులకూ సన్నిహితం చేకూర్చడానికి భాష అత్యంత

(48-వ పేజీ చూడండి)

సగోత్రీకులు

శ్రీ ప్రతాపరావు

“ఏమండోయి, మిమ్మల్నే, ఈ చాకిరీ అంతా నే చేయలేను.”

“...............”

“ఏమిటి వినిపించికోరేం ?“

“ఏమిటి గోల ?”

“అవును నా మాటంటే గోలగానే ఉంటుంది మీకు.”

“ఏం యిప్పుడే మొచ్చింది ?”

“ఈ గంపెడు చాకిరీ నేను చేయలేను.”

“మీ కొకసారి, ఆయన కొకసారి, పిల్లల కొకసారి స్నానాలు, వడ్డనలు చేయలేను, బాబూ.”

“మా నాన్నొక్కడేగా ఎక్కువ, మిగతాది నీకు సర్వకాలం ఉండేదేనయ్యే.”

“ఒక్కరు చాలదేమిటి—అయినా ఆయనొచ్చి నప్పుడల్లా లేవాలి. ఇదంతా నావల్ల కాదు.”

“ఆయన మా నాన్న. నన్ను పెంచి పెద్ద చేశాడు. చదువుచెప్పించాడు.

“ఏమిటండీ, మీకొక్కరికే చెప్పించినట్టు బాధపడతారు—మీ తమ్ములు లేరూ.”

“ఉంటే ?”

“అయిందిగా యిక్కడ పదిరోజులు. ఎల్లకాలం యిక్కడే ఉంటే.....ఉఁ బాగానే వుంది.”

“...............”

“ఏమిటండీ మాట్లాడరు. పిల్లలుగల సంసారం. మనం మాత్రం ఎన్నాళ్లని సెత్తిని పెట్టుకోగలము—అయినా ఈ “సేవలు” నాకు చాతగావు. ముందుగానే చెబుతున్నాను.”

“అయితే ఏమంటావు ?”

“నేను అనేదేముంది? నేనంటే మాత్రం సాగుతుందా ?”

“ఆయనకు వినపడుతుంది. నెమ్మదిగా మాట్లాడు.”

“ఆ, వినబడితే నష్టమేమిటి – మన పెళ్లినాడు చిన్న విషయానికంత గొడవ చేశాడే – ఏమని వచ్చాడండి ఆయన యిక్కడ తిష్ట వేయడానికి !”

“..................”

“ఏరికోరి తెచ్చుకున్నావుగా రెండో కోడల్ని. ముద్దు మురిపెం తీరుస్తుంది. నేను ఎంతచేసినా మెప్పా, బండలా, – ఇక నావల్ల కాదు ఈచాకిరీ అంతాను.”

“నువ్వు యింటికి పెద్దకోడలు వి. మూల విరాట్టువి. నువ్వే యిలాచేస్తే ఎలా ?”

“అవును లెండి. అందుకే యిట్టా తగలడ్డాను నేను. అందుకే గింజాట్రా అక్కడ కెడతాయి.”

ఒక్క నిట్టూర్పు విడిచాడు సుందరం భార్య కెదురు చెప్పలేక.

మర్నాడుదయం పెద్దకొడుకుని పిల్చి రామయ్య పదిగంటలబండికి వెడుతున్నానని చెప్పాడు. కాదనలేక పోయాడు సుందరం.

రామయ్యవచ్చి మూడు రోజులయింది సత్యం యింటికి. “ఎప్పుడొచ్చారు” అని తప్ప మళ్ళీ మాటామంతీ జరగలేదు తండ్రీ కొడుకులమధ్య.

సాయంత్రం ఆఫీసునుంచి తిరిగొచ్చాడు సత్యం. ఎదురుగా సత్యం కొడుకొచ్చి,

“నాన్నా, తాతయ్య కొట్టాడు” అన్నాడు.

“ఎందుకు కొట్టాడు ?”

“ఊరికే నే నాన్నా.”

“ఊరికే ఎందుకు కొడతానురా భడవా” అని అందుకున్నాడు రామయ్య.

“మరెందు కేమిటమ్మా !”

“చెప్పినమాట వినలేదు. అది తప్పుగాబట్టి కొట్టాను” అన్నాడు రామయ్య మనవణ్ణి దగ్గరకు తీసుకోబోతూ.

“పిల్లలు తప్పులుగాక ఒప్పులు చేస్తారేమిటి - యింత వయసొచ్చిన మనమే తప్పులు చేస్తుంటాము.” అని కసురుకున్నాడు సత్యం.

“ఇంతకీ నువ్వనే దేమిట్రా?” అని అడిగాడు రామయ్య కొడుకుని.

“నువ్వేమి జోక్యం కలుగజేసుకోకు. ఆ మూడు ముద్దలునోట్లో వేసుకుని కృష్ణ రామ అని ఓమూల కూర్చో. “అన్నిటిలో నూ వేలెట్టద్దని కోరుతున్నా. అంతకంటే ఏమీ లేదు.”

“చంటాణ్ణి చిన్న దెబ్బ యిలా అందే తప్పొచ్చిందట్రా ?”

“ఇవన్నీ నీ కెందుకు, నువ్వొక చోట పడుండక.”

రామయ్య మాట్లాడ లేక పోయాడు. సత్యం భార్య,

“ఏమిటండీ అలా అన్నారు ? పాపం, మామయ్య చిన్న బుచ్చుకున్నారు.” అందిలోపల గదిలో.

“యివ్వాళయిదయింది. రేపు యింకోటవుతుంది. ఆడదానికి, నీ కెనడిచ్చాను పెత్తనం ఈ సలహా లివ్వడానికి. నువ్వు నోరు మూసుకు కూర్చో.” తిరుగు జవాబు రాలేదు సత్యం భార్యదగ్గర నుంచి:

నాలుగో రోజు కల్లా చిన్నకొడుకు రాముం యింట్లో ఉన్నాడు రామయ్య. రామయ్య చిన్నకొడుకు కింకా పిల్లా పాపా కలగలేదు.

రాముం యిల్లు చిన్నది. రెండుగదులు,

(14-వ పేజీ చూడండి)

ఆంధ్రా క్రాస్‌వర్డ్సు

రాజమండ్రి

క్రీ సొల్యూషన్ నెం 2

అడ్డము : 1 ఆంధ్రా క్రాస్ వర్డ్సు, 4 ముఖము 6 గందము 8 టిల్ల 9 జంత్రము 10 డులి 12 కానుక 14 పిడుజు 15 పారు.

నిలువు : 1 అంగీరసుడు 2 క్రొలుగంటి 3 వస్త్రము 4 ముద్గలము 5 మురజము 7 తంత్రకారుడు 11 లిపికరుడు 13 కత్తిలాని 15 పాపమేపుడు 16 సంగరము 17 ప్రియలము 18 నాగులు 19 కణి.

ప్రయిజులిస్టు 30-11-51 ని పంపబడును.

ప్రేమమందిరము

శ్రీ వి.డి. ప్రసాదరావు

మొదటి రంగము

(టౌన్‌హాల్ వరండాలో పేకాడు తూన్నటారు.)

సుబ్బారావు: ఇదిగో చివరితురుఫ. ఇటుకోస్తాను. కళావరు అందిస్తాను. డైమాన్ ఆసు-ఆ తర్వాత వరస హుకుం... ఊఁ..అయిదుపట్లు మావే...

రామలింగం: నువ్వు డైమాను దిగకూడ దోయ్ శంకరం. సుబ్బారావు చేతిలోంచి దిగటానికి వీలులేక కింద ఉన్న మదాం, మణీలాలు ఎల్లాపట్లుచేద్దామా అని చూస్తు న్నాడు. సరిగ్గా అందిస్తవి.

శంకరం: అరె! నాకేం తెలుస్తుంది? నువ్వేదోటూ డైస్ అన్నావుకదా అని అందిస్తిని.

సూర్యనారాయణ: అబ్బా, ఆపండోయ్ బాబు ఈపోస్టుమార్టమ్! డెబ్భై రెండుపాయింట్లుఅయాయి. పాయింటు బేడా చొప్పున, ఇద్దరూ చెరి తొమ్మిది రూపాయిలు ఇల్లాయియ్యండి.

శంక: పది రూపాయలనోటు చిల్లరుందా.

రామ: సుబ్బారావ్...నిన్న నీకు ఏడు రూపాయలు బాకీపెట్టానుకదురా, అదీ యిదీ పదిహారూ. ఇరవై తీసికొని సాలుగు యిల్లాయియ్యి. శంకరం నువ్వు సూర్యనారాయణకియ్యవోయ్.

సూర్య: నా దగ్గిర చిల్లర లేదే...బాయ్.

బాయ్. ఏం సెక్రటరీవోయ్ సుబ్బారావు. ఒక్క కుర్రాడూ కనపడడు.

సుబ్బా: అదేబాబూ నేనేడ్చేదీని. ఈ చివాట్లమారి సెక్రటరీషిప్ నాకెందుకంటే ఎవరూ వినరాయెను. రోజంతా బిజినెస్, తోటే తీరదు-కొస్త కులాసాగా ఇక్కడ గడుపుదామంటే, ఈ బాధ్యత ఒకటి నా మీద పెట్టిరి. ఏమోయ్ శంకరం పోనీ నువ్వు సెక్రటరీ చెయ్యరాదోయ్.

శంక: బ్రదర్...కులాసాగా ఆడే ఆటకే మీ చేత ఇన్ని మాటలు పడాల్సి వస్తోందే, అంత బాధ్యత గలపని నేను చెయ్యగలనటోయ్....-అహ్హాహ్హా.

రామ: ఇందాకన్నానని ఏమన్నా అనుకుంటూన్నావేమిటోయి, అది కేవలం ఆట పద్ధతికోసం అనుకోటంగాని సీరియస్‌గా కాదు.

శంక: అబ్బే సీరియస్‌గా తీసికో లేదోయ్, నవ్వుతూనే అన్నాను.

సూర్య: బాయ్, బాయ్ (అని కేక వేస్తాడు)

బాయ్: సార్. వస్తున్నానండి.

సుబ్బా: ఎక్కడికెళ్లావురా...

బాయ్: అక్కడ టెన్నిస్ ఆట దగ్గిర కూల్ డ్రింకులు తెమ్మన్నారండి అందరికీ తేవటానికి వెళ్లానండి.

సుబ్బా: ఏడవలేక పోయావ్... ఇక్కడ ఎక్కడో కునుకుతూ ఉండి ఉంటావ్.

బాయ్: లేదుసార్ నిజంగా-ఇంకా అడగండి, సుందరరావు గారు ఆ వేడెవరో కొత్త మిస్సమ్మగారును మాచ్ నెగ్గారండి. అక్కడున్న వారందరికీ 20 డ్రింకులు తెమ్మన్నారండి. ఐదు సార్లు తిరగాల్సొచ్చిందండి.

శంక: కొత్త, మిస్సమ్మగారు ఎవరురా...

సూర్య: అవునులేగాని ముందుపోయి నాలుగు కాఫీ – ఇప్పుడు టిఫిన్ ఏమన్నా ఉంటుందా ?

బాయ్: మినపట్లు వేస్తారండి.

రామ: నాకు టిఫిన్ వద్దోయ్. కడుపు నిండుగా ఉంది. కాఫీ తాగుతా చాలు.

సూర్య: అవును లేవయ్యా నాలాంటి దరిద్రుడి కాక లెక్కువగాని నీకు ఆకలెల్లా వుంటుంది.

అరేయ్ కుర్రాడా, పోయి మూడు మినపట్లు, నాల్గు కాఫీ, రెండు మంచి సిగరెట్టు పాకెట్టులు తీసుకురా! ఇదిగో పది రూపాయిల నోటు తీసికెళ్ళు త్వరగారా.

బాయ్: ఆరక్కడ టెన్నిస్ దగ్గిర కలక్లండియ్ మంటున్నారండి.

సూర్య: ఏడిశావ్. ముందిక్కడను పోయిరా.

బాయ్: సిత్తమండి.

సూర్య: ఈ టెన్నిస్ వాళ్ళదొక న్యూసెన్స్‌గా తయారయిందరా. కుర్రాడిని కంటికి కనబడనీయరు. అదీ కాకుండా, అందరు కుర్రాళ్లను చేర్చుకొన్నా వందుకోయ్ సుబ్బారావు? ఈ ఆడవాళ్ళ తాకిడి కూడా ఏమిటి.

సుబ్బా: చందా కొస్త సరిగ్గా యిస్తున్నది వాళ్ళే యింతవరకు! క్లబ్బుకు నూట ఏభైమంది మెంబర్లన్న మాటేగాని పట్టుమని పదిమందైనా సబ్‌స్క్రిప్షన్ సరిగ్గా యియ్యరు ఇదిగో రేపు మళ్ళీ జనరల్ బాడీ కొత్త బోర్డు ఎన్నుకోవాలి. మీ కెవళ్ళకేనా అప్పగించి ఈ పీడ వదల్చుకొంటాను.

రామ: గుమాస్తా లేదూ.

సుబ్బా: సరిలే. జీతం సరిగ్గా అందకగుమాస్తా మానుకొని రెండు నెలలయింది.

ఇప్పుడు అన్నీ మనమే. చూసావుగా వాడు కొస్తలో రాకపోతే మీ కాఫీలు నేనే తెచ్చి యియ్యవలసి వచ్చేది.

శంక: ఏమోయ్ సుబ్బారావ్... ఈ మాటు మల్లుకోటా వచ్చిందా? గుడ్డముక్క లేక చస్తున్నాం మూడు తానులిప్పిద్దూ.

సూర్య: మొన్ననే కాదోయ్ రెండు తానులు తెప్పించుకొన్నావ్. ఈమాటు నా కిప్పించవోయ్ సుబ్బారావు.

శంక: ఆఁ, మొన్న మిగిలేడి సీందా ఏమిటి. ఇద్దరు విడోస్ ఇంటికొచ్చేటప్పటికి ఆఖరయింది. మళ్లీ పిల్లాడికి చొక్కాకు కూడా మిగలలేదు. ఏమోయ్ సుబ్బారావు.

సుబ్బా: ఇప్పుడీ ఆఫీసర్ల జులుంమరీ ఎక్కువైపోయింది బ్రదర్...గజమో

పరకో కోటా అని యియ్యటం, దానికి అంగుళం అంగుళానికీ రసీదులు-గుడ్డవచ్చిందని బోర్డుకట్టాలిట. కట్టిన నిముషాన్నించి జనం ఎగబడి కాళ్లు విరగదొక్కేస్తారు. కేసుపెట్టటానికైతే యిన్స్పెక్టరు, పోలీసులు పదిమందీ, తయారవుతారు. జనాన్ని సర్దేందుకు ఒక్కడూ కనపడడు. వచ్చిది గుడ్డనల్గురికి చాలదు. తక్కిన వంద మంది నానాహంగామా చేసి, కొట్టునిప్పంటించేందుకు సిద్ధమైనంతపని చేస్తారు.

సూర్య : ఏం కబుర్లు చెప్తావోయ్, నీకూ అఫీషియల్స్కు ఎప్పుడూ జోస్తేయేఅయెను.

సుబ్బా : సరెలే! ఆమాత్రమూ లేకపోతే యీ రెండు అబోతుల మధ్య లేగదూడలాగా నలిగి చావాల్సిందే. ఇంతకన్నా ఈ గోజుల్లో అన్నీ వదలుకొని సన్యాసం పుచ్చుకోటం సుఖం.

శంకరం : ఔనులే, రెండులక్షలు గడించాక ఇక కృష్ణా రామా అనుకోటమే మంచిదిలే.

సుబ్బా : బ్రదర్...అక్కడున్న రెండు లక్షలూ హాండ్ ఓవర్ చేసుకొని నా సంసారానికి తిండికీ గుడ్డకు పారెయ్యాచాలు. ఎందుకొచ్చినిమాటలోయ్. ఇదేమన్నా నైస్ఫూల్ వ్యాపారమా లక్షలు గడించేందుకు.

రామ : ప్రతి శేరుబియ్యానికి కంట్రోలు రసీదులు చూపించాల్సిన బియ్యంలో ధనం గడించగల్గితే, నేను 'ఇండియాకు వైస్రాయ్ని కాకపోయానా మిస్టర్...

శంక : ఆ పోస్టు తీసేశారుగాని లేకపోతే ఇప్పుడవాల్సిన అఖండుడివి కావానువ్వా.

(బాయ్ కాఫీతో ప్రవేశిస్తాడు.)

సూర్య : అమ్మయ్యా...వచ్చావు రాబాబు. ఒక తుపాను అపావు.

బాయ్ : సిగరెట్టు పాకెట్టు పదకొండు అణాలకు తక్కువియ్య నన్నాడండి, అగ్గిపెట్టి అణాట.

సుబ్బా: డర్టీ స్కౌండ్రల్స్...చూడండోయ్ ప్రతి చిన్న కొట్టువాడు బ్లాక్ మార్కెట్ ఇల్లా పెంచేస్తోంటే, వాళ్లని అడిగే నాధుడు లేడు. ఏమన్నా అంటే గుడ్డ బ్లాక్ మార్కెట్ అని నన్ను, బియ్యం బ్లాక్ మార్కెట్ అని రామలింగాన్ని పట్టుకొని ప్రజలూ ఉద్యోగులూ పత్రికలూ కూడా ఒకటే దుయ్యబట్టటమాయె. అసలు జనంలో నీతి ఏడిస్తే ఒకళ్లనాల్సిన పనియే ముందోయ్.

శంకరం : అది కాదోయ్! ఇన్స్పెక్టరుకి చెప్పి, ఆ సిగరెట్టు కొట్టువాడిమీద కేసు పెట్టించాల్సిందే. ఒకళ్లిద్దర్ని ఇల్లా బుక్ చేయించి పాఠం చెప్తే గాని వీళ్లకు బుద్ధిరాదు.

రామలిం : నిజమే నోయ్... రాత్రి ఇన్స్పెక్టరు గారిని కలుసుకొంటాను నేను తప్పకుండా చెప్తాను అసు, లేకపోతే ఈ బ్లాక్ మార్కెట్టు మరీ పెచ్చు పెరిగిపోతోంది, వెధవది-ప్రతీ చిన్న వస్తువా పదింతలు ఇల్లా పెంచితే మాడిపోతున్నాం గాని మరేమన్నా ఉందా.

సూర్య : ఏదో పోనీయండోయ్. గడ్డ పలుగులు కొట్టుకు పోతోంటే పులిస్తార్లకు దిక్కేమిటన్నారు. అగ్గిపెట్టె అమ్మేవాడి మీదేనా ఈ ఆగ్నేయాస్త్రాలన్నీ. కాఫీ చల్లారిపోతోంది తాగుదాం పట్టండి.


శంక : కాదోయ్ సూర్యం. నువు అల్లా అనకు. నిజంగా ఊళ్ళో పెద్దలందరు ఈ మాత్రం సంఘంగా ఇక్కడుండి ఊరు నాశనమై పోతూంటే చూస్తో ఊరుకోవలసిందేనా? మనమంతా ఏదో ప్రోగ్రాం వేసి క్లబ్బుతరఫున సర్వోదయ స్కీమ్లాంటిది ఏదో మొదలుపెడ్తేనే గాని లాభం లేదు.

సుబ్బా : శంకరం చెప్పినమాట బాగుంది. మనమంతా పూనుకొంటే ఊరిని బాగుచేయటం నాలుగురోజులు పట్టదు.

రామ : నేను రెడీ...

సూర్య : అబ్బాయిలూ... నా కాఫీ సిగరెట్టు కాలక్షేపం నాకుంటే చాలును. ఈలోకం మరామత్తులు నావంటి అల్పుల వల్ల కావు. నాకాలం ఇలా గడిచిపోతే చాలు.

సుబ్బా : అవునయ్యా... నీకేం డబ్బున్నవాడివి. పెట్టిపుట్టావ్. కామన్ మాన్ ఎల్లా అహోరించిపోతున్నాడో నీకేమన్నా తెలుసా. కాదు మనమంతా పురమందిరం ప్రోగ్రాంలోనే ఈలోకసేవాకార్యక్రమం కూడా ప్రారంభించాలి.



సూర్య: సరేకానీ రేపేదో జనరల్ బాడీ మీటింగ్ అయి, కొత్త కార్యవర్గం తయారవండి. మీరంతా చెయ్యండి చాలు. నేను చూసి ఆనందిస్తాను. అదుగో కృష్ణవేణమ్మగారు ఎవరినో వెంటబెట్టుకొస్తోందే.

శంక: ఏం పాపం, ఛైర్మన్‌గారి తోడు లేకుండా వచ్చిందేం. ఎవరో వెంట కొత్త బర్డ్ ఉందే ఓః...

రామ: ఛైర్మన్‌కూ ఈవిడకూ యిప్పుడు చెడిందిలే. ఇంకో డబ్బున్నవాడు, దొరికాడట. యీ బర్డ్ ఆబాపతే నేమో.

సుబ్బా: బర్డ్సు లేవు ఫెదర్స్ లేవు, ఊరుకోండోయ్ ఆవిడ దగ్గిర కొచ్చింది. రండి రండి కృష్ణవేణమ్మగారూ! బాయ్, రెండు కుర్చీలు తేరా!

(కృష్ణవేణమ్మ సరోజ ప్రవేశం)

కృష్ణ: ఇదుగో పెద్దలంతా ఇక్కడే ఉన్నారే. అందరికీ నమస్కారాలు. ఈమె రామనాథంగారి అమ్మాయి. మిస్ సరోజా. యం. ఎ. ప్యాసయారు. సోషల్ సర్వీస్ చెయ్యాలని ఆవేశంతో మనక్లబ్‌లో చేరదామని వచ్చారు.

సరోజా: నమస్కారమండీ.

అంద: నమస్కారమండి. కూర్చోండి.

సుబ్బా: బాయ్ ఇంకో రెండు కాఫీ తీసుకురా... ఓహో... రామనాథంగారంటే.

కృష్ణ: వారిది మునుపి వూరే. ఉత్తర దేశానికెళ్లి చాలా పెద్దపేరు తెచ్చుకొన్నారు. కోటిరూపాయలలో ఎంతో గడించారని ప్రతీతి.

సరోజ: (నవ్వుతూ) అంత డబ్బుకు ముడిపడిలేములెండి. ఆయన వృద్ధాప్యంలో స్వంత ఊరులో ఉందామని వచ్చారు.

కృష్ణ: వారు చాలా ప్రజాహితులు. మన పురమందిరంలో సభ్యులుగా వారినీ వారి కుమార్తెను కూడా చేరుస్తున్నాను.

సుబ్బా: వెరీగుడ్. ఇప్పుడే అనుకొంటున్నాము పురమందిరం చేయవలసిన కృషి చాలా ఉందని. మీరూ మిస్ సరోజగారు కూడా సహాయం చేస్తామంటే మనకృషి చాలావరకు ఫలించినట్లే.

కృష్ణ: మా శాయశక్తులా కృషి చేస్తామండి. మా మహిళా మండలివాళ్లు కూడా చాలామంది వలంటీర్లు సంఘసేవలో చేరుతామని హామీ యిచ్చారు. వాళ్లందర్నీ కూడా పురమందిరం సభ్యులుగా చేర్పిద్దాం. యువకులనుకూడా మీరు చాలా మందిని చేర్పించాలి.

రామ: అదంతా హంగామాకు తప్ప కృషికి పనికిరాదండి. మనకు, ఊరికి, ఉపకారం ఏదైనా జరగాలంటే ఆఫీసర్సు, ఛైర్మన్‌గారు, మొదలైనవారు తోడ్పడాలి. మనం వాళ్ళని కూడ గట్టుకొని కృషి చేసుకురావాలి.

సూర్య: ఇప్పటికి జరిగిన కృషిలో వాళ్లందర్ని కూడ గట్టుకు వచ్చారు కాదటోయ్.

సుబ్బా: సుప్యారోక్ సూర్యం. నిజమండీ సరోజగారూ. మన మందిరానికి ఏభైవేళ్ళ పలుకుబడి ఉంది. మనం అది ఉపయోగించుకొని ఎంతైనా కృషి చేయవచ్చును. కాని దీనికల్లా ధనమేలోటండి. కృష్ణవేణమ్మగారూ, మీరు రామనాథంగారి లాంటి వాళ్ళకు, మన ఊరిక్షేమంమీద ఇంటరెస్టు కల్పించారంటె మన పురమందిరం, మన ఊరూకూడా బాగుపడిపోతాయి.

కృష్ణ: అదేనండి. నేనీ సోషల్ సర్వీసెస్‌లో మరీ ఒంటరిదాన్నయిపోయాను. ఇప్పుడీ మిస్ సరోజా చాలా ఉత్సాహంగా ముందుకు రావటంతో నాపని సగంపైగా తీరిపోయినట్లు తేలికనిపిస్తోంది.

సరోజ: నాకీ విషయాల్లో అనుభవాలేమీ లేవండి.

సూర్య: ఆదర్శాలూ, ఉత్సాహమూ, ఉన్నాయిగాదండి అవిచాలు!

సరోజ: థేంక్స్. మీరు వేళాకోళానికన్నా నిజానికన్నా నాకవి చాలంఅనే అనిపిస్తున్నాయండి.

సుబ్బా: అతనిమాటలు సీరియస్ అనుకోకండి. ఆయన తరహా అంతేలెండి. మీరు తలచుకొంటే దేనికి కొదవండి. ఎంత డబ్బు అన్నా ఇట్టే గుమ్మరించి ఏపనైనా చేసుకురాగలరు.

సూర్య: డేర్ యు ఆర్. ఇంత



డబ్బుతో కూడినపనులేనా మీరు చేద్దామనుకుంది?

సరో : కాదని చెప్దామనే, ఇక్కడికి వచ్చానండి. మా నాన్నగారు విరాళాల పేరిట డబ్బు వెదజల్లుతానంటారు. నాకది తలనొప్పి. డబ్బులేకుండా కృషి ఎందుకు చెయ్యలేమని నా పట్టుదల.

సుబ్బా : కేవలం మీ నాన్నగారిమాటే తీసెయ్యవలసింది కాదులెండి. అసలుడబ్బు మాట ఎల్లావున్నా మీలాంటివారి కృషి, మీ తండ్రిగారి వితరణా తోడైతే, మన పుర మందిరం ఎంతైనా వృద్ధి చేయవచ్చును. పదండి ఇప్పుడే మనక్లబ్‌లో ఒక మీటింగ్ అరేంజి చేయిద్దాము. రండోయ్ అందరం హాల్లో మీటింగ్‌కి వెళ్దాం.

రామలిం : నాకు కొంచెం అర్జంటు పని ఉందోయ్. మీ ప్రోగ్రామ్‌కు నేను ఎప్పుడూ ఫ్రీగా. (రహస్యంగా) సుబ్బారావు, ఈటర్న్ ప్రెసిడెంటు పదవి నాకు అరేంజి చేయించవోయ్.

సుబ్బా : (రహస్యంగా) శంకరం ఒకడు పీక్కుతింటున్నాడోయ్. పోనీ శెక్రటరీషిప్ అన్నా ఇప్పిద్దామంటే, వెధవది నేను చూసుకోకపోతే క్లబ్ విషయం ఒక్కటీ కదలదు. అయినా చూద్దాం దా...మీటింగ్‌లో అన్నీ తేల్చుకొందాం.

రామలిం : (రహస్యంగా) అక్కడ నేనుంటే బాగుండదు. ఎల్లాగో చూద్దూ బాబూ...క్లబ్‌కు మన చందా ఐదువేలని చెప్పు (గట్టిగా) వస్తా. అందరిదగ్గరా సెలవా (నమస్కారాలతో వెళ్తాడు.)

సరో : ఆయన ఉండరా? వారు కూడా ఉంటే మంచిదనుకొన్నాను. ఇవాళ పేపర్లో చూశాను. ఈ ఊళ్లో ఈ వారం తలకు నాలుగు ఔన్సుల చొప్పున మూడు రోజులకు మించి బియ్యం ఇయ్యలేదట.

సుబ్బా : అరే మనకి తెలియదే-నిజంగా మాడిపోతూందండి కాలం.

సరో : వారికి బియ్యం కమిటీలతో సంబంధం వుంటుందని కృష్ణవేణమ్మగారు చెప్పారు. వారుకూడా ఉంటే, ఆ విషయంలో మనకు చాలా సహాయం జరిగేదేమో.

సూర్య : శంకరం...నాలుగౌన్సులంటే ఎంతోయ్? రెండు ఇడ్లెన ప్రమాణం ఉంటుందా?

శంకరం : ఏదో రామలింగం పుణ్యాన్న నాకా అంచనాలు తెలిసిరా అక్కర్లేకపోతోంది.

సూర్య : మీకు తెలుసండీ కృష్ణవేణమ్మగారూ...

సరో : ఏమండీ, మీరంత వెటకారంగా మాట్లాడుతున్నారు? మాకు నిజంగా సోషల్ సర్వీస్ చేద్దామని కుతూహలం లేదనేనా.

సూర్య : ఛాఛా... అదికాదండి. నాలుగౌన్సులంటే ఎక్కువో తక్కువో మాక్లబ్‌లో ఎవరికీ తెలియదే, మరి మేము కృషి చెయ్యటం ఎల్లా అనే...

సుబ్బా : చాల్లేవోయ్ మరీని... అతనిదంతా అట్లాటి హాస్యమేనండి సరోజగారు కాని మనిషి చాలా మంచివాడు మీకే త్వరలో తెలిసివస్తుంది.

సూర్య : థాంక్స్ బాబూ... నేను సెక్రటరీకి నిలవనుగాని నన్ను రికమెండు చెయ్యకు. నీపుణ్యమాని నాకు ఈ డబ్బా అనవసరం.

సుబ్బా : సరి. సరి.. రండి వెళ్దాం.

సరోజ : మీరు రారూ సూర్యనారాయణగారూ...

సూర్య : క్షమించండి నేను బద్ధకస్తుడిని, కదలలేను. ఇక్కడే క్వార్టోని నాలుగు ఔన్సుల్లాగే రెండున్నర గజాలు మనిషికి నడుం చుట్టూ చాల్తాయో లేదో ఆలోచించి ఇంటికి పోతాను.

సరోజ : మీరు వింత మనుష్యులే:...

కృష్ణ : పదమ్మా లోపలికి వెళ్దాం. రండి సుబ్బారావుగారు, శంకరంగారు...

(అందరు నిష్క్రమిస్తారు)

రెండవ రంగము.

శంక : ఏమోయ్ సూర్యనారాయణా ఈమధ్య ఊళ్లో లేవా ఏమిటి ఎక్కడా కనబడలేదు.

సూర్య : లేనోయ్ అటు దేశాటనం బయలు దేరాను. క్లబ్ కబుర్లేమిటీ! మన టేబిల్ దగ్గిర ఎవరూ లేరేం...

శంక : క్లబ్ అంతా తీన్‌తార్ అయిపోయింది.

సూర్య : ఏం ఏమయిందేమిటి...

శంకరం : ఆ వేళ మీటింగ్‌కువచ్చావా? అన్నట్టు నువ్వు రాలేదు గాబోలు-ఆ మిస్ సరోజ ఏం మాట్లాడిందంటావ్-టెన్నిస్ గాంగ్ అంతా అక్కడ చేరింది. సోషల్ సర్వీసుల మీద ఆ అమ్మాయి ఉపన్యాసం ఇచ్చేటప్పటికి కుర్రాళ్లంతా టెన్నిస్ బాట్లు అస్త్ర సన్యాసం చేసి ఆమె సంఘ సేవా దళంలో వాలంటీర్లుగా చేరారు. ఇప్పుడావిడే సెక్రటరీ.

సూర్య : మరి సుబ్బారావ్.

శంక: ఓరి, వాడెంత నాటకమాటాడని! ప్రెసిడెంటు గిరీకి నన్నూ రామలింగాన్ని ప్రోత్సాహపరిచి ఒకళ్లకొకళ్లను పోటీగా నిలబెట్టారు. తననీ సెక్రటరీగా ప్రొపోజు చెయ్యమని నన్ను బతిమాలాడు. నీకు వద్దన్నావు కాదోయ్ వెధవ సెక్రటరీ అని అన్నా-కాదూ కూడదని పట్టుబట్టాడు-కాని యూత్స్ అంతా వేరే లీగ్ అయిపోయారు-మాముగ్గురికీ దేవిడీమన్నా చెప్పారు.

సూర్య : రామలింగం రాలేదే.

శంక : (నవ్వుతూ) నాకు తెలియలేదు. రామలింగం దగ్గిర 5000 డొనేషన్ అని పుచ్చుకొన్నాడట. తీరా అతని పేరు ప్రొపోజ్ అయినా చెయ్యలేదు. అతను క్లబ్‌లో రిజైన్ ఇచ్చి తన ఐదు వేలు తనకియ్యవలసిందని క్లబ్ మీద దావా వేశాడు. ఈ విడ, సరోజ, సెక్రటరీ అయినప్పటినుంచీ అకౌంట్సు చూపించమని సుబ్బారావు వెంటబడింది. అప్పట్నించే మొహం చాటేస్తున్నాడు.

సూర్య : భలేగా అయిందే!

శంక : ఆగు! అంతతో అయిందీ-సుబ్బారావు ఇంట్లో బట్టల బేళ్లు ఉన్నాయని రామలింగం-రామలింగం, లారీల మీద బియ్యం బ్లాకులో రవాణా చేస్తున్నాడని సుబ్బారావు, ఒకళ్లమీద ఒకళ్లు ఆకాశరామన్న అర్జీలు పెట్టారు. ఇద్దరూ ఆఫీసర్ల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు.

సూర్య : భేష్, భేష్, మరి క్లబ్బు కార్యక్రమం ఎల్లా ఉంది?

శంక : క్లబ్ కార్యక్రమం అంతా మారిపోయింది. సరోజగారు క్లబ్ సెక్రటరీగా ఆఫీసులకుపోయి, ఏయే వర్తకుల కెంత స్టాక్ పర్మిట్ అయిందీ-ఏ తేది లోపల వాళ్లు రిలీజ్ చేయించాల్సిందీ అన్నీ లెక్కలు తెప్పిస్తోంది. ఆ నాటికి క్లబ్ వాలంటీర్ల గ్రూపులు అక్కడక్కడికి జేర్తాయి-క్యూలలో చివరి మనిషి దాకా వస్తువు అందవలసిందే-క్లబ్ పేరు చెప్తే ఊళ్లో వర్తకులందరికీ హడలుగా ఉంది. ఈ విడ పని చూశాక కాస్త పోలీస్, యితర అధికారులు కూడా, భయంతోనో, భక్తితోనో, వలంటీర్లకుతోడు పోలీసులను పంపి అల్ల

రులు జరుగకుండా చూస్తున్నారు. రామలింగం మొన్న ఒకచో గోల-ఇప్పుడు క్లబ్బులో పాత మెంబర్లు ఒకాళ్ళ మీద ఒకాళ్లు కారాలు మిరియాలూ నూర్తున్నారు.

సూర్య: అరె; భలేగా జరిగిందే? ఈ మిస్ సరోజలో ఇంత కార్యదీక్ష ఉందని నాకు తెలియదుసుమా! ఆవిడను అభినందించాల్సిందే.

శంక: ఏం అభినందించటం? మన లాంటి మధ్యరకం జనం అంతా తిట్టిపోస్తున్నారు. ఏ చీకటి బజారులోనో డబ్బు పెడ్తే తిండి, గుడ్డా అన్నీ దొరికేవి. ఇప్పుడవే నల్లగీతోపాటు తప్ప ఎక్కువ దక్కటం లేదే అని—

సూర్య: ఓయ్! అమాత్రం అల్లరి పడకుండా సోషల్ సర్వీస్ ఏమిటి గనే— అయినా పెళ్లికాని పిల్లను అంతటితో పోనిచ్చారు?

శంక: ఆవిడంటే అవలంగిరలూ— కే ధీటో పోయే అలగాజనానికి అందరికీ భక్తిప్రపత్తులెక్కువై పోయాయి. ఆవిడ నెవరన్నా ఏమన్నా అంటే నడిబజారులో నల్గురూ తన్నేట్లున్నారు— అదుగో కృష్ణవేణమ్మగారు వస్తోంది—

సూర్య: అవును ఇప్పుడు ఈవిడ పని ఎల్లా ఉంది?

శంక: ఈ సరోజకు ఆ చీకటి బజారువాళ్ళకూ సామరస్య రాయబారాలు నడుపుతూంది. రండి కృష్ణవేణమ్మ గారూ రండి- నమస్కారమండి.

(కృష్ణవేణమ్మ ప్రవేశం)

కృష్ణ: నమస్కారమండి. నమస్కారమండి సూర్యనారాయణ గారూ—ఎక్కడా కనబడటం లేదు...

సూర్య: మీ సోషల్ సర్వీస్‌లో మే మెక్కడ కనబడతామండీ—

కృష్ణ: నా మొహం సర్వీసులు లెండి. అదుగో ఇప్పుడా సరోజమ్మ చేస్తోందిగా; మేమంతా పాత మెంబర్లమయి పోయాము- అయినా అదేం చోద్యమండి – బజారులో ఎవరినీ వ్యాపారం చేసుకోనియ్యదా ఏమిటి—?

సూర్య: అసలు మీరే గాదండి ఆవిడకీ ప్రోత్సాహ మిచ్చారు—

కృష్ణ: ప్రోత్సాహమంటే సంసారపక్షంగా—ఏదో పురమందిరం, దాని బాగోగులు, ఏదో కాస్త మనమూ, మన ఘరానా చెడకుండా చెయ్యగల కించిత్సేవా తప్ప— ఇల్లా ఊరిమీద పడి—మగ ఆడ వివక్షత లేకుండా—ప్రజాక్షేమం అంటూ పదిమంది వలంటీరు కుర్రాళ్లను వెంటవేసుకొని—ప్రతివాళ్ళనోట్లోనూ మట్టి గొట్టటమా— ముక్కు పచ్చలార లేదు—

శంక: అబ్బ! ఇప్పుడా ముక్కు పచ్చలారని ఆ అమ్మాయికి ఈ ఊరి ప్రజలలో ఉన్న గౌరవం ఏ నాయకుడికీ లేదు. ఊరంతా ఆవిడేం చెయ్యమంటే అది చేసేటట్టుంది.

కృష్ణ: ఆఁ పలుకుబడి కేమిటి పొగరూ, ఊరంతా అట్టుడికి నట్టుడికి పోతోంటే— ఏపట్టు పడితే—అపట్టే! ఆ రామలింగంగారు పదివేలు క్లబ్బుకిస్తాను, మా జోలికి రాకండి అని కాళ్లా వేళ్లా పడి బ్రతిమాలాడు. ఊహూ – వింటేనా – పైగా క్లబ్ అకౌంట్సుకని ఈ సుబ్బారావుగారిని సాగదీసేస్తోంది.

సూర్య: అంతేనా! ఆయన బట్టల వ్యాపారం జోలికి పోలే?-

కృష్ణ: అయ్యో, అటు మాత్రం ఊర్కుందీ-ఊళ్లో ఎవళ్ళ కోటా ఎంతో ఎవళ్ళ పర్మిట్ ఎంతో, అది వచ్చే తేదీ ఏదో ఆఫీసర్లు ముందే మాకి తెలిపిన తర్వాత కాని వర్తకులకైనా పంపించకుండా ఉన్నారు-ఇన్నాళ్లూ, కాస్త ముందర్తగా సుబ్బారావు గారితోనూ, రామలింగంగారితోనూ చెప్పకొంటే, కావలసిన బట్టలూ కొన్ని బస్తాల బియ్యమూ ఏ గదిలో ఓగదిలో ఇంటికెన్నా చేరేవి-

సూర్య: కృష్ణవేణమ్మగారూ! మరి మీరు ప్రజలకు చేద్దామన్న కించిత్సేవా ఏమిటండీ-ఇప్పుడు నల్గురికీ కాస్త న్యాయంగా తిండీ, గుడ్డా అందుతున్నాయనేనా ఆవిడ మీద మీకు కోపం—

కృష్ణ: ఆవిడ మీద నాకు కోపమేమిటండోయ్, లేనిపోని మాటలంటున్నారు. కాస్త పట్టూ, విడుపూ ఉండాలని చెప్తున్నాను. అదుగో సరోజే వస్తోంది. రా అమ్మా సరోజా! రా! నీ మాటే అనుకొంటున్నాం- అబ్బ ఏమిటమ్మా, తీరిక లేకుండా అస్తమానం అల్లా పనిలోపడి ఉంటావు.

సూర్య: కంగ్రాట్యులేషన్సు సరోజగారూ మీరు ఇంత పని చేస్తారని నేను ఏనాడూ అనుకోలేదు.

సరోజ: నమస్కారమండీ! (నవ్వుతూ) మీరింకా మీ వెటకారం మానలేదు.

సూర్య: లేదండీ! నిజంగా అభినందిస్తున్నాను.

సరోజ: నన్ను అభినందించాల్సిందేమీ లేదండి-పాపం ఆఫీసర్లు అందరూ చాలా తోడ్పడుతున్నారు.

శంక: మీ తండ్రిగారు పేరు చెప్తే చాలును గదండీ! కోటీశ్వరులాయెను-

కృష్ణ: కాదూ మరీ.

సరోజ: కాదులెండి కృష్ణవేణమ్మగారూ మా తండ్రిగారు మీరనుకొన్నంత కోటీశ్వరులేమీ కాదు. ఆయన దగ్గిర ఐదు లక్షలుంటే, అది ఈ ఊరు బాగు చెయ్యటానికి నిధి ఏర్పరచి పురమందిరానికి ట్రస్టు ఏర్పరుద్దామనుకొన్నారు-ఆయన క్లబ్ మెంబరు కారని క్లబ్‌లో అడ్డుపెడ్తే సుబ్బారావుగారూ, రామలింగంగారూ, ఆయన్ని వెడల నడిపించారు. ఇది నేనిక్కడకు రాకముందే జరిగినవిషయం. ఆయన తన పెంపుడు ఊరికే ఆ డబ్బు దానం చేసివచ్చారు. అది లేకుండా పోయినందుకే ఇక్కడ కాస్త నిజాయితీగా కృషి చేయటానికి మాకు వీలయింది.

శంక: క్షమించండి, ఆఫీసర్లు మీ మాటలు వింటున్నారంటే—

సరోజ: ఆ డబ్బుకు ఆశపడి వింటున్నారను కొన్నారు... క్షమించి ఆ

విధంగా ఆలోచించటం మానేస్తే లోకానికి చాలా వుపకారం చేసిన వారవుతారు. కృష్ణవేణమ్మగారూ, మీ రామలింగంగారూ, సుబ్బారావుగారూ వచ్చారా?

కృష్ణ: మా రామలింగంగారూ, సుబ్బారావుగారూ ఏమిటి? వారికీ నాకూ సంబంధం ఏమిటి— వాళ్లిద్దరి మధ్యే పచ్చగడ్డి భగ్గుమంటూంది—పైగా నన్ను కూడా తోడు కలపండి — అల్లాంటి మాటలనకండి బాగుండదు.

సరోజ: అదికాదమ్మా. అల్లా అపార్థం చేసికోకండి మీద్వారా ఇద్దరూ క్లబ్ సంఘానికేవో కబుర్లుపంపిస్తోంటే నయాన్న రాజీకి వస్తారేమో అనుకొన్నాను.

సూర్య: రాజీ ఏమిటండోయ్?

సరోజ: ఊరికి బియ్యం సప్లయి, గుడ్డ సప్లయ్ వలంటీర్ల ద్వారా చేయటానికి క్లబ్ పూనుకొంటుందని, ఇంటింటికి స్వయంగా వెళ్లి లెక్కలు తీసికొని స్టాక్ ప్రకారం సప్లయిలు చేస్తుందని, పురమందిర సంఘానికి పర్మిషన్ ఇప్పించమనీ అధికారులకు విన్నవించుకొన్నాను. వారు చాలా సుముఖంగా వున్నారు.

కృష్ణ: నిజంగా ఘటికురాలవమ్మా!

సరోజ: (నవ్వుతూ) నా తెలివి తేటలేమీ లేవు. మన క్లబ్ నుంచే ఎవరో సెంట్రల్ గవర్నమెంటుకు మన ఊరి విషయం అఫీషియల్ రిపోర్ట్సు రహస్యంగా పంపించే వారున్నారుట. అక్కడినుంచి ప్రావిన్షియల్ డైరెక్షన్సు వచ్చాయిట. లేకపోతే (నవ్వుతూ) ఈ అధికారయంత్రం నాలాంటి చిట్టెలుక పని చేస్తే కదులుతుందాండి.

సూర్య: మన శంకర మేనేజరో!

శంక: నాన్సెన్సు. నేను ఇక్కడివాణ్ణి మీదే ఇల్లా దగుల్బాజీ రిపోర్టులు పంపే సి. ఐ. డి. ననుకొన్నావేమిటి.

సూర్య: కాదులే బాబూ కాదు. నువ్వు జంటిల్ మేన్ వి. ఇందులో సుబ్బారావుగారూ, రామలింగంగార్ల ప్రమేయమేమిటమ్మా—

సరోజ: (నవ్వుతూ) వాళ్ళు అధికారుల దగ్గరకెళ్లి, తమ లైసెన్సులు కౌన్సిల్ చెయ్యటానికి వీల్లేదని ఇల్లా మర్చంటు అసోసియేషన్నును తోసేసి పురమందిరానికియ్యటం ఊరికి చాలా నష్ట దాయకమనీ, అధికారులు తొందరపడితే తాము సుప్రీం కోర్టుదాకా వెళ్తామనీ బెదరించారట. అధికారులు నవ్వి, మాతోటి రాజీ చేసుకోమన్నారట. అందుకనే ఎవరికి వారు నాకు కబురు చేశారు కృష్ణవేణమ్మగారి ద్వారా. ఇవాళ ఏమన్నా చెప్పారా అని—

కృష్ణ: ఏమో అవన్నీ నాకు తెలియవ్. నిన్న సుబ్బారావుగారు కనబడి ఇవాళ ఇక్కడ మీతో పనిఉంటే వస్తానన్నాడు. ప్రొద్దున్న రామలింగంగారూ ఇల్లాగే చెప్పారు. అవన్నీ నాకేం తెలుసు.

శంక: వారితో మీరే రాయబారాలు చేశారంటుందేం ఆవిడ—

సరోజ: మీకు తెలియదా శంకరంగారూ? సుబ్బారావుగారూ మీరూ కలెక్టరుగారి దగ్గరకు వెళ్లిన సంగతీ, దానిమీద సుబ్బారావుగారు నాకిచ్చినసలహా, మీరేగా అందజేశారు! నా మీద స్కాండలస్ రిపోర్ట్సు అధికారులకు అర్జీలు పెట్టించడంలో సుబ్బారావుగారికి రామలింగంగార్కి మీరేగా ముసద్దీలట!

శంక: అబ్సర్డ్! ఎవరూ చెప్పింది.

సరోజ: అదుగో సుబ్బారావుగారూ, రామలింగంగారూ వస్తున్నారు. మళ్లీ ఇద్దరూ కలిసినట్లున్నారు. శత్రువుని శత్రువులు, మిత్రులు అని పంచతంత్రం సామెత ప్రకారం ఏకార్థసముపేతులై వస్తున్నారు.

సూర్య: గుడ్ మార్నింగ్ బ్రదర్సు, రండి! రండి!!

సుబ్బా: నాకు టైమ్ లేదు. మిస్ సరోజగారూ, ఇదుగో నండి 10,000 కి చెక్కు. పుస్తకాలు, తతిమ్మా క్లబ్ అక్కౌంట్లు గుమాస్తాచేత పంపిస్తా.

సరోజ: ఏ బాపతండీ యిది?

సుబ్బా: క్లబ్ నిధి నేనేదో తినేశానని అపవాదు వేశారుగా. నాకు ఈ అక్కౌంట్సు సరిగ్గా ఉంచే తీరిక లేక నావే పది వేలు నష్టపోయాను. అందుకని మీ నిధికి ఇదిగో మీకు ఇచ్చేస్తున్నాను. ఇక క్లబ్బుకి నాకూ రాం రాం......

సరోజ: అంతేనా, క్లబ్ బట్టల వ్యాపారం చెయ్యకూడదంటారా.


సుబ్బా: మీరంతగా కావాలంటే క్లబ్ తరఫునే మేమే చేసిపెడతాం, మీరూ క్రే మమ్మల్ని రభస పెట్టకండి. రామలింగం బియ్యపు సంఘం వాళ్లు కూడా అదే మాట అంటున్నారు......

శంక: బెస్టు, ఇంకేం.

రామలింగం: ఔనండీ మా సంఘం డొనేషన్ కూడా పదివేలిస్తున్నాను ఇదిగో చెక్కు. ఇంక మీ వాలంటీర్లను మా మీదకు తోలి మమ్మల్ని రభస పెట్టకండి.

కృష్ణ: ఔనమ్మా, సరోజా తప్పకుండా అల్లా చెయ్యి. నీ సంఘసేవా కార్యక్రమం అంతా క్లబ్ తరఫున వాళ్లే నడుపుతారు-నా మాట విను......

సరోజ: ఇన్నాళ్లూ చెయ్యాలని వాళ్లకి ఇప్పుడేం తొందర వచ్చిందండీ. మీ వల్ల జరిగితే మాకింత శ్రమ ఎందుకూ. అయినా కావలిస్తే జనరల్ బాడీలో విచారించి చూద్దాం. ఈ కార్యక్రమాలు యువకులంతా మళ్లీ మీకే అప్పగిస్తారేమో.


నవంబరు 24 వ తేది విడుదల
ఆదర్శము
మాడర్న్ థియేటర్స్ తయారు
డైరెక్షన్
జి.ఆర్.రావ్
పూర్ణా రిలీస్...

సూర్య: భేష్, బాగా చెప్పారండీ—

సుబ్బా: సరోజా, గుర్తు వచ్చి పిల్లను వెక్కిరించిందని. మాకీ పాలిటిక్సు అన్నీ తెలియకపోలేదు. కాస్త నీరూపం చూసి అధికారులు సంభావిస్తున్నారని.

సరోజ: షటప్.

సుబ్బా: మాటలు మిగలవు. మేం తల్చుకుంటే, మినిస్ట్రీ నుంచే తిప్పుకురాగలం.

సూర్య: నిజం బ్రదర్. మీరు ఆ పని చేయగలరు. వాళ్ళతో తగాదా పెట్టకోకమ్మా, ఎందుకు చిట్టెలుకవు సింహాలతోటేమిటి!

రాము: మేం లేకుండా, పురమందిరానికి ధాన్యం సప్లయి అంటే ఈ ఊళ్లో ఒక గింజ రాలదు, ముందే చెప్తున్నాం జాగ్రత్త.

సరోజ: ఔనండీ మరి పురమందిరం తరఫున చేస్తామంటున్నారుగా—

రాము: అంటే కావలిస్తే ఆ పేరునే చేస్తాం, కాని మీరంతా ప్రతి దాంట్లోనూ అడ్డు వస్తోంటే మాకు అసలు సాగదు.

కృష్ణ: ఎందుకమ్మాయ్ సరోజా, లేనిపోని బరువులు పురమందిరం పేరిట నెత్తి నెత్తుకోవటం— వాళ్ళు చక్కా చూస్తామంటున్నారుగా వదిలేయరాదూ—

సూర్య: ఔను చక్కగా మునుపటిలాగే సాగిపోతుంది, క్లబ్బుకు మరో ఇరవై వేలునిధి చేరుతుంది. శంకరం కంట్రాక్టు పుచ్చుకోవోయ్ మరో బిల్డింగ్ కట్టించవచ్చు.

శంక: నాన్నన్ను నా సిమెంటు విషయంలో ధోకా ఏమీ లేదు ..

సరోజ: (నవ్వుతూ) అదీ చూస్తున్నామండి. మీ సిమెంటు బజారూ, కృష్ణవేణమ్మగారి, మహిళా మండలి గ్రాంటులూకూడా అజకు వచ్చాయి. సుబ్బారావుగారూ, రామలింగంగారూ. మీ చెక్కులివిగో, పురసంఘం ఊరి బాగోగులన్నీ తన మీద వేసుకుంది. మీలాంటి వ్యక్తులంతా, అడ్డు తగిలి లాభం లేదు—

రాము: }
సుబ్బా: } మేమూ వెళ్తున్నాం.

సూర్య: బ్రదర్సు అండ్ సిస్టర్సు కొంచెం ఆగండి, మిస్ సరోజా మీరు కూడా రావాలి—ఇదిగో సుబ్బారావ్, రామలింగం ఈ బాడ్జి చూశారా.

సుబ్బా: ఆ, ఆ, నువ్వు సెంట్రల్ సి. ఐ. డి వా? అరి స్కౌండ్రల్! నన్ను మల్లు తేనులు కూడా అడిగావ్—

రాము: ఆ! ఆ! నువ్వేనా—మా అందరి మీదా రిపోర్టు వ్రాసింది? ఈ సరోజమ్మ క్లబ్‌కి ఊరంతా ధారాదత్తం చెయ్యమని వ్రాయించింది నువ్వేనా, అరి రోగ్!

సూర్య: శంకరం, కృష్ణవేణమ్మగారూ మీకు ఇంగ్లీషు తిట్లు రావా యేమిటి. అల్లాపాపం దిగాలు పడి చూస్తున్నారే—

శంక: నువ్వు--నువ్వు—వట్టి—స్వామి ద్రోహిని-

సూర్య: రైట్! అల్లా సంస్కృతంలో తిట్టు. కృష్ణవేణమ్మగారూ-

కృష్ణ: నాతో మాట్లాడకండి-మీ అంత కుచ్చితులతో నాకేం పనిలేదు.

సూర్య: ఉండండీ, ఉంది. కొంచెం కలెక్టరు గారి దగ్గర దాకా అంతా రండి— సరోజగారూ...


సరోజ: నమస్కారం సూర్యనారాయణగారూ! మీరు మా సంఘానికి ఇంత సేవ చేశారని నేను కలలోనైనా అనుకోలేదు. మిమ్మల్ని అపార్థం చేసుకొని ఎందుకూ పనికిరాని బద్ధకస్తులను కొన్నాను- క్షమించండి.

సూర్య: (నవ్వుతూ) క్షమించక్కర లేదండీ, నేను బద్ధకస్తుడనే! అదంతా అఫీషియల్ డ్యూటీలెండి, దానికీ దీనికీ సంబంధం లేదు. కలెక్టరుగారి దగ్గర మన ఈ మిత్రులంతా, ఈ కార్యక్రమం మీ సంఘానికి అప్ప చెప్పటానికి చాలా ఉత్సాహంతో ఉన్నారు. ఏం బ్రదర్సు అంతేనా-

సుబ్బా: స్కౌండ్రల్-

సూర్య: రైట్! బాయ్, ఒక పేక దస్తా తేరా. అక్కడ మళ్ళీ మాకు కాలక్షేపం కాదు-పదండి బ్రదర్సు అండ్ సిస్టర్సు-రండి చిట్టెలుకగారూ-

సరోజ: (నవ్వుతూ) పదండి సింహం గారూ...... [తెర]



సగోత్రకులు

(6-వ పేజీ తరువాయి)

ఉంటు వసారా. ఓ రోజున తండ్రిగదిలోంచి వడుతుండగా భార్య లేవలేదు. అది చూచాడు రామం. మామగారొస్తే కోడలు లేచి ఒబ్బిడిగాచి దిగి నిల్చుండడం వాళ్ళ ఊళ్ళో ఆచారం. ఈ ఆచారాలంటే పట్టుదల రామయ్యకి. ఇల్లు చిన్నదవటంవల్ల యిలాంటివి అనుకోకుండా జరగడం, తండ్రి అపార్థం చేసుకుని కష్టపెట్టుకోవటం యిష్టంలేదు రామానికి. అందుకని తండ్రిని పిల్చి చెప్పాడు.

"నేను గుమాస్తాని. యింతకంటే పెద్ద యిల్లు, అద్దెకు తీసుకోలేను. మన యింట్లో అనాదినుంచి వస్తున్న ఆచారాలు నాకు తెలుసు. కాని పరిస్థితులకు తలొగ్గాలి. మీ రొస్తే మీ కోడలు లేవలేదని బాధపడతారు. ఇవి తెలిసో తెలియకో జరుగుతాయి. మీరు కలివిడిగా, గొడవా రభసా లేకుండా ఉంటే, మీరు యిక్కడున్నాళ్లున్నా నాకిష్టమే."

మారు చెప్పలేదు రామయ్య.

నెల తిరిగేటప్పటికల్లా గ్రామం చేరుకున్నాడు రామయ్య.

"ఏం బాబూ—అప్పుడే తిరిగొచ్చారు, రెండుమూడు నెల్లుంటా నన్నారుగదండీ" అన్నాడు పాలేరు భీమన్న.

"ఇంటిదుంటే నే నెక్కడ తిరిగినా బాధుండదు. ఆ అదృష్టం నాకు లేకపోయిందిరా భీమన్నా ఏ నాటికయినా ఈ ఘటం యిక్కడే కళ్ళు మూరవలసిందేగదా. చూశొచ్చాను మా వాళ్ళ నందరినీ—చాలు." అన్నాడు రామయ్య.................

దార్ధక్యం...మంచాన పడ్డాడు. మూడేళ్ళ తరువాత గుటుక్కుమంది రామయ్య ప్రాణి కొడుకు లెవర్నీ పిలవకుండానే. ఊళ్ళో తలాకచెయ్యి వేసింది పాడె లేవడానికి. దినానికి జేరి సొరుగులు వెతికారు కొడుకులు.

అంతా స్వార్జితం......చిన్నకొడుక్కి వ్రాసి ఉంది.

భగ్గుమన్నారు పెద్దవాళ్లిద్దరూను. ★

వినయప్రవర్తన

"ఒరేయ్! అబ్బాయ్! యిక లెగవరా."

"అబ్బ! మళ్ళీ యివాళే మొచ్చింది యీ ముసలమ్మకు; నన్ను నిద్రలేపొద్దని లక్షాతొంభై సార్లు చెప్పాను. ఏ రోజుకా రోజు కొత్తేనాయె!' అనుకుంటూ కాళ్ళ కిందవున్న దుప్పటివేళ్ళతో గట్టిగా నొక్కిపట్టి, రెండోచెంగును తలమీదుగా లాగి చెవులకిందకు నెట్టుకుని, కడుపులోకి ముడుచుకుంటున్న మోకాళ్ళమధ్య ఎడం చేయివుంచుకొని, కుడిచేత్తో దిండును ముఖంమీదకు వత్తుకుని సీతామ్మవారిని పెళ్లిచేసుకోపోయేముందు శ్రీరామచంద్రుల వారు వంచిన శివధనస్సులా—బిర్రుగా, బరువుగా ముసుకు నిగడదన్ని; మగతగా మత్తుగా, వెచ్చగా తెరలు తెరలుగా వస్తూన్న నిద్ర అలల్లో తేలిపోయేందుకు ప్రయత్నించాను.

అబ్బే! వూరుకుంటేనా మరి.

"లెగవరా నాయనా! బారెడు పొద్దెక్కినా ఏం నిద్దరా? నీ నిద్ర మండి పోను!"

అమ్మమ్మ అంత గట్టిగా అనడంలో ఏదో అంతరార్థం వుందని గ్రహించాను. బహుశ నీళ్లు తెచ్చే పనిపిల్ల వచ్చివుండదేమో? అమ్మమ్మ అలాంటి అవకాశం కలిగినప్పుడల్లా నామీద విరుచుకుపడేందుకు పూర్తిగా వుపయోగించుకునేది. ఆమెగారికి అంతకన్నా మంచి అవకాశమేముంది మరి. ఇతరత్రా అయితే తేలిగ్గా దబాయించి పారేస్తానాయె. పనిపిల్ల రాని రోజు మాత్రం, '8-30 గంటలకు కొళాయి కట్టేసిం తర్వాత లేస్తే ఏంతాగుతావురా?' అనే అమ్మమ్మకు ముసుకులోనే వుండి యిచ్చే సమాధానం ఏమీ వుండదు; చివాలునలేచి కూర్చొని నడ్డి విరుచుకొని నీళ్ళ బిందెతీసుకోవడం మినహా.

అలా బిందె తీసుకొని మామేడ పదమూడు మెట్లూ ఒక్కొక్కటే దేక్కుంటూనిద్రమొహంతో బజారుకొట్లముందుగా పక్కింటి దమయంతి కొళాయి దగ్గరకెళ్తే, అక్కడ వొక చావుకాదు. అంత చీకాకులోను నిద్రమత్తులోను ఆవిడ్ను చూసి అదో రకంగా నవ్వాల్సిందే. అదోరకంగా నవ్వడంఅంటే మరేం కాదులెండి! ఆవిడ అందాన్ని, పాతివ్రత్యాన్ని చూసిమెచ్చుకొని ఆనందిస్తున్నట్టుగా నవ్వాలి. ఏమిటో ఖర్మ! ఏభైయ్యో పడి చేరుకుంటున్నా, సీతాకోక చిలుకలా సింగారించుకొని టింగురంగా అంటూ రాత్రి తొమ్మిదిగంటలదాకా చైనాబజార్లో తిరిగి, వంటిగంటదాకా వాకిట్లో కాపలాకాసే ఆవిడనుచూసి ఆవిడ వయస్సులో సగంకంటే తక్కువగా వున్న నేను అదో మాదిరిగా నవ్వి ఆనందించి గుటకలు మింగాల్సిందే—వెధవ ఆ నాలుగు బిందెల నీళ్ళకోసం! లేక

"వసశ్రీ"

పోతే ఆపూటకు ఆవొక్క బిందెడుతోనే సరి; వెధవ నాలుగు బిందెలు నీళ్ళంటే అమ్మమ్మ గొంతు పుచ్చుకుంటుంది. అలా ఎప్పుడైనా వొబిందెడు నీళ్ళు, తక్కువ తెచ్చి వెళ్లానంటే సాయంకాలం కాలేజి నుంచి వచ్చేసరికి అమ్మమ్మలం కించుకుంటుంది. మధ్యాహ్నం నుంచీ నీళ్ళకు నానా అవసాట్లయిందని, అల్లాడిపోయానని, యింకేమేమో అయిందనీ, సబ్బుపెట్టి వుంచిన తన ఎర్రరంగు మల్లుపంచ వుతక్కుండా అలాగే వుండిపోయిందనీ...

"నీగ్గాదంటారా చెప్పేదీ?" కంకర్రాయిలా తగిలిన ఆ మాటకు బిర్రుగా తన్నిపట్టిన ముసుగులోంచి బిళ్ళంగోడులా లేచి కూర్చున్నాను.

"ఏంటమ్మమ్మా! అంత ముంచుకు పోయిందీ!" "ముంచుకునే వచ్చిందిరా నాయనా! మళ్ళీ ఏంకొంప మునిగిందో!" కిటికీ చువ్వలకు కర్చుకుపోయి ఎగశ్వాస దిగశ్వాసతో కిందకు చూస్తూ నుంచుంది అమ్మమ్మ.

అమ్మమ్మ వాలంకంచూస్తే పనిపిల్ల రాక పోవడంకాదు; అంతకుమించి ఏదో ముంచుకొచ్చినట్టుగానే తోచింది. అయినా నా అనుమానం కొద్దీ నీళ్ళకుండల వైపోసారి చూశాను. కొన్నిటినిండా నీళ్లున్నయ్. బిందెలేదు. కాబట్టి పనిపిల్ల వచ్చేవుంటుందనుకొని—

"అమ్మమ్మా! నీళ్లు తెచ్చేది వచ్చినట్టుందే!"

"నీళ్లా నిప్పలూను! పోలీసుల్రా పోలీసులు!" అమ్మమ్మ ముందుమాట ఎంత గట్టిగా అందో చివరమాట అంత తేలిపోయేట్టు అంది.

అసలమ్మమ్మకు పోలీసోళ్లంటే తగని భయం ఆ మాటకొస్తే ఆంధ్రదేశంలో పోలీసులంటే భయంలేం దెవరికనొచ్చు! అలా కాదు. అమ్మమ్మ భయం వేరు. అందరికీ పోలీసుల లాఠీలు, తుపాకులు చూస్తే భయం; కాని అమ్మమ్మకు ఆ ఎర్రటోపీ చూస్తేనే భయం. దానికొక్కారణం వుందనుకోండి. బుల్లేపల్లి


లాంటి పల్లెటూళ్ళో పుట్టి పెరిగిన అమ్మమ్మకు ఎర్రబుట్ట చూస్తేనే అంతభయం. అంతే ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. ఈ మూడు సంవత్సరాలు ఆ ప్రాంతంలోనే వుంటే కొంతవరకు అభయం కాస్తా తీరిపోయేదేమో ? కాని మూడు సంవత్సరాల్నుంచీ అమ్మమ్మ మనవడికి వండిపెట్టటానికి మద్రాసులో మకాం వేసిందాయె.

అమ్మమ్మ యిప్పటికీ చెప్తావుంటుంది. వాళ్ళ మూడో అమ్మాయి పుటకలకు – వాళ్ళవూళ్ళో వో పెద్ద కేసు నడిచిందని. అప్పట్లో వో రోజున కాకీ లుడీగీలు, మేజోళ్ళు, నల్ల బూడుసులు వేసుకుని, ఎర్రబుట్టలు పెట్టుకుని నలుగురు వాళ్ళూరు వొచ్చారట. వాళ్ళు వచ్చి రావడంతోనే, రచ్చబండల మీద కూర్చొని చర్చలు సాగిస్తున్న మొగవాళ్ళు ఎక్కడవాళ్ళక్కడ పరారయిసారట. రొమ్ములమీద గుప్పెడెత్తున కండలు పెరిగి కొమ్ములు తిరిగిన పిడుగులాంటి రామయ్య పొలంపోయి కూర్చుని అర్ధరాత్రయింతర్వాతగాని యింటికిరాలేదట. బరిమీద వొక్క దెబ్బన నాలుగు తలకాయల్ని కొబ్బరికాయల్లా పగలకొట్టిన వస్తాదు నరసిమ్మయ్య పొరుగూరుపోయి మూడోరోజున కాని రాలేదట. మీసాలమీద నిమ్మకాయలు నిలిపిన భీమయ్య కోళ్ళగూట్లో దూరాట్ట. ఇంకెందుకులేండి! యిలా ఎవరిమట్టుకు వాళ్ళు తలోదార్ని తప్పుకున్నారట.

అయితే ఆడంగులు మాత్రం వోరగా వేసిన తలుపు సందుల్లోంచి, కిటికీ చువ్వల్లోంచి – ఆ లుడిగీల్ని, నల్లబూడ్సుల్ని, ఎర్రబుట్టల్ని చూస్తూనే వున్నారట; మగవాళ్లు గాదెల చాటునుంచీ, భోషాణాల్లోంచి బుసలు కొట్టూంటే.


ఇంకేముంది! అలా వచ్చిన ఎర్రచుట్టలోళ్లు సరిగ్గా అమ్మమ్మగారి యింటిముందే ఆగిపోయేసరికి అమ్మమ్మ స్పృహతప్పి మూర్ఛపోయిందట. నిండు నెల్లాయె మరి; అయినా ఆమెగారు అప్పుడు జరిగిందంతా స్వయంగా తను చూసినట్టే చెప్తుంది. అదేంటమ్మమ్మా! మూర్ఛపోయి ఎలా చూశావంటే కోపంవచ్చి మూతిముడుచుకొని 'నీవన్నీ రాలుగాయ మాటల్లా తిప్పకాయ కాలం!' అనుకునేది. సరే, ఆ కాలం మూర్ఛలు అంతే అనుకొని చెప్పమని బ్రతిమిలాడితే కాసేపు సాగదీయించుకుని మరీ చెప్పేది.

ఆవజాన, అందాకా అరివేణిబానల చాటున దాక్కున్న వాళ్ళపెద్దన్న, పుటిక్కిన బుట్టలోళ్లు ఆడోళ్ళ నేమయినా అనిపోతారేమోనని, ఆడోళ్ల సందర్నీ లోపలికి పొమ్మని వొకరంకెవేసి తను బయటకొచ్చి పోలీసోళ్ళ ముందుకొచ్చి నిల్చున్నాట్ట. జారిపోతున్న గిరజాల జుట్టును ముడివేసుకుంటూ, పంచ మోకాళ్ళపైకి మడిచి దోపుకుని, చేతులు కట్టుకుని తలవంచి అతి వినయంగా సిత్తం సిత్తం అన్నాడట.



ఆ వచ్చిన పోలీసోళ్లు, పక్కవూళ్లో ఏదో ఖూనీకేసు జరిగిందనీ సాక్ష్యం వుండాలనీ అడిగితే, ఆ వూళ్ళోళ్ళగుండానే తాము సంతకు పోవాల్సి వుంటుందని వాళ్ళ మీన సాచ్చికం చెప్పి తాము మనలేమని మనివి చేసుకున్నాడట.

పోలీసులు వెళ్ళాక, వాళ్లపెద్దన్న ధైర్య సాహసాల్ని గురించి గుంపులు పడి



వింతగా పక్క పదిపదిహేనూళ్ళ దాకా చెప్పుకున్నారట.

మరుసటిరోజు, నలుగురు పగటి వేషగాళ్ళొచ్చి ఆ క్రిందటిరోజున పోలీసు వేషాలేసుకొచ్చినందుకు డబ్బూ, బియ్యం అడుక్కుని చక్కా పోయారని అమ్మమ్మ చెప్తూంటే నాకు నవ్వూ ఏడుపూ రెండూ వచ్చేయి.

ఆతర్వాత నిజంగా పోలీసులొచ్చినప్పుడుకూడా వాళ్ళ పెద్దన్నే ముందు నుంచున్నాట్టకూడాను. ఆమాట చెప్పక పోతే అమ్మమ్మకు కోపం రావొచ్చు!

ఇంతకీ, యింటిముందు కొచ్చి కూర్చున్న పోలీసుల సంగతి వదిలేసి అమ్మమ్మ పోలీసు అనుభవాల్ని, పోలీసులంటే ఆమెకున్న భయాన్ని, అభిప్రాయాల్ని గుర్తుచేసుకుని నెమరు వేసుకు పోతూంటే - యింట్లో యింతసేపటిదాకా దేన్నో సర్దుతున్నాననో, ఎవడినన్నా దాస్తున్నాననో లేనిపోని అనుమానం వాళ్ళకి కలిగిందంటే మొదటికే మోసం రావొచ్చు, అనుకొని కప్పుకున్న దుప్పటి విసిరేసి వూడిపోయిన లుంగీ చుట్టుకుంటూ-"ఎక్కడ! ఏమిటమ్మమ్మా?" అంటూ అమ్మమ్మ దగ్గర కెళ్లి ఆమె చూస్తున్న వైపే కిటికీలోనుంచి కిందికి చూశాను.

ఇంకేముంది! పోలీస్ వేన్!! సరిగ్గా మా వాకిలిముందే ఆగివుంది. చుట్టూ చేరివున్న జనంలో తేలిపోతూ పది పదిహేను ఎర్రటోపీలు కనపడ్తూనే వున్నయ్.

నేను భయపడాల్సిన కారణం మెదడుకు తోచకపోయినా, నా గుండెలు మాత్రం వాటంతటవే జారిపోయినై. పోలీసులకూ భయానికీ ఏదో అవినాభావ సంబంధాన్ని మనసు వూహించివుంటుంది.

"ఏంరా నాయనా! మళ్ళీ యింట్లో ఏమన్నా తెచ్చిపెట్టావా ఏమిటిరా? ఖర్మ!" గుండెలమీద చేతులు వేసుకుని దడదడలాడుతూ అమ్మమ్మ సొద మొదలు పెట్టింది.

ఆమెగారు 'మళ్ళీ' అనడంలో - వో గొప్ప విశేషం లేకపోలేదు. అప్పుడోసారి మా నాన్నగారొచ్చినప్పుడు యింట్లో వున్న ఎర్రట్ట పుస్తకాలన్నీ చించి తగలేయమని అమ్మమ్మ చెవిలో వూదిపోయారట. అంతటితో అమ్మమ్మ లంకాదహనానికి పూనుకుంది. ఓ రోజు లేచి చూసేసరికి బొగ్గులపొయ్యి కింద మండిపోతున్నాయి. పుస్తకాల్ని అట్టలతో సహా గుంజి చించి మడిచి దోపేసింది; ఇంకా చెప్పుకుపోతూంటే మీకూ రావొచ్చు అనుమానం - అవేవో పేర్లుకూడా చెప్పటానికి వీల్లేని

వల్లమాలిన గ్రంథాలని! ఇంతకీ అవి – జీవకారుణ్య సమితివాళ్ళు ప్రకటించిన జంతుబలి నిషేధం తాలూకు పుస్తకాలు. మా వీధిలోనే వున్న జీవకారుణ్య సంఘంవాళ్ళు వూరికే యిస్తుంటే పోనీయడ మెందుకని యిచ్చినంతవరకూ వద్దనకుండా తెచ్చుకొని దొంతర్లు పేర్చేశాను. అమ్మమ్మ వాటిమీద యెన్నాళ్లనుంచీ కన్ను వేసి వుంచిందో?

'అదేమి టమ్మమ్మా! అలా ఆ పుస్తకాన్నీ తగలేస్తావ్? పొయ్యి వెలిగించుకోటానికి కట్టుకుపోయి నన్ని మామూలు పేపర్లుండగా' అంటే 'ఒరేయ్! యిక నుంచీ యిటువంటి కమ్యూనిష్టోళ్ళ పుస్తకాలు తెచ్చి యింట్లోపెట్టావంటే మాట దక్కదు. మీ నాన్న మొన్నొచ్చినప్పుడదేపనిగా చెప్పి వెళ్ళారం'ది.

'మంచిపని చేశావ్! అవేం కమ్యూనిష్టు పుస్తకాలే?' నవ్వూ, కోపం రెండూ వచ్చినయ్. అందుకామె–'వరేయ్! నేనంత పిచ్చిముండను కాదు లేరా' అంటూ వో పుస్తకం అట్టమీద ఎర్రరంగులో వున్న బొమ్మను తెలివిగా చూపించింది.

ఆచిత్రంలో— 'అహింసా పరమో ధర్మః' అని రాసివున్న అక్షరాలకిందగా; వో కేవరగుడి, గుడిముందు బలికి సిద్ధంచేయబడి – వేపమండలు మెళ్ళో వెళ్లాడుతూండగా, మెడపైకెత్తి అరుస్తూన్న మేక; వొక కోడిపెట్ట; వాటిని చంపటానికి సినిమాలోని రాక్షసుడులా మీసాలు మెలితిరిగి వికృతాకారంతో ఒకడు కత్తి పైకెత్తిపట్టుకొని వుంటాడు. గాంధీటోపీ పెట్టుకొన్న వొకవ్యక్తి రెండుచేతులూ పైకెత్తి 'వద్దు! వద్దు!' అంటూ వుంటాడు – అదీ సంగతి.

అందులో, ఎవర్ని కమ్యూనిష్టుగా వూహించుకుందో, ఆ చిత్రాన్నంతా ఏంగా చిత్రించుకుందో, ఆ అమ్మమ్మకే తెలియాలి; లేకపోతే యెర్రట్ట పుస్తకాలు తగలేయమని ఆమెగారి కుపదేశించిన మానాన్న గారికైనా తెలియాలి.

ఇంతకీ పోలీసుల సంగతి రాగానే కమ్యూనిష్టు గొడవల్లో ఎందుకు పడ్డారో అమ్మమ్మకే కాదు నాకూ అర్థం కాదు. పోలీసులకూ భయానికీ వున్న సంబంధంలాంటిదే కమ్యూనిష్టులకూ పోలీసులకూ వుందేమో? మరి పాడుగొడవ!

అయినా, నేనేమన్నా కమ్యూనిష్టునా పోలీసులంటే భయపట్టానికి? జీవకారుణ్య సంఘంవాళ్ల జంతుబలి నిషేధ ప్రచార గ్రంథాలు ఎంత కమ్యూనిష్టు సారస్వతమో నేనూ అంతవరకే కమ్యూనిష్టును.

మాటలధోరణిలో కొళాయినీళ్ళ దగ్గర్నుంచీ వ్యవహారాన్ని యింతవరకూ సాగదీసిననన్ను చూస్తే మీలో కొంతమందికైనా యితగాడికేదో ఆ పాతవాసన లున్నాయేమోనని అనుమానాస్పదంగా వుండొచ్చు!

అందాకా వచ్చింది కాబట్టి నిజం చెప్పేస్తాను. చేసిన పాపం చెప్పితే తీరుతుందంటారు గదూ!

నాలుగైదు సంవత్సరాల నాడెప్పుడో నాకు తెలీకుండానే నాలో వో కమ్యూనిష్టు జొరబడ్డాడు. ఆ తర్వాత వాడి అతగతీ నేనంతగా పట్టించుకోలేదు. ఈ మధ్య వో సంవత్సరంన్నర క్రిందట ఏదో అవసరంకొద్దీ ఆ లోపలివాడు యింకా వున్నాడేమోనని వెదికిచూశాను. అసలు నిజంగా వున్నాడో లేడో గాని నా మట్టుకు నాకు వున్నట్టుగానే అనుమానం తోచింది. లోపలివాడిని లోపలే అణిచి, గొంతు నులిమి చంపేయాలని – పోలీసులను, జైళ్లను, లాఠీలను, తుపాకిగుళ్ళను చూపించి బెదిరించి చూశాను. దానికి ఆ లోపల వాడు లొంగిపోయినట్టు నమ్మకం తోచలేదు. నేనూ అంత తేలిగ్గా వదలేరకం కాదు కాబట్టి యింకో రకం ఆయుధాల్ని వాడి చూశాను. ఉన్న కొద్ది ఆస్తిని, కాబోయే పెళ్ళాన్ని, రాబోయే వుద్యోగాన్నీ, నా వెనుక నోరు తెరుచుకు చూస్తున్న ఆత్మీయుల్ని, పైనా బజారు తిరుగుడునుంచీ – మెరీనా కాంటీన్ల దాకా కలసి మెలివేసుకుపోయిన ఐహిక వాంఛల తాలూకు వేదాంతాన్ని కలిపి కరగించి, రంగరించి నూరు పోసే సరికి చప్పున లొంగిపోయాడు లోపలివాడు పిల్లిలా కిక్కురుమనకుండా.

అలా బలవర్మరణం పొందిన వాడి శవం కుళ్లి చీకి, దాని తాలూకు కుళ్లు కంపు వుక్కిరిబిక్కిరి అయ్యేటుగా నాలోంచి కొంతకాలంపాటు కొట్టి ఆగిపోయింది. తర్వాత త్వరలోనే పదిహేడణాల పచ్చి దేశభక్తుడుగా అయాననుకుంటాను.

కాని, మా అమ్మమ్మకు నాలో వచ్చిన యీ మార్పును అర్థంచేసుకునేంత చైతన్యం లేదు. అసలమ్మమ్మకు దేశభక్తుడికి, దేశద్రోహికి అంతగా భేదం తెలీదేమో? నేను దేశానికి ఏమైనా తనకు మాత్రం మనుమడుగానే చూసుకుంటుంది అమ్మమ్మ. ఆ మాటకొస్తే అమ్మమ్మకు ఆనాడు నే చేసిన దేశద్రోహమూ కనపడలేదు. యీనాడు నే చేస్తున్న దేశసేవా కనపడలేదు. నేను ఎప్పుడు ఏం చేసినా అది నా మనసు గోడలుదాటి బయటికి రాలేదు.

అమ్మమ్మ నా గురించి ఎక్కువగా సంతోషపడేది. మంచి ఆస్తిగల వో అమ్మాయిని పెళ్లిచేసుకున్నప్పుడో, లేక హోదాగల వుద్యోగం చేస్తున్నప్పుడో; అంతకూ మించివస్తే విసుక్కోకుండా అడగ్గానే వో రెండు బిందెలు నీళ్ళు ఎక్కువగా తెచ్చినప్పుడూను.

ఏమైనా, యింటిముందు పోలీసు లారీ వచ్చినుంచున్నందుగ్గా యింత రాద్ధాంతం చేసుకుంటున్న నా మనస్తత్వం నాకే వింతగా తోచింది. నా భ్రమ కాకపోతే యేమిటీ యిదంతాను? ఆనాడు మా అమ్మమ్మగారూళ్ళో చేసినట్టుగా వుంది. యింకేం! సత్సంప్రదాయాలు ఎక్కడికి పోతయ్!– కోడిపందేల్లో రోషాలు పెంచుకొని మీసాలు పీకేసుకుని దేశాన్ని రక్తపాతంలో ముంచెత్తిన ఆంధ్రజాతిలో–యీ పిరికి గుండెలు-హతోస్మి!—

కళ్ళు వోసారి గట్టిగా నులుముకుని వంకెనున్న చొక్కాలో తలదూర్చేసరికి–

"ఒరేయ్! అబ్బాయ్! మెట్లెక్కి వస్తున్నట్టున్నార్రా!" ఆదుర్దాగా హడలిపోతూ అంది అమ్మమ్మ.

వనక అమ్మమ్మ అంటూన్నది వినిపించుకోకుండానే వొక్క వూపులో మా పదమూడు మెట్లూ దిగి కిందకు వచ్చేశాను.

పోలీసు వేన్! వాకిలి కడ్డంగా పెనుభూతంలా ఆగివుంది. రుటాపుకు కొంచెం కిందగా వున్న కంతల్లోంచి మూతులు బయటకు పెట్టి నా గుండెల్లోకి చూస్తూన్న తుపాకులు నా దృష్టిని ఆకర్షించుకొన్నాయ్. అవి అలా నా వంకేసి దీక్షగా చూస్తూంటే నా గుండెలు గతుక్కుమన్నాయ్. వాటినుంచి బలవంతంగా తప్పించుకొన్న నా కళ్లు ఎదురుగా కారుకు అంటించబడివున్న పోస్టరుపై పడినయ్.

'వినయ ప్రవర్తన వారం! – యింగ్లీషులోను, తమిళంలోను, తెలుగులోనూ రాసివుంది. అమ్మయ్య! బ్రతికేంరా భగవంతుడా! అని మనసుకుదుట పరచుకుని నా అకారణభయానికీ, అనుమానానికీ, పిరికితనానికి నాలో నేనే నవ్వుకున్నాను. దానికి బాధ్యతకొంతవరకూ అమ్మమ్మమీద వేసి, మనసు తేలిక చేసుకుని గుంపులో

జొరబడ్డాను — అదేమిటో వివరంగా తెలుసుకోవాలనే కుతూహలం కొద్దీ.

అందులో - యిద్దరు పెద్ద అధికారుల్లా వున్నారు - వొకాయన యింగ్లీషులో, మరొకాయన తమిళంలో వినయ ప్రవర్తన వారం యొక్క వుద్దేశ్యాల్ని, ఆశయాల్ని; ప్రజలకూ పోలీసులకు మధ్య వుండాల్సిన సంబంధాల్ని గురించీ, ప్రజల పట్ల పోలీసులు నిర్వర్తించాల్సిన బాధ్యతలు - ముఖ్యంగా పోలీసులు తమ విధి నిర్వహణంలో ప్రజలందు చూపాల్సిన వినయ ప్రవర్తనగురించీ వొక్క పూవున గుక్క తిప్పుకోకుండా వుపన్యాసం యిచ్చేస్తున్నారు. అప్పుడప్పుడు చేతిలో వున్న రాసుకొచ్చిన కాగితాలు చూసుకుంటూను. ఒక కానిస్టేబుల్ పదిమందిని పక్కపాటుగా చేర్చి, అరవ తెలుగులో అదే పాఠంసారాంశాన్ని వప్పగించేస్తున్నాడు.

అది వింటున్నంతసేపూ, పోలీసులంటే కరుడు కట్టుకుపోయిన నా అభిప్రాయాలు మంచులా కరిగిపోయినై. ఆ కొంచెంసేపు వాళ్ళు ఎంతో దగ్గరవాళ్లుగా మనవాళ్లుగా అనిపించారు.

ఈ సంగతిని — ఏదో వూహించుకొని భయపడుతున్న అమ్మమ్మ చెవులో వేద్దామని వుత్సాహంకొద్దీ జనంలోంచి దూసుకువచ్చి మెట్లెక్కపోతూంటే—బిందె బోర్లించుకుని మెట్లపక్కగా వాకిట్లో కూర్చున్న పనిపిల్ల ఎదురైంది.

"ఏం! యింకా యిక్కడే దతికలపడ్డావ్? పంపు కట్టేసే టైమవుతూంటేను!" అంటుకది యింతపొడుగున మూతి సాగదీసుకుంటూ—

"నా ఎప్పిడీ పోరదూ? పోలీసుకారక్ష్యయిలో అడ్డెందా వుంటిరి! నా యెన్నా సెయర్దు?" అంది.

ఓసి దీన్ని తగలెయ్యా! ఎలాగో సందు చేసుకుని పోకూడదూ? తుమ్మితే వూడిపోయే ముక్కాయె; గట్టిగా ఏమైనా అంటే అది కాస్తా బిందె అక్కడ పారేసి పోతే—ఆ తర్వాత పడాల్సిన అవస్థ పూర్తిగా తెలుసు కాబట్టి—చేసేదిలేక వెనక్కు తిరిగి ఆ తెలుగులో మాట్లాడుతున్న కానిస్టేబుల్ దగ్గర కొచ్చాను.

చెప్పాలా వద్దా అని వెనక్కు ముందుకూ సాగుతూ రబ్బరు బంతిలా మనసులో కొట్టుకుంటున్నదాన్ని ధైర్యం చేసి అనేశాను.

"సార్! కొంచెం కారు పక్కకు తీయించండి; నీళ్ళు తెచ్చుకోటానికి ఇబ్బందిగా వుంది." వినయంగానే అన్నాను.

"అక్కడ దొరగారిదగ్గర చెప్పుకోండి" అంటూ నా చేయి పుచ్చుకుని అతగాడు కార్లో కూర్చున్న దొరగారి వద్దకు తీసుకెళ్ళాడు.

సంగతి విని ఆయన "సారీ! సారీ! క్షమించండి. యిప్పుడే వెళ్ళిపోతున్నాం" అన్నాడు.

ఆసమయంలో నాకు వాళ్ళ నేదో అగ్ని పరీక్ష చేశా ననిపించింది. నాకేమిటి వాళ్ళ కూడా అలానే తోచివుండొచ్చు!

నాకృతజ్ఞతను, సుహృద్భావాన్ని తెలియజేసుకుంటుండగానే కారు అక్కడ్నుంచి శరవేగంతో తారోడ్డునుకక్కవేసుకుంటూ పోయింది.

"అమ్మమ్మోయ్! చూశావటే?" వొక్క గంతేశాను అమ్మమ్మ దగ్గరకు.

"నాగుండెల్లో గుండెలు లేవురా నాయనా! నిన్నట్లా ఆపోలీసువచ్చినోడు కారుదగ్గరకు తీసుకుపోతూంటేను." అమ్మమ్మ దడదడలాడుతూ అంది.

"ఓస్! అదికాదే! మనం నీళ్లు తెచ్చుకోటానికి యిబ్బందిగా వుంది కారు అక్కడనుంచి తీయమనగానే తీసేశారే!" ఎంత గర్వంగా అన్నానో అమ్మమ్మకేం అర్థమౌతుంది.

"ఓరి పిడుగా! ఎన్ని గుండెల్రా అడిగావురా వాళ్ళ నామాట?" దంతాలులేని దవడను నొక్కుకుంది.

"అబ్బ కాదు లేవే! ఇది పోలీసుల వినయప్రవర్తన వారమే!"

"ఇనయ పెవర్తనేంటిరా?"

అది అమ్మమ్మకు పలికి చావదు. చెప్తే తెలిసీ చావదు. ఎలా ఆమెతో చచ్చేది? నీకు తెలియదు లేవేఅంటే కస్సుమంటుందాయె.

"ఇదివరకటిలా కాదే పోలీసు సోళ్లలో మార్పు వచ్చింది."

"అట్లా చెప్పరా మరి! నీవు చెప్తేనే వెళ్లిపోయారంటావేం?" ముసలమ్మ తెలివిగానే అంది.

"ఏడ్చినట్టే వుంది. ఎట్లా అయినా వొకటేలేవే!" విసుకుబుట్టి విసురుగా అనేసరికి అమ్మమ్మ సంభాషణ మారుస్తూ—

"కాలోజీ లేదురా యివ్వాళ?" అంది.

"ఎందుకులేదే?" అంటూ బాత్‌రూంలో జొరబడ్డాను. [ఇంకా వుంది]

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

అలెగ్జాండర్ డ్యూమా

74

మాంట్ క్రిస్టో ఇంటిలో దొంగతనం చెయ్యడానికి జరిగిన యత్నం పారిస్‌లో వారంరోజుల పాటు చర్చనీయాంశమయింది. హంతకుడు బెనెడెట్టో అని దొంగ చెప్పాడు. ఆ సమయంలో తా నింటిలో లేనట్లు, బుసోనీ చెప్పగా వివరాలన్నీ తెలుసుకున్నట్లు మాంట్ క్రిస్టో మిత్రులకు చెప్పాడు. బెనెడెట్టో ఎవరో ఎవరికీ తెలియలేదు. బర్టుక్సియోమాత్రం ఆ పేరు విన్నప్పుడల్లా ఉలిక్కిపడుతున్నాడు. హంతకుని పట్టుకోడానికి పోలీసులు విశేషకృషి చేస్తున్నారు. దొరకవలసిన హంతకునిపై అభియోగం తయారుచెయ్యడంలో విల్‌ఫర్ట్ నిమగ్నుడై ఉన్నాడు.

తరవాత మూడువారాలలో యూజినీడాంగ్లర్ వివాహ ప్రసక్తిలో హత్యావృత్తాంతం మణిగిపోయింది. ఈ వివాహానికి ఆంద్రీ తండ్రి సమ్మతిస్తూ డాంగ్లర్‌కు లేఖ వ్రాశాడు. వరునికి వరుని తండ్రి ఒకటిన్నర లక్షలివ్వడానికి సమ్మతించాడు. డాంగ్లర్ తన కూతురికి లక్షన్నర కట్నమిస్తున్నాడు. మొత్తం మూడులక్షలీ వ్యాపారంలో పెట్టి వృద్ధిచెయ్యడానికి డాంగ్లర్ సంతోషపూర్వకంగా సమ్మతించాడు. రోజురోజుకీ డాంగ్లర్‌కి ఆంద్రీపట్ల ప్రీతి అధికమౌతోంది యూజినీ మాత్రం వరుని మరింత నిర్లక్ష్యంతో చూడ నారంభించింది.

బోశాంప్ ఆల్బర్ట్‌ను కోరిన మూడువారాల గడువు పూర్తి కావచ్చింది. ఆల్బర్ట్ హృదయాన్ని పరాభవాగ్ని దహిస్తూనే ఉంది. ఆల్బర్ట్‌తో మాట్లాడిన రోజుమొదలు బోశాంప్ పారిస్ నగరంలో కనపడ్డంలేదు. అత నెక్కడికి వెళ్లాడో ఎవరికీ తెలియదు.

ఒకనాటి ఉదయం హఠాత్తుగా బోశాంప్ ఆల్బర్ట్ ఇంటివద్ద ప్రత్యక్షమైనాడు. ఆల్బర్ట్‌వంక ఆదరభావంతో చూసి బోశాంప్ ఇలా అన్నాడు: "ఆల్బర్ట్! జెనీనా వెళ్ళి ఇప్పుడే తిరిగి వస్తున్నాను. సావధానంగా కూచో. మాట్లాడాలి."

"ఏమిటి? జెనీనా వెళ్లావా?"

"అవును. ఆల్బర్ట్! నువ్వే అపరిచితుడవైతే ద్వంద్వయుద్ధం చేసి నిశ్చింతగా ఊరుకునేవాడిని. కాని నువ్వు ప్రాణస్నేహితుడవు. నీకోసం జెనీనా వెళ్ళివచ్చాను."

"ఏమయింది? చెప్పు త్వరగా?"

"నే నెంత మనోవ్యథను గురౌతున్నానో నీ కెలా చెప్పను ఆల్బర్ట్? పత్రికలో వ్రాసింది నిజం."

"ఏమిటీ? ఆ ఫ్రెంచి సైనికోద్యోగి..."

"అవును. నీ తండ్రే."

"జెనీనాకోటను శత్రువు కొప్పగించిన ద్రోహం చేసినది నా తండ్రేనా?"

"నన్ను క్షమించు ఆల్బర్ట్!"

ఆల్బర్ట్‌కి కోపం తలమునుంచుకు వచ్చింది.

"ఇదిగో, ఇది చూడు" అంటూ బోశాంప్ ఒక పత్రం ఆల్బర్ట్ చేతి కిచ్చాడు.

జెనీనాలో ప్రముఖవ్యక్తులు పన్నెండు మంది కలిసి వ్రాసిన పత్రమది. పాషా నియామకంలో ఉండి కూడా టర్కీ సుల్తాన్‌తో చేరి ద్రోహంచేసి కోటను పాషాను శత్రువుల స్వాధీనంచేసి ఇరవై లక్షలు లంచం పుచ్చుకున్న ఫ్రెంచి సైనికోద్యోగి ఫెర్నాండో పేరుగల కౌంట్‌మార్సెర్ఫ్ తప్ప మరొకరు కాదని వారు రూఢి పరుస్తూ వ్రాశారు.

"నీతండ్రిపై కళంకాన్ని కడిగి వెయ్యవచ్చుననే ఆశతో నే జెనీనా వెళ్లాను ఆల్బర్ట్! కాని విధి ఎదురు తిరిగింది. నువ్వు నాకు ప్రాణమిత్రుడవు కాబట్టి ఈపత్రం నీకే ఒప్పగిస్తున్నాను. ఈ రహస్యాన్ని మనం మనిద్దరిమధ్యనే మాపుచేద్దాం. నేను మాటిస్తున్నాను. ఆల్బర్ట్! సర్వం మరిచిపో. అదే నీకు మేలు. తండ్రి చేసే పాపాలకు బిడ్డలు ఫలమనుభవించ నవసరంలేదు సుమా!"

ఆల్బర్ట్ తల వాలిపోయింది. నిరుత్తరుడై కంట నీరు కార్చ నారంభించాడు. "ఇదిగో ఈపత్రాన్ని నీఎదుటనే కాల్చి భస్మం చేస్తున్నాను చూడు" అంటూ బోశాంప్ కాగితానికి నిప్పు ముట్టించాడు.

"అయ్యో! నే నెలా భరించను బోశాంప్? తండ్రిని చూస్తే మనస్సులో కలిగే భక్తిభావం, గౌరవం, గర్వం ఒక్కసారిగా కుమారు డెలా చంపుకోగలడు బోశాంప్? అయ్యో! మా అమ్మకీ విషయం తెలిస్తే ఎంత దుఃఖిస్తుందో కదా! అమ్మా! నీకిది తెలిస్తే నువ్వెంత బాధపడతావో కదా?"

బోశాంప్ ఆల్బర్ట్ రెండు చేతులూ పట్టుకున్నాడు. "ఆల్బర్ట్! ధైర్యం తెచ్చుకో."

ఆల్బర్ట్ కొంతసేపైన తరవాత ఇలా అన్నాడు: "కాని ఆ వార్త పత్రికలో ఎలా ప్రచురించబడింది?"

"అదే తెలియదు. అందువల్లనే మనం జాగ్రత్తగా ఉండాలి. ఇంకముందేమి వస్తుందో తెలియదుకదా!"

"ఇంకా ఏమైనా వస్తుందనే నీ భయమా?"

"ఏమో! నాకేమీ తెలియడంలేదు. ఏదైనా సంభవించవచ్చుకదా! అయితే ఒక టడుగుతాను చెప్తావా?"

"ఏమిటది?"

"డాంగ్లర్‌కుమార్తెతో నీ వివాహం సంగతేమైంది? ఇంకా పెళ్లిచేసుకోదల్చుకున్నావా?"

"అంటే? ఈ పని డాంగ్లర్‌వల్ల కాని..."

"నే నేమీ అనడంలేదు ఆల్బర్ట్! పెళ్లిసంగతి ఏమి నిశ్చయమయిందని మాత్రమే అడుగుతున్నాను. నే నడుగుతున్నదానిలో అంతరార్థాలకోసం వెతకవద్దు."

"ఆ సంబంధం తెగిపోయింది."

"పోనీలే, నడు. మాంట్ క్రిస్టో ఇంటికి వెడదాం. ఆయనతో కొంతసేపు గడిపితేచాలు మనస్సులో బాధలిట్టే మరిచిపోవచ్చు."

అనువాదం: సీతారామ్

"అవును. నడు."

యువకు లిద్దరినీ చూసి మాంట్ క్రిస్టో ఆనందభరితు డైనాడు. "మీ యిద్దరిమధ్యా వైమనస్యం సమసిపోయినట్లేనా?" అన్నాడు.

"అవును. ఇంక ఆ ప్రసక్తి మరిచి పోదల్చుకున్నాం." అన్నాడు బోశాంప్.

"అదే మంచిది" అన్నాడు మాంట్ క్రిస్టో. తన దృష్టిని చేతి లోని పత్రాలపైకి మరల్చాడు.

"చాలా శ్రద్ధగా చూస్తున్నారే ఏదో పత్రాలు?" అన్నాడు ఆల్బర్ట్.

"అవును. ఇవి కావల్కాంటీకి సంబంధించిన పత్రాలు."

"ఓహో! యూజినీడాంగ్లర్ ని వివాహమాడబోతున్న భాగ్యవంతుడు."

"మీరే ఈ సంబంధం కుదిర్చారా?" అన్నాడు బోశాంప్.

"నేనా?" అన్నాడు మాంట్ క్రిస్టో. "నేను సంబంధాలు కుదిర్చేవాడిని కాను. మీ కింకా నా తత్వం పూర్తి బోధపడలేదన్న మాట. అసలీ వివాహం జరక్కుండా ఆపడానికి నేను ఎంతో ప్రయత్నించాను. కాని డాంగ్లర్ నా మాట వినలేదు. కావల్కాంటీ భాగ్యవంతుడని మురిసిపోతున్నాడు. ఆంద్రీ పుట్టుకకు సంబంధించిన రహస్యాన్ని కూడా డాంగ్లర్ కి చెప్పాను. ఆంద్రీ తలిదండ్రు లెవరో నిజంగా ఎవ్వరికీ తెలియదు. ఎంత చెప్పినా డాంగ్లర్ వినిపించుకోకుండా నన్నే, మేజర్ కావల్కాంటికి ఉత్తరం వ్రాసి జనన్పత్రం మొదలైనవి తెప్పించమన్నాడు. కాని ఆల్బర్ట్! అలా ఉన్నావేం? నువ్వు నిజంగా యూజినీని ప్రేమించలేదుగదా?"

ఆల్బర్ట్ విషాద సూచకంగా చిరునవ్వు నవ్వాడు. "ప్రేమించానేమో నాకు మాత్రం తెలియదు"అన్నాడు.

"కాని ఎందు కలా ఉన్నావు?"

"ఆల్బర్ట్ సమాధాన మివ్వలేదు.

"పోనీలే. నాతో ఉత్తరాదికి వస్తావా? మనస్సు తేలికపడుతుంది. నాకూ కూడా మనస్సు స్థిమితంగా లేదు. అందువల్ల పది రోజులు దేశం తిరిగి రావాలనుకున్నాను."

"తప్పకుండా వస్తాను. కాని మీకు విచార మెందుకు కలిగింది?"

"నన్నొక దొంగ చంపడానికి ప్రయత్నించాడని వినలేదా?"

"అవునవును. పత్రికల్లో చదివాను" అన్నాడు బోశాంప్. "ఈ కాడరూస్ ఎవరండీ?"

"ఎవరో దక్షిణాదినుంచి వచ్చాడట. మార్సెల్స్ లో ఉండగా విల్ ఫర్ట్ వాడి పేరు విన్నారట. డాంగ్లర్ కి అతన్ని చూసిన గుర్తుకూడా ఉందట. ఇంక పోలీసులు ఆచోకీ తియ్యడం ప్రారంభించారు, కాడరూస్ ని చంపినవాడికోసం. నగరంలో ఉన్న దొంగలందర్నీ పట్టుకుని చూడమని ప్రతిరోజూ నాయింటికి పంపుతున్నారు. ఈలెక్కని చూస్తే ఇంకో మాసంరోజుల్లో ప్రతి దొంగకీ నా యింటిగుట్టుమట్లు పూర్తిగా తెలిసిపోతాయి. ఇంక కొన్నాళ్ళపాటు ఇది మరిచిపోడానికి దేశాటన ఏర్పాటు చేసుకున్నాను.

"అవును కౌంట్. నేను మీకూడా వచ్చేస్తాను." అన్నాడు ఆల్బర్ట్.

మరునాడు చీకటితోనే ఇద్దరూ కలిసి అంచీలపై ఏర్పాటయిన బగ్గీలపైన బయలుదేరారు. మధ్యమధ్య కొండలు, అడవుల వద్ద మజిలీలు చేస్తూ మూడురోజులు ప్రయాణంచేశారు. నాలుగో రోజు ఉదయం ఆల్బర్ట్ కి తల్లివద్దనుంచి కబురువచ్చింది. వెంటనే తిరిగి పారిస్ రావలసిందని తల్లి ఆదేశం. ఆల్బర్ట్ ఆందోళనతో పరిచారకుని చూసి "మా అమ్మ జబ్బుగా ఉందా? ఎందుకు రమ్మంది."

"లేదండి. అంతా ఆరోగ్యంగానే ఉన్నారు. ఈ ఉత్తరం మీ కివ్వాలని బోశాంప్ నా చేతి కిచ్చారు."

ఆల్బర్ట్ ఉత్తరం విప్పి చదువుకున్నాడు. అతని ముఖం పాలిపోయింది.

"పాపం! తండ్రులు చేసే పాపాలకు బిడ్డలు కూడా శిక్ష అనుభవించవలసిందేనా?" అనుకున్నాడు మాంట్ క్రిస్టో తనలో.

ఆల్బర్ట్ పరిచారకుని చూసి "నువ్వెలా వచ్చావు?" అని అడిగాడు.

"స్వారిగుర్ర మెక్కి వచ్చానండి."

"ఇంట్లో అందరూ ఎలాగున్నారు?"

"ఇల్లు అంతా ప్రశాంతంగా ఉన్నదండి. అమ్మగారు మాత్రం విచారంగా ఉన్నారు."

ఆల్బర్ట్ దీర్ఘనిశ్వాసం విడిచాడు. మాంట్ క్రిస్టో సమీపించి అతని భుజంపై చెయ్యివేశాడు. "వెళ్ళక తప్పదా ఆల్బర్ట్?"

"తప్పదు. ఇది మా అమ్మ ఆజ్ఞ కూడా."

"అయితే నా గుర్రాన్ని ఇస్తాను. జాగ్రత్తగా వెళ్ళు."

లేఖతోపాటు పరిచారకు డిచ్చిన పత్రిక ఒకటి మాంట్ క్రిస్టోకి అందిస్తూ, "ఇదిగో ఇది చదవండి. సంగతి బోధపడుతుంది. అయితే నేను వెళ్ళిపోయిన తరవాతగాని చదవవద్దు. నేను భరించలేను."

"నువ్వు చెప్పినట్టే చేస్తాను. జాగ్రత్తగా వెళ్లిరా."

ఆల్బర్ట్ వెంటనే బయలుదేరాడు. అతను వెళ్ళిపోగానే మాంట్ క్రిస్టో పత్రిక తీసి చూశాడు. ఒకచోట చిన్నవార్త చూసి ఆగాడు. మెల్లిగా చదివాడు. అందులో ఇలా ఉంది: "జెనీనా పాషా నియామకంలో ఉండి కోటనూ, పాషానూ శత్రువుల కొప్పగించిన ఫ్రెంచి సైనికోద్యోగి పేరు కర్నల్ ఫెర్నాండో. ఇప్పుడా అధికారి కౌంట్ మార్సెర్ఫ పేరుతో పారిస్ సమాజంలో ఐశ్వర్య మనుభవిస్తున్నాడు."

పత్రిక పేరు చూశాడు. ఇది బోశాంప్ సంపాదకత్వంలో ఉన్న పత్రిక కాదు. విరోధపక్షానికి చెందిన పత్రిక. బోశాంప్ అతి జాగ్రత్తగా కాపాడిన రహస్యం ఈవిధంగా బయట పడింది.

75

ఉదయం ఎనిమిదిగంటలకు బోశాంప్ ఇంటివద్ద దిగాడు ఆల్బర్ట్. బోశాంప్ ఆల్బర్ట్ ని ఆలింగనం చేసుకుని లోపలికి తీసుకువెళ్లి సోఫాలో కూర్చోపెట్టాడు. "నువ్వు తప్పకుండా వస్తావనే అనుకున్నాను" అన్నాడు.

"నీ మేలు నా జన్మలో మరిచిపోను బోశాంప్! కాని ఇంకో పత్రికలో ఈ రహస్యం ఎలా బయటపడిందో ఆ చూకీ ఏమైనా తెలిసిందా?"

"ఎలా వచ్చిందో గ్రహించగల ననుకుంటున్నాను."

"అసలీ కుట్రంతా ఎలా జరిగిందో మొదటినించీ చెప్పు బోశాంప్."

జరిగిన వృత్తాంతమంతా బోశాంప్ వివరించాడు. వార్త పడగానే బోశాంప్ ఆ పత్రిక సంపాదకుని చూశాడు. సమాచారమంతా నిదర్శనాలతోనూ, సాక్షుల ప్రకటనలతోసహా పత్రికకు జెనీనానుంచి వచ్చిందని సంపాదకుడు తెలియచేశాడు.

ఆ రోజు ఫ్రెంచి జాతీయశాసన పరిషదంగమైన ఉన్నత సభలో కలవరం చెలరేగింది. కౌంట్ మార్సెర్ఫ్ పట్ల మిగిలిన సభ్యులెన్నడూ భ్రాతృభావంతో మెలిగినది లేదు. పేదస్థితినుంచి స్వయంకృషివల్ల ఉన్నతికి వచ్చిన మార్సెర్ఫ్‌ను ఉన్నతవంశ సంజాతులైనవారు పరిహసించేవారు. ప్రాభవసంపన్నులైనవారతనిని నిరసించేవారు. నీతిపరులైనవారతనికి దూరంగా ఉండేవారు.

పత్రికలో ప్రచురించబడినవార్త మార్సెర్ఫ్‌కితప్ప అందరికీ తెలిసింది. యథారీతిగా అహంకారభావంతో మార్సెర్ఫ్ ఆనాడు కూడా సభకు వచ్చాడు. చుట్టూ ఉన్నవారు తన నెట్లు నిరసనతో పరిగణిస్తున్నారో అతను కనిపెట్టలేదు. సభలోని కతను ప్రవేశించగానే ప్రబల శత్రువైన ఒక్క సభ్యుడు ఉపన్యాసవేదికను సమీపించి ఆనాటి వార్తను సభకు తెలియపరిచాడు. వార్త విషయమేమీ మార్సెర్ఫ్‌కి బోధపడలేదుగాని జెనీనా, కల్నల్ ఫెర్నాండో అనే పేర్లు వినపడగానే ఉలిక్కిపడ్డాడు. అందరూ అతనివంకనే చూస్తూన్నారు.

వార్త సభలో చదవబడింది. ఈ విషయాన్ని పరిశీలించాలని సభ్యులు తీర్మానించారు. పిడుగుపాటువలె సంభవించిన ఈ ఘటనకు మొదట మార్సెర్ఫ్ స్తంభితుడైనాడు. నోటమాట రాలేదు. పరిలనకు వ్యవధి ఎంత కావాలని సభాధ్యక్షుడు మార్సెర్ఫ్‌ని ప్రశ్నించాడు. మార్సెర్ఫ్ కోపంతో లేచి ఇలా అన్నాడు: "ప్రచ్ఛన్న శత్రువు లెవరో పగబూని నా పైన హఠాత్తుగా ముప్పు తెచ్చి పెట్టడానికి ఈ తంత్రం పన్నారు. చాటున దాగి నీచంగా నాపై పగసాధించడానికి బదులు ఆ శత్రు వెవరో నా సమక్షానికివస్తే, నే నీ ఉన్నత వంశీకులైనవారికి తీసిపోనని నిరూపించగలను. ఈ విచారణ వెంటనే జరపాలని నా మనవి. అవసరమైన వివరాలన్నీ ఇప్పుడే సభకి సమర్పించగలను."

వెంటనే పన్నెండుమంది సభ్యులతో విచారణ సంఘం ఒకటి నియమించబడింది. సాయంకాలం విచారణ ప్రారంభమౌతుందని అధ్యక్షుడు ప్రకటించాడు.

ఆ సాయంకాలం సభాభవనంముందు ప్రజలు గుమిగూడి నిరీక్షిస్తున్నారు. మార్సెర్ఫ్ సరిగ్గాసమయానికి వచ్చి హాజరైనాడు. అదే సమయంలో ఒక పరిచారకుడు వచ్చి అధ్యక్షుని కొక చిన్న లేఖ నిచ్చాడు.

అధ్యక్షుడు ముందుగా మార్సెర్ఫ్‌ను ప్రసంగించమని చెప్పి లేఖ విప్పిచూశాడు. మార్సెర్ఫ్ తీవ్రకంఠంతో ప్రసంగం ప్రారంభించాడు. ప్రచ్ఛన్న శత్రువులో తెగనాడి తనపై ఆరోపింపబడిన ద్రోహం అసత్యమని వాదించాడు. అలీపాషాకు చెందిన ఉంగరాన్ని సభ్యులకు చూపాడు. తనపై పాషాకుగల అపార విశ్వాసాన్ని నిరూపించడానికి అనేక ఘట్టాలను ఏకరువు పెట్టాడు. టర్కిష్ సుల్తాన్ వద్ద తన రాయబారం విఫలమై, జెనీనా తిరిగి వచ్చేసరికి పాషాహతుడైనాడని మార్సెర్ఫ్ చెప్పాడు. పాషాకు తనపట్లగల విశ్వాసంవల్లనే భార్యనూ బిడ్డనూ తన సంరక్షణ కొప్పగించాడని చెప్పాడు.

బోశాంప్ ఈ ఘట్టం చెప్పినప్పుడు విభ్రాంతుడైనాడు. అతనికి హైదీ చెప్పిన వృత్తాంతం కన్నులకు కట్టినట్లయింది.

బోశాంప్ మామూలుగానే తన కథ సాగించాడు.

మార్సెర్ఫ్ ప్రసంగిస్తుండగా అధ్యక్షుడు లేఖ విప్పి చూశాడు. దాని నలాగే చేతిలో పట్టుకుని మార్సెర్ఫ్ ప్రసంగాన్ని వింటున్నాడు. పాషా భార్యాబిడ్డల ప్రసంగం వచ్చేసరికి అధ్యక్షుడు మార్సెర్ఫ్‌ని ఆపి: "ఇద్దరినీ పాషా మీ కొప్పగించారని కాదూ చెప్పారు? అయితే వారిప్పు డెక్కడున్నారో మీకు తెలుసునా?" అని ప్రశ్నించాడు. "తెలుసునండి" అన్నాడు మార్సెర్ఫ్ "పాపం దుఃఖం భరించలేకనో, లేక పేదరికానికో ఇద్దరూ బలైనారని విన్నాను. నేను వారిని రక్షించలేకపోయినందుకు చాల దుఃఖించాను." అధ్యక్షుని ముఖంలో గంభీరభావం పొడగట్టింది. సభ్యులవంక తిరిగి ఇలా అన్నాడు: "కౌంట్ మార్సెర్ఫ్ ఇంతవరకూ చెప్పినది మీరు విన్నారు. కౌంట్! మీ రింతవరకూ చెప్పిన విషయాలను ధ్రువపరచగల సాక్షిని తీసుకురాగలరా?"

"పాషాని జీవితంలో తెలిసినవారుగాని ఆనాడు పాషా కింద ఉద్యోగంలో ఉండగా నన్నెరిగినవారుగాని ఇప్పుడు లేరు. చాలమంది చనిపోయారు. మిగిలినవారెక్కడున్నారో తెలియదు. నావద్ద పాషా నాకు వ్రాసిన లేఖలు, ఆయన ఉంగరంమాత్రం ఉన్నాయి. వానిని మీ కిచ్చాను. నావల్ల ఎటువంటి దోషం లేదని నిరూపించడానికి ఒక్క విషయం చాలును. చాటుగా ఉండి నాపైన అపవాదులు పుట్టించి ప్రచారంచేసిన శత్రువులు నాపై దోషాన్ని నిరూపించడానికి విచారణ సంఘ సమక్షానికి రాలేకపోయానారు. ఒక్క సాక్షికూడా లేడు."

అధ్యక్షుడు మార్సెర్ఫ్‌ను మధ్యలోనే ఆపాడు: "కౌంట్! నాచేతి కిప్పుడే ఒక లేఖ వచ్చింది. లేఖ చదువుతున్నాను వినండి: 'అయ్యా, పాషా నియామకంలో ఉండగా కౌంట్ మార్సెర్ఫ్ చేసిన ద్రోహాన్ని నిరూపించడానికి ముఖ్యమైన నిదర్శనాలను నే నివ్వగలను. అలీపాషా చనిపోయిన సమయంలో నే నాయన సన్నిధిలో ఉన్నాను. పాషా భార్య వాసిలికీ, కుమార్తె హైదీ ఏమయినారో నేను తెలపగలను. నే చెప్పగోరుతున్న విషయాలను విచారణసంఘం తప్పకుండా వినాలని నా ప్రార్థన. నేను సభాభవనంవద్దనే వరండాలో ఉన్నాను.'"

అధ్యక్షుడు చదవడం ముగించి పరిచారకుని పిలిచి లేఖ నిచ్చిన వ్యక్తికి కబురు పంపాడు. సభ్యులందరూ ఆత్రుతతో చూశారు. ముఖమంతా ముసుగు కప్పుకున్న ఒక యువతి వచ్చింది. అధ్యక్షుడు ఆచ్ఛాదనం తొలగించవలసిందని ఆమెను కోరాడు. ఆచ్ఛాదనం తొలగించగానే సభ్యులందరూ ఆమె అద్భుత సౌందర్యాన్ని పరికించి ఆశ్చర్యపడ్డారు.

ఇంతవరకూ విని ఆల్బర్ట్ ఇంక ఉండబట్టలేక "ఆమేనా?" అన్నాడు.

"ఎవరు?" అన్నాడు బోశాంప్.

"హైదీ. సరే చెప్పు. తరవాత ఏమయింది?" అన్నాడు ఆల్బర్ట్.

బోశాంప్ మళ్లీ ఉపక్రమించాడు.


కౌంట్ మార్సెర్ఫ్ ఆమెను చూసి భీతితో కంపించిపోయాడు. ఆమె కొక ఆసన మివ్వబడింది. కాని ఆమె కూర్చోడానికి నిరాకరించింది. మార్సెర్ఫ్ తన ఆసనంలోగుభాలున కూలబడ్డాడు. అధ్యక్షుడు యువతివంక తిరిగి "అమ్మా, మీ కీ విచారణతో ఎలాంటి ప్రమేయముంది?" అని అడిగాడు.

ఆమె "ఇది నాకే ప్రమేయముంది. నేను అలీపాషా కుమార్తెను. నా పేరు హైదీ." అంది.

సభ్యులంతా నివ్వెరపోయిచూశారు. అధ్యక్షుడు "మీరు చెప్తున్నది సత్యమని రుజువు చెయ్యడానికి ఆధారాలున్నాయా" అని అడిగాడు.

"ఉన్నాయి" అంటూ హైదీ ఒక చిన్న సంచిలోనుంచి కొన్ని పత్రాలు తీసింది. "ఇవిగో నాతండ్రీ, ప్రభుత్వోద్యోగులూ సంతకంచేసినా జన్మ నిరూపక పత్రం. ఇది క్రైస్తవ

(36-వ పేజీ చూడండి)



తాతతో సరసాలు

★

శ్రీ కవిరావు

తాత:

"బడి కాలస్యంగాపోతే
చెడు పేరొస్తుందబ్బాయి!"

మనుమడు:

"ఇంతగనాతో చెప్పెదవే?
పంతులుచేసే దదేగదా!"

తాత:

"పేకాటాడకు మబ్బాయి!
పోలీసులు దండిస్తారు."

మనుమడు:

"క్లబ్బులలో ప్రత్యక్షంగా
డబ్బాటాడే పెద్దలనో?"

తాత:

"పయిసాకొరకై అమ్మకడన్
చెయిచాపకుమది పొరపాటు."

మనుమడు:

"అమ్మనడిగితే తప్పంటావ్?
అధికారు లడిగేలంచాలో?"

* * *

మనుమడు:

"గుళ్లో కెందుకు తాతయ్యా,
వెళ్లొస్తుంటా వెప్పుడును?"

తాత:

"పాపాలను మన్నించమని
భగవంతుని ప్రార్థించుటకు."

మనుమడు:


"ప్రార్థన చేసెడి వారంతా
పాపముచేసెడి వారేనా?"

తాత:

"తాతకు దగ్గులు నేర్పెడి నీకూ
నీతులు చెప్పగ నాతరమా?"

మనుమడు:


"బాలకులంటే ఏమనుకున్నావ్?
భారతపౌరులు తాతయ్యా!"



‘ఏయ్ జాగ్రత్త’ అంటోంది ఈ
“ఎలుగు పిల్లి”

ఎలుగు పిల్లి

ఈ మృగం మన దేశంలోని అస్సాంనుండి తూర్పున ఫిలిప్పైన్స్ దీవుల దాకాగల అరణ్యాల్లో కనిపిస్తుంది. చూట్టానికి ఆకారంలో పునుగు పిల్లికీ, ఎలుగుబంటికీ సన్నిహితంగా వుంటుంది. దీని విహారం ఎక్కువగా రాత్రిళ్లప్పుడే. సాధారణంగా చెట్ల కొమ్మలమీదనే నివసిస్తుంది.



నాతో సమంగా పరిగెత్తండి ఎవరైనా:
“గజెల్ జింక”

జింక.

బొమ్మలో కనిపించేది ‘గజెల్’ అనే రకం జింక. అన్నిరకాల జింకల్లోకీ ఈరకం జింకలు అతి సుందరమైనవి. ఆఫ్రికా, అరేబియా, పశ్చిమాసియా, మధ్య ఆసియాలలోని మైదానాల్లోను, ఎడారుల్లోను ఇవి కనిపిస్తాయి. వీటికొమ్ములు దృఢంగా అందంగా ఉంటాయి. కాళ్లు సన్నగా ఉండి, చెంగు చెంగున దూకుతూ తేలిగ్గా, వేగంగా పరిగెత్తటానికి వీలుగా ఉంటాయి. ఈ జింక గంటకు 60 మైళ్ల వేగంతో పరిగెత్త గలదు. దీని గర్భధారణ కాలం 200 నుండి 270 రోజులు. జీవిత పరిమితి 7 నుండి 19 ఏళ్లు.

వాలబీ

దీని స్వదేశం ఆస్ట్రేలియా. ‘కంగారూ, అనబడే మృగానికి ఇది దగ్గర చుట్టం. ఎందుకంటే ‘కంగారూ’కి మల్లేనే దీనికి కూడా పొత్తికడుపువద్ద సంచి ఉంటుంది. ఆసంచిలో పిల్లలు వెచ్చగా ముడుచుకుని కూర్చుంటాయి (బొమ్మలో కనిపించటం లేదూ, ఆమాదిరిగా). ఆ సంచిలోనే అవి పాలుకూడా తాగుతాయి. అసలు ఆపిల్లలు పుట్టినప్పుడు ఒక అంగుళం కంటె ఎక్కువ పొడుగుండవు. అవి చాల నెమ్మదిగా పెరుగుతాయి. పెరిగి పెద్దవై, నేలమీద దూకటం నేర్చుకునేదాకా వాటిని తన సంచీలోనే

- పక్షులు

దాచి మోసుకుపోతూ వుంటుంది తల్లి. వాలబీ మృగాలకు ముందరి కాళ్లు బాగా పొట్టి, వెనక కాళ్లు బాగా పొడుగు. ఇది కూర్చోవటానికి వెనక కాళ్లే కాకుండా తోక కూడా ఉపయోగపడుతుంది. చీమ చిటుకుమంటే చాలు చెవులు నిక్కబొడుచుకుని, వెనక కాళ్లమీద నుంచుని, భూకంపం వచ్చినంత భయపడిపోతూ పారిపోతుంది. అంత పిరికి ఈ జంతువు. ఆ పిరికితనానికి తగ్గట్టే అతివేగంగా పరిగెత్తగలదు కూడాను. ఇది దూకటం చూస్తే 'హైజంప్, లాంగ్ జంప్' లలో ఫస్టు ప్రైజు కొట్టేస్తున్నట్లుంటుంది. ఇది సాధుమృగం; పచ్చి శాకాహారి; ఆకులలములు తప్ప మరేమీ ముట్టుకోదు.




మా అమ్మ కడుపులో వెచ్చగా కూర్చుంటూ:

"వాలబీ, దాని పిల్ల"


నల్లహంసలు.

31-10-:51 తేదీ వారపత్రికలో "తెల్ల హంసలు" అని రాసినదాన్ని చూసి పాఠకుల్లో కొందరు ఆశ్చర్యపడి వుండవచ్చు - హంసలు తెల్లగా వుండక నల్లగా ఉంటాయా, అని. 250 ఏళ్ల కిందట నల్లహంసలుంటాయని ఎవడైనా అంటే వాణ్ణి పిచ్చివాడికింద జమకట్టేవాళ్లే. విల్లెమ్ డి వ్లామింగ్ అనే డచ్చి నావికుడు మొదటిగారిగా నల్లహంసను కెనడాలోని ఒక నదిలో పట్టుకున్నాడు. అప్పటినుండి ఆ నదికి హంసానది (స్వాన్ రివర్, కెనడా) అని పేరు వచ్చింది. ఈ పక్షికి ముక్కు మాత్రం ఎర్రగా ఉంటుంది. ఇది గంటకి 55 మైళ్ల వేగంతో ఎగరగలదు.



ఈ పరమహంసలు ధ్యానయోగంలో ఉన్నాయా!

"నల్లహంసలు"



(బొమ్మలు వాల్ట్ డిస్నీ ప్రొడక్షన్సు, ఆర్. కె. ఓ. రేడియో వారి సౌజన్యంతో)

జరిగినకథ :

మాకు బ్రిస్టల్ నగరసమీపంలో ఒక హోటల్ ఉంది. ఒకరోజున మా హోటలుకు 'బిల్' అనే సముద్రపుదొంగ తనతోటి దొంగలనుండి తప్పించుకుని పారిపోయివచ్చాడు. అతడు మా హోటల్లో ఉన్నాడని మిగతా దొంగలకు తెలిసి, అతన్ని చంపేస్తామని బెదిరించారు. అతడు ఆ బెదిరింపుకే భయపడి చనిపోయాడు. ...అతని పెట్టెలోనే మాకు కాంచనద్వీపపటం దొరికింది. ఆపటాన్ని మా డాక్టరుగారికి, జమీందారుగారికి చూపాను ... వెంటనే అక్కడి ధననిక్షేపాలు సంపాదించే ఆశతో అక్కడికి ప్రయాణమయ్యాము. జమీందారుగారొక ఓడను సిద్ధం చేశారు. స్మాలెట్ అనే అతన్ని కెప్టెనుగాను, లాంగ్ జాన్ సిల్వర్ అనే వాణ్ణి వంటవాడుగాను కుదిర్చారు. సిల్వర్ అసలు సముద్రపు దొంగల్లో వాడే అయినందున, మిగతా కళాసులందరితో కలిసి మమ్మల్ని చంపడానికి పెద్దకుట్ర పన్నాడు. ఆకుట్ర నెదుర్కోటానికి మేము ఎదురు సన్నాహాలు చేసుకున్నాం. ఇంతలో కాంచనద్వీపం చేరాము. ... ద్వీపంలో నేను ఒంటరిగా తిరుగుతుండగా బెన్ గన్ అనే అడవిమనిషి కనిపించాడు. తన్ను తిరిగి ఇంగ్లండుకు ఓడలో తీసుకుపోయేట్లయితే గుప్తధనమంతా మాకిచ్చేస్తానన్నాడు. నేను నామిత్రులతో ఈ విషయం మాట్లాడతానని వాగ్దానం చేశాను.

18. మొదటిరోజు యుద్ధం.

(డాక్టరు చెప్పిన కథ)

మరొక నల్భై అడుగులు వెయ్యగానే చెట్ల గుబురుగుండా మా మట్టికోట కనిపించింది. ఇదే సమయంలో ఎడమ పక్కనుండి తిరుగుబాటుదార్లు మాకేసి పరుగెత్తుకు రావటం చూశాం. మమ్మల్ని చూడగానే అదిరిపడి ఎక్కడి వాళ్లక్కడ ఆగిపోయారు. వాళ్లు తేరుకునే లోపుగానే నేను, జమీందారు తుపాకులు పేల్చాము. మాతోపాటు సమానంగా మట్టికోటలోనుంచి హంటర్, జోయిస్‌లు కూడా పేల్చారు. ఇన్ని కాల్పులకీ శత్రువుల్లో ఒకడు మాత్రం నేలకూలాడు. మిగతావాళ్లు వచ్చినదోవనే కాలికి బుద్ధిచెప్పారు.

తుపాకీలు మళ్ళీ మందుతో నింపుకుని పడిపోయిన మనిషిని సమీపించాము. అప్పటికే వాడి శరీరం చల్లబడింది. మొదటి దెబ్బలోనే ఒకణ్ణి హతమార్చినందుకు సంతోషిస్తూ మళ్ళీ మట్టికోటకేసి నడిచాము. ఇంతలో పొదలచాటున ఒక పిస్టల్ పేలింది. ఒకతూటా నా చెవిపక్కగా గుయ్యిన దూసుకుపోయింది. వెంటనే నేను జమీందారు పొదలవేపు తుపాకులు పేల్చాము. తరవాత పక్కకు తిరిగాము. శత్రువులు పేల్చిన తూటా వృద్ధసేవకుడు టామ్ రెడ్రూత్‌కు తగిలింది. అతణ్ణి మోసుకుని మట్టికోటలో ప్రవేశించాము.

మేము దెబ్బకుదెబ్బ తియ్యటానికి సిద్ధంగా ఉన్నామని గ్రహించారు కాబోలు శత్రువులు మళ్ళీ ఆపరిసరాలలో ముఖం చూపకుండా ఉడాయించారు. రెడ్రూత్‌కు పరిచర్యలు చేయటానికి మాకు కావలిసినంత వ్యవధి లభించింది. పాపం అతని రోదనం వింటుంటే మాకు గుండెలు తరుక్కుపోయాయి. గాయంనుండి రక్తం కాలవలుగట్టి కారుతున్నది. అతని నాడి పరీక్షించాను. ఇక నేను చేయదగిన దేమీ లేదని, అనుకున్నాను.

మాకష్టాలు ప్రారంభమైంది మొదలు ఇప్పటివరకూ ఆవృద్ధుడు ఒక్కసారైనా గొణగలేదు, సణగలేదు. ఏ పని చెబితే ఆపని మారుమాట లేకుండా చేశాడు. పాపం ఇప్పుడు అందరికంటే ముందు అతని వంతువచ్చింది.

అతనికి ఒక పక్క వేసి పడుకోబెట్టాము. ట్రెలానీ అతనిపక్కన ముఖం కప్పుకుని కూర్చుని నిశ్శబ్దంగా ఏడుస్తున్నాడు. రెడ్రూత్ హీనస్వరంతో అడిగాడు:

అనువాదం : శ్రీ నండూరి రామమోహనరావు

"డాక్టరుగారూ! జమీందారు గారూ! నాకు సెలవిప్పిస్తారా?"

మే మెవ్వరం మాట్లాడలేదు. పొంగివచ్చే దుఃఖం ఆపుకుంటూ మౌనంగా చుట్టూ నుంచున్నాము.

"ఆ వెధవల్లో ఒకణ్ణయినా పడగొట్టకుండా వెళ్ళి పోతున్నానే అని నా బెంగ," అన్నాడు రెడ్రూత్. మళ్ళీ కాసేపు నిశ్శబ్దం.

ట్రెలానీ ముఖంమీద చేతులు తీసేసి రెడ్రూత్ చేతులు పట్టుకుని,

"టామ్! నన్ను క్షమిస్తావా?" అని అడిగాడు.

"అదేమిటి బాబుగారూ! అంతమాట అనకండి. మీ ఉప్పుతిని బతికానిన్నాళ్లూ. మీఒడిలో నిశ్చింతగా చనిపోతున్నాను. ఇంతకంటే ఏం కావాలి నాకు?" అన్నాడు రెడ్రూత్.

ఈలోగా కెప్టెన్ స్మాలెట్ ఏమిటేమిటో సవిరిస్తున్నాడు. పంట్లాంజేబుల్లోంచి రెండు యూనియన్ జాక్ జెండాలు తీశాడు. ఒక బైబిలు, ఒక మోకు, కలం, సిరాబుడ్డి, బోలెడు పొగాకుతీశాడు. ఒక జెండాను కర్రకు తగిలించి ఇంటి నడికప్పుమీది కెక్కి అక్కడ కట్టివేశాడు. దాంతో అతనిమనస్సు కుదుటబడినట్లుంది. సంతృప్తితో కిందికి దిగివచ్చి రెడ్రూత్ పక్కన నుంచున్నాడు.

ఎవరన్నా బైబిల్ చదివితే బావుంటుందని రెడ్రూత్ కోరాడు. బైబిల్‌లోని ప్రార్థనలు చదువుతుండగా రెడ్రూత్ సునాయాసంగా, నిశ్శబ్దంగా ఈలోకాన్ని విడిచిపోయాడు. కెప్టెన్ వెళ్లి రెండో జెండా తీసుకువచ్చి గౌరవ పూర్వకంగా దాన్ని శవం మీద కప్పాడు. ట్రెలానీ శవం పక్కనే ఇంకా దుఃఖిస్తూ కూర్చున్నాడు. కెప్టెన్ అతన్ని ఓదార్చడానికిలా అన్నాడు:

"జమీందారు గారూ! మీరు దుఃఖించకండి. రెడ్రూత్ అదృష్టవంతుడు. ఇంత వృద్ధాప్యంలో కూడా మిమ్మల్ని అనుసరించి ఈ ఎడారి ద్వీపానికి

వచ్చాడు. మీ సేవలోనే చనిపోయాడు. అతనికేం ఫరవాలేదు."

తరవాత కెప్టెన్ నన్ను అవతలకు పిలిచి చెప్పాడు:

"మనమిక్కడ ఎన్నిరోజులిల్లా పోరాడవలసి వస్తుందో తెలియదు. మన పడవలో అంత సామాను నీటిపాలు కావటం నిజంగా దురదృష్టమనే చెప్పాలి. మందు సామగ్రిపోయినా, అంత ఇబ్బంది లేదు గాని, ఆహార పదార్థాలుకూడా నీళ్లలో కలిసిపోవడం మనకు దెబ్బే. ఎంత కఠినంగా రేషనింగు పెట్టుకున్నా వారం పది రోజులకంటే ఈ నిలవలు ఎక్కువ కాలం సరిపోవు. ఒక విధంగా మనలో ఒకడైనా తగ్గిపోవడం మంచిదే అయింది."

ఇంతలో ఫిరంగిమోత మళ్ళీ వినిపించింది. ఓడ లోని వాళ్లకు మా కోట శిఖరంమీద ఇంగ్లీషు జెండా శుభ్రంగా కనిపిస్తూఉండి ఉండాలి. దానికేసి గురిపెట్టి శత్రువులు ఫిరంగి పేలుస్తున్నారు. కాని మొదటిగుండు మా కోటనుదాటి దూరాన చెట్లలోపడి వ్యర్థమైంది.

"ఓహో! ఫిరంగి పేలుస్తున్నారే. పేల్చండి పందుల్లారా! ఉన్న కాస్త మందుగుండు అయిపోయే దాకా అల్లాగే పేల్చండి," అన్నాడు కెప్టెన్ పళ్లు కొరుకుతూ.

ఫిరంగి రెండోసారి పేలింది. ఈసారి గురి ఆట్టే తప్పలేదు. గుండు మా ఆవరణలోకే ప్రవేశించి నేల మీద పడింది. అంతకంటే ప్రమాదమేమీ జరగలేదు

"ఓడలోని వాళ్లకు మన మట్టికోట కనిపించదు. కాని మన జెండానుచూసి దానికేసి గురిపెట్టి కొడు తున్నారు. కనుక అపాయ మేమీ జరక్కముందే జెండాను లాగివెయ్యటం మంచిది కాదా?" అన్నాను కెప్టెన్‌తో.

"జెండాను తీసి వెయ్య మంటారా? అసంభవం. ఛస్తే తీసెయ్యను," అని ఖచ్చితంగా జవాబుచెప్పాడు కెప్టెన్. అతని అభిప్రాయంతో మేమంతా ఏకీ భవించాము. ఎందుకంటే, కోటపై ఎగరవేసిన యూనియన్ జాక్ మా ఆత్మగౌరవానికి చిహ్నం. అంతే కాకుండా, తిరుగుబాటుదార్ల ఫిరంగి బెదిరింపులను మేము లెక్క చెయ్యటం లేదనటానికి కూడా మంచి నిదర్శనం. అందుచేత అది అక్కడ వుండటమే మంచిదని అంగీకరించాము.

ఆవిధంగా చీకటి పడేవరకూ ఓడలో వాళ్లు ఫిరంగి పేలుస్తూనే వున్నారు. ఫిరంగి గుండ్లలో ఒకటీ మా కోటలోకి చొచ్చుకురాలేకపోయింది. ఒక్కటీ మా జెండాను పడగొట్టలేకపోయింది. ఆవరణలో మాత్రం చాలాపడ్డాయి. ఒకొక్క గుండు పడినప్పుడల్లా ఒక ఇసుక తుఫానురేగినట్లయ్యేది. మేము లోపల కూర్చుని క్రికెట్ ఆటచూస్తున్నట్టు వినోదిస్తూ కూర్చున్నాం.

కెప్టెన్ స్మాలెట్ ఒకచోట కూర్చుని తనడైరీ పుస్తకం తీసి ఇలా వ్రాయసాగాడు.

"అలెగ్జాండర్ స్మాలెట్ — ఓడ కెప్టెన్; డేవిడ్ లివ్‌సే—ఓడడాక్టరు; అబ్రహాంగ్రే—కళాసీ; జాన్ ట్రెలానీ—ఓడ యజమాని; జాన్ హంటరు, రిచర్డు జాయిస్—యజమాని స్వంత నౌకర్లు; వీరు మాత్రమే తిరుగుబాటు నెదుర్కోటానికి మిగిలారు. పదిరోజులకు సరిపడే రేషన్లతో ఈరోజునే కాంచన ద్వీపం ప్రవేశించారు. మట్టికోటపై ఇంగ్లీషు జెండా ఎగరవేశారు. థామస్ రెడ్రూత్—యజమానిగారి సేవకుడు, తిరుగుబాటుదార్ల చేతిలో మరణించాడు; జేమ్సు హాకిన్స—ఓడనౌకరు........"

ఇంతలో మట్టికోట కుడివైపునుండి కేకలు వినిపించాయి. ఎవరో గొంతెత్తి పిలుస్తున్నారు. సంజ చీకట్లలో ఎవరైనదీ కనిపించటం లేదు.

"డాక్టరుగారూ! జమీందారు గారూ! హల్లో, అక్కడుంది నువ్వేనా హంటర్?" అని కేకలు వినిపించాయి. జిమ్‌హాకిన్స కంఠం గుర్తు పట్టాము. నేల మీద పాకుకుంటూ జిమ్ కోటలోకి ప్రవేశించాడు.

19 మళ్లీ మిత్రుల్లోకి.

(జిమ్ హాకిన్స కథ)

బెన్‌గన్ బ్రిటిష్ జెండాను చూడగానే నన్ను చెయ్యిపట్టుకుని ఆపి "అరుగో! మీ స్నేహితులక్కడ ఉన్నట్టున్నారు," అన్నాడు.

"తిరుగుబాటు దార్లు కాగూడదా?" అన్నాను.

"సిల్వర్ సంగతి మీకు తెలీదు. సముద్రపు

దొంగలుతప్ప ఇక్కడికెవ్వరూ రారు. ఇల్లాంటి చోట దొంగల జెండా ఎగరెయ్యక యూనియన్‌జాక్ ఎగరేస్తాడా సిల్వర్? వాళ్లు మీ స్నేహితులే. సందేహంలేదు. పోట్లాటకూడా ముమ్మరంగా జరుగుతోంది. మీ స్నేహితులే గెలుస్తున్నారనుకుంటాను. మట్టికోట బలేగా వుంటుంది లెండి. కెప్టెన్ ఫ్లింట్ చాలా గట్టిగా కట్టించాడు దాన్ని. ఫ్లింట్ బలే గొప్పవాడు లెండి. ఎంతెంత వాళ్లనయినా గజగజలాడించేవాడు ఒక్క సిల్వర్‌ని తప్ప. సిల్వర్, ఫ్లింట్ సమ ఉజ్జీలు."

"సర్లే. నీ సోదివింటూ కూర్చోటానికి నాకు తీరికలేదు. చప్పునపోయి మావాళ్లను కలుసుకోవాలి."

"కాదండి హాకిన్స్‌గారూ! మీతో వద్దామనుందిగాని భయం వేస్తోందండి. మీరు జమీందారు గారితో నాసంగతి తప్పకుండా చెప్పాలి. ఆయన సరే అంటేగాని నేను రాను. 'బెన్‌గన్ మీకో తమాషా చూపిస్తాడట' అని కూడా ఆయనతో చెప్పాలి. చెప్పి ఇల్లా కన్నుగీటాలి," అని బెన్‌గన్ కన్నుగీటి చూపించాడు.

"మీరు మళ్లీ నన్ను కలుసుకోవాలంటే ఇవ్వాళ నన్నెక్కడ చూశారో అక్కడికే రండి. మీరుకాక ఇంకెవరైనా వచ్చేట్లయితే ఆయన ఒంటరిగా నే రావాలి. చేతిలో తెల్లటిగుడ్డ పట్టుకురావాలి. తెలిసిందాండి."

"జమీందారుగార్ని గాని, డాక్టరుగార్ని గాని చూడాలనుకుంటున్నానన్నమాట. వాళ్లతో మాట్లాడాలనుకుంటున్నానన్నమాట. అంతేనా?"

"అవునండి."

"అయితే నేనిక వెళ్లనా?"

"మర్చిపోరుగదూ? ఒక తమాషాఅని మాత్రం చెప్పండి. ఇదుగో మన్లో మనమాట—"

ఢామ్మని శబ్దంచేస్తూ ఒక ఫిరంగి గుండు మాకు దండగజాల్లో ఇసుకలోపడి దుమారం రేగింది. వెంటనే చేతులు విడిపించుకుని చెరోదిక్కుకు పారిపోయాము.

అక్కణ్ణించి ఒక గంటదాకా ఫిరంగి విరామం లేకుండా పేలుతూనే వుంది

ఈ చెట్టునుంచి ఆచెట్టుకు, ఆ చెట్టునుంచి ఆచెట్టుకు అంగలువేస్తూ, ఫిరంగి గుండ్లు ఎక్కడ మీద పడతాయోనని హడలిపోతూ తూర్పుగా సముద్రం వైపు నడిచాను.

సూర్యుడు అస్తమించాడు. చెట్లమీదుగా సముద్రపు చలిగాలి వీవసాగింది. నెమ్మదిగా చీకట్లు అలుము కుంటున్నాయి. నేనీ పాటికి దాదాపు సముద్ర తీరం దాకా వచ్చాను. దూరంగా తెల్లరాళ్ల గుట్ట కనిపించింది. బెన్‌గన్ చెప్పిన తెల్లగుట్ట అదే అయి వుంటుంది. అక్కడే తనపడవ దాచానన్నాడు బెన్ గన్. ఎప్పుడన్నా అవసరమైతే ఆ పడవ వాడుకో వచ్చునని ఆప్రదేశం గుర్తు పెట్టుకున్నాను.

అప్పటికి ఫిరంగి కాల్పులు ఆగిపోయాయి. కనుక ఇక అపాయం లేదని వెనకనుండి నా మిత్రులున్న స్థలంవైపు నడిచాను. మట్టికోట చేరగానే నా కేకలు విని డాక్టరుగారు, ఇతరులు ఎదురువచ్చి లోపలికి తీసుకుపోయారు.

నాకథంతా క్లుప్తంగా చెప్పాను. తరవాత చుట్టూ పరకాయించి చూసి పరిస్థితు లర్థం చేసుకున్నాను. రెడ్రూత్ శవం ఇంకా సమాధి చేయబడలేదు. అబ్రహాం గ్రేకు కణతలమీద తగిలిన గాయం పచ్చి వుండి అతడొకమూల పడుకుని మూలుగుతున్నాడు.

కెప్టెన్ స్మాలెట్ మమ్మల్ని సోమరిగా కూర్చోనివ్వలేదు. రాత్రంతా మట్టికోటను కాపలా కాయవలసి ఉంటుందన్నాడు. మమ్మల్ని రెండు దళాలుగా విభజించాడు. నేను, డాక్టరుగారు, గ్రే ఒకదళం. జమీందారుగారు, హంటర్, జోయిస్ మరొకదళం. అందరం అలిసిపోయి వున్నాం. ఎవరికీ వంట్లో వీసమెత్తు ఓపిక లేదు. కాని పడుకుని నిద్రపోతే పనులెల్లా జరుగుతాయి? కెప్టెన్ ఇద్దర్ని కట్టెలు కొట్టుకురావడానికి పంపించాడు. ఇద్దర్ని రెడ్రూత్ శవం పాతిపెట్టేందుకు గొయ్యి తవ్వమన్నాడు. డాక్టరుగారికి వంటపని అప్పగించాడు. నన్ను ద్వారంవద్ద గస్తీ కాయమన్నాడు. తాను ఎవరికేది కావలిస్తే అది అందిస్తూ, అందరినీ ఉత్సాహపరుస్తూ తిరుగుతున్నాడు.

డాక్టరుగారు పొయ్యిదగ్గిర ఎప్పుడూ అలవాటు లేనుగావును పొగలో ఉక్కిరి బిక్కిరౌతున్నారు. ఉండుండి లేచి ఒకసారి అటూయిటూ పచార్లుచేసి మళ్లీ పని చేసుకుంటున్నారు. ఒక్కోసారి నాదగ్గిరికి వచ్చి కబుర్లుచెప్పి వెడుతున్నారు.

"జిమ్! స్మాలెట్ ఉన్నాడే నా కంటే, ట్రెలానీ కంటే దిట్టమైనమనిషి. కెప్టెన్ అంటే అలా వుండాలి. ఎంత వ్యవహారజ్ఞానం, తెలివితేటలు ఉన్నాయో చూశావ్ అతనికి," అన్నారు డాక్టరుగారు.

ఇంకోసారి వచ్చి అడిగారు: "జిమ్! ఈ బెన్ గన్ నిజంగా మనిషేనా? లేక ఏదన్నా భూతమా?"

"ఏమోనండి నాకూ తెలియటంలేదు. మనిషో కాదో గాని పిచ్చివాడని మాత్రం అనుమానించవచ్చును," అన్నాను.

"మూడేళ్లపాటు ఈ ఒంటరి ద్వీపంలో గోళ్లు గిల్లుకుంటూ కూర్చున్న మనిషి నీ లాగా, నాలాగా ఉండమంటే ఎల్లా ఉంటాడు. అన్నట్టు అతనికి జున్ను బాగా ఇష్టమని చెప్పావుగదూ?

"అవునండి."

"చూశావా, మనం అనుకోకుండానే ఒక్కోసారి మంచి పనులు చేస్తూంటాము. నాదగ్గిర వెండి పొడుండబ్బా ఉందే, దాంట్లోంచి నేను పొడుంతీసి పీలుస్తుంటే ఎప్పుడన్నా చూశావు నువ్వు? చూడలేదు. ఎందు కంటే; దాంట్లోఉన్నది ముక్కుపొడుం కాదు; ఇటలీలో తయారైన జున్నుముక్క. ఎందుకో బుద్ధిపుట్టి దాన్ని అల్లా దాచాను. ఆజున్ను బెన్ గన్ కిస్తాను."

రెడ్రూత్ ను పాతిపెట్టాక భోజనాలు చేశాము. తలొకగ్లాసు బ్రాందీ తాగాము. తరవాత మా ముగ్గురు నాయకులు ఒకమూలచేరి చర్చలు సాగించారు.

మాదగ్గిరున్న ఆహారపదార్థాలు ఆట్టే రోజులు రావు. బయలుదేరే ముందు జమీందారుగారు ఏర్పాటు చేసిన ప్రకారం ఇంగ్లండు నుండి మాకు రక్షణ వచ్చే వరకూ ఉన్న ఆహారాన్నే సరిపెట్టుకోవాలి. అది ఎలాగూ అసంభవం కనుక మాకు ఇక రెండే మార్గాలున్నాయి: తిండికి మాడి చనిపోనైనా చనిపోవాలి; లేక తిరుగుబాటు దార్లకు లొంగిపోవాలి. చివరకు ముగ్గురు నాయకులూ చర్చించి తేల్చిన దేమిటంటే తిరుగుబాటు దార్లలో వీలైనంత ఎక్కువమందిని హతం చెయ్యాలి. ఇప్పటికే వాళ్ల సంఖ్య పందొమ్మిది నుండి పదిహేను వరకూ దిగింది. మరిద్దరు గాయాలుతిని వున్నారు. ఓడమీద ఇజ్రాయెల్ హాండ్స్‌కు తగలవలసిన దెబ్బతగిలి పడిపోయినమనిషి చనిపోయాడో

లేదో తెలియదు కాని వాడుకూడా లేనట్టేలెక్క.

ఆ రాత్రి చాలాపొద్దు పోయేవరకూ ఓడమీద శత్రువులు రమ్ తెగతాగి పాటలు పాడుకుంటూ, దెబ్బలాడుకుంటూ గడిపారు. మేము వంతుల ప్రకారం కాపలా కాశాము. నావంతు అయిపోయిన తర్వాత శుభ్రంగా పడుకుని నిద్రపోయాను. తెల్లవారుకట్ల నా మిత్రుల సందడితో లేచాను. "సంధి జెండా" అని ఎవరో అనడం వినిపించింది. "సిల్వర్ వచ్చాడండోవ్!" అని మరొకరు కేకవేశారు. నేను కళ్లు నులుపుకుంటూ లేచి గోడలోని రంధ్రంద్వారా బయటికి చూశాను. ఆవరణ అవతల ఇద్దరు నుంచున్నారు. ఒకడు తెల్ల జెండా ఊపుతున్నాడు. రెండోవాడు సిల్వర్. ఊతకర్ర చంకలో పెట్టుకుని మాకేసి చెయ్యి వూపుతూ ఠీవిగా నుంచుని వున్నాడు. (ఇంకావుంది)

విద్యార్థి

శ్రీ సమయమంత్రి రాధాకృష్ణ

రామం స్కూలునుండి అప్పుడే వస్తున్నాడు. ఆ రోజున అతడు చాలా సంతోషంగా ఉన్నాడు. వచ్చే వారం వాళ్ల స్కూలులో ఎక్కువ శుచి, శుభ్రత, ఆరోగ్యంకలిగి, మంచి నడవడిఉన్న వారికి బహుమతీ నిస్తారట. అందరూ రామానికే ఆప్రైజు తప్పక వస్తుదని అనుకుంటున్నారు.

రామం ప్రొద్దున్నే మేలుకుంటాడు. కాలకృత్యాలు స్నానము, దైవప్రార్థనము, చద్ది భోజనము ముగించి చక్కని చుక్కలా తయారై శ్రద్ధగా చదువుకుంటాడు. ఇంటిలో ఏదైనా అవసరంవస్తే సహాయం చేస్తాడు. సరే! ఇక సరియైన టైముకి స్కూలుకి వెడతాడని వేరేచెప్పాలా! క్లాసులో అన్నిశాఖలలోను తనదే ఫస్టు మార్కు. టైముకి చదువుకొని, టైముకి ఆడుకొని, టైముకి భోజనం చేస్తాడు. శుచి, శుభ్రతా కలిగి యితరులకు సహాయం చేస్తాడు కాని సాధారణంగా తానితరులచేత సహాయం చేయించుకోడు.

ఈరోజే బహుమానం యిచ్చే దినం. రామం సంతోషంతో చక్కగా ముస్తాబై చకచకా బడికి బయలుదేరాడు. హటాత్తుగా ఒక గుంపునుచూచి ఆగిపోయాడు. ఆ సమూహానికి కారణం-ఒకడు కారు క్రిందపడి కాలునలిగి పోవుటచే స్పృహ తప్పినాడు. ఆకాలినుండి రక్తం కాల్వగా పారుతోంది. రామం గుండె మండే కొలిమిదగ్గిర పెట్టబడిన మంచుముక్కలా కరిగి పోయింది. ఆ దెబ్బతగిలిన అభాగ్యుడితో తానుగూడ ఆసుపత్రికి వెళ్లాడు.

దెబ్బనుండి చాలా రక్తం పోవుటవల్ల డాక్టరు రక్తం కావాలన్నాడు. పరోపకార హృదయాలు కలవారు కొందరు తమరక్త మివ్వజూచారు కాని దెబ్బతగిలిన వాని రక్తముతో వారి రక్తము సరిపోలేదు. ఆఖరున రామం ధైర్యంగా

"డాక్టరుగారూ! నారక్తం చూడండి" అని అడిగాడు.

"నీ వింకా చిన్నపిల్ల వాడివి అబ్బాయీ!" అన్నారు డాక్టరు.

"అయితేనారక్తంపనిచేయదా!"

"పనిచేయదని కాదు! కాని..."

"అయితే ఆలస్య మెందుకు? మరణదశలో వున్న మరియొక ప్రాణికి సహాయపడుటకేకదా మనము జన్మించింది."

ఆనందాశ్చర్యాలతో రామాన్ని మెచ్చుకుంటూ డాక్టరు రామం రక్తాన్నితీసి పరీక్షించాడు. ఆ రెండు రక్తాలు సరిపోయాయి. రామం తన రక్తం యిచ్చి మరో మానవుడికి ప్రాణదానం చేశాడు.



స్కూలుకి టైంఅయింది. రామం రాలేదు. బహుమతి మరొకనికి పోయింది. అందరికీ రామం రాలేదని ఆశ్చర్యం, విచారం. రామం ఎందుకు రాలేదు? రామం యింటికి వచ్చి చూశారు. రామం మంచం మీద-నీరసంతో...

రామం సంపాదించినది దేవుని ఆశీర్వచనం అనే గొప్ప బహుమతి. అందరి కంటె గొప్పవాడు రామం- త్యాగి - శుచి, శుభ్రత-సత్యవ్రతము - దీనరక్షణ-దయ- సమయస్ఫూర్తి - దైవభక్తి ఇవన్నీకలసి త్వరలోనే రామాన్ని ఆరోగ్యవంతుని చేశాయి. అతని ఔదార్యం వేనోళ్ల పొగడబడింది.

మరుసటి సంవత్సరం క్లాసులో రామం బహుమతి పొందాడు. క్రిందటిసారి అతడుచేసిన ఉపకారం ఈసారి నిండుసభలో చెప్పి అధికారులు రామాన్ని ఆశీర్వదించారు.

ఉపాయము

"సత్యానందం"

ఒకప్పుడు ఒక ఓడ హార్బరుకు వచ్చి ఆగింది. ప్రయాణీకు లందరూ తమ టిక్కెట్లను గేటులో ఇచ్చేసి ఓడదిగి పోతున్నారు. అంతలో ఒక ఆసామీ టిక్కెట్టు యివ్వకుండా ఘరానాగా దిగి పోతున్నాడు. అప్పుడు టిక్కెట్లు వసూలు చేసే అతను "మిస్టర్" అనిపిలిచేడు. వెంటనే ఘరానా మనిషి ఆగి పోయాడు. అతడు చూపులకు డబ్బున్న వాడిలా కనుపిస్తున్నాడు. టోపీ, చేతిలో హంటరు ఉన్నాయి.



వారిద్దరికి సంభాషణ యీవిధంగా జరిగింది.

"మీటిక్కెట్టు ఏది సార్"

"టిక్కెట్టేమిటి"

"బలే వాడివయ్యా టిక్కెట్టేమిటీ?"

"నేను ఓడ ఎక్కరాలేదే"

"లేకపోతే ఎక్కడ నుంచి వచ్చావు"

"చాలా దూరం నుంచి వచ్చాను."

"అంటే టిక్కెట్టు లేకుండానా"

"నేను ఓడ ఎక్కరాలేదయ్యా స్వామీ"

"మరి!"

"ఈదుకుని వచ్చాను"

"అయితే ఓడమీద నుంచి ఎలా దిగావ్"

"అలా దారికిరా. హార్బరు చేతికి అందదని వెనుక వైపునుంచి ఓడఎక్కి యిలా వచ్చాను."

"అయితే నువ్వు గొప్ప యీతగాడి వన్నమాట"

"అన్నమాటే"

"అయితే నువ్వు ఎన్నిరోజులు ఈదగలవయ్యా"


"ఎన్నాళ్లయినా సరే"

"ఇక్కడ మాకు ఒక యీతగాడున్నాడు. వానితో ఈత పందెము వేస్తావా?"

"ఓ, తప్పకుండా"

"అయితేవిను. నీవు పందెములో నెగ్గితే నిన్ను పోనిస్తాము. లేదా ప్రాణగండం తప్పదు. రేపు ఉద

యమే పోటీ. అప్పటివరకు నీవు యిక్కడే ఉండాలి" అని అనేసి వానిని ఒక నౌకరుకు వప్పగించి చరచర వెళ్ళిపోయాడు. ఇక మన వాడు ఆలోచనలో పడ్డాడు. "అరే యీ గండం ఎలా తప్పించుకోనేది. నాకు నీళ్ళంటే భయమే. ఎప్పుడూ నీళ్ళలోనైనాదిగి ఎరగనే.



అలాటిది సముద్రములోనా యీత. దానికి ఏదైనా ఉపాయం ఆలోచించాలి." అని అనుకుంటూ ఉండగా ఓడ యజమాని యీతగాణ్ణి తీసుకువచ్చాడు.

ఆయీతగాణ్ణి చూడగానే మన వాడి ప్రాణాలు ఎగిరిపోయాయి. వణుకు ప్రారంభించింది. "ధైర్యే సాహసే లక్ష్మీ' అని పెద్దలన్న మాటలు జ్ఞాపకం తెచ్చుకొని ధైర్యంగా నిలబడి "వీరే నాయీత యీదువారు" అన్నాడు. అవునన్నట్టుగా తల ఊపాడు ఓడ యజమాని.

"మీరు ఎన్ని రోజులు యీదగలరండి"

"రోజులే? ఒకపూట"

"ఇస్! ఈమాత్రం దానికేనా యింత హడావిడి. అయితే వినండి. పందెములోగా మీరు ఒకపని చెయ్యాలి"

"ఏమిటది"

"నాకు పందెములోకి కావలసిన సరుకులను తీసుకురావాలి."

"సరుకు లేమిటయ్యా"

"బాగానే ఉంది. నేను ఎన్ని రోజులు యీదుతానో నాకే తెలియదు. త్రోవలో ఆకలివెయ్యదా. అందుచే వంటకు బియ్యము, కూరలు వగైరా తీసుకురండి. డబ్బుయిస్తాను."

"అరే యీత యీదుతూ వంట ఎలా చేస్తావు"

"అదే మజా. నాకుయిది మొదటి సారికాదు. చాలా సార్లు యిలా చేశాను"

యీమాటలు వినేసరికి క్రొత్తగా వచ్చిన యీతగాడు ఆశ్చర్యపోయాడు. ఇలా చెప్పిన వారిని అతడు యిదివరలో ఎరుగడు. నిజంగా అతడు గొప్ప యీతగాడని అనుకొన్నాడు. కొత్తవాని చేతిలో వోడిపోవడం అతనికి ఏమాత్రం యిష్టంలేదు. అందుచే అతడు పోటీకి ఒప్పుకోలేదు. అప్పుడు అతనిని వదలి వేశారు. ఎప్పుడూ ఉపాయాన్ని మించినది లేదు. ★



కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

(22-వ పేజీ తరువాయి)

మతానుసారంగా పవిత్ర జలాలతో నాకు మరణం చేసినప్పుడివ్వబడిన పత్రం. నాతల్లి క్రైస్తవ మతస్థురాలు. 'ఇవి నన్నూ నాతల్లినీ నాలుగు లక్షల ఫ్రాంకులకు కబీర్ అనే బానిస వర్తకునికి ఫ్రెంచి ఉద్యోగి ఫెర్నాండో అమ్మినప్పుడివ్వబడిన పత్రం ఇది కబీర్ వద్దనుంచి కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో నన్ను కొన్నప్పుడు తీసుకున్న పత్రం" హైదీ పత్రాలను అధ్యక్షుని చేతికందించింది. మార్సెర్ఫ్ ముఖం బొత్తిగా పాలిపోయింది. సభలో ఘోరనిశ్శబ్దం ఆవరించింది.

కొంతసేపైన తరవాత అధ్యక్షుడు హైదీతో ఇలాఅన్నాడు: "కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో ఈనగరంలోనే ఉన్నారనుకుంటాను. వారిని రప్పించి అడగవచ్చునా?"

"నాకు పెంపుడు తండ్రయిన కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో ఉత్తరాది ప్రాంతాలకు సంచారానికి వెళ్లి మూడురోజులయింది."

"అయితే సాక్ష్యమివ్వవలసిందని మీకెవరు సలహా ఇచ్చారు?"

"నాతండ్రిపట్ల ద్రోహంచేసి ఆయనను హత్యచేసిన దురంతకుడు పారిస్‌లో ఉన్నాడని నాకు తెలుసును. నేను ఫ్రాన్సు దేశం వచ్చింది మొదలూ ఆదుష్టశత్రువు జాడలు కనుక్కుంటూనే ఉన్నాను. నా పెంపుడు తండ్రి సమకూర్చిన సదుపాయాలవల్ల దేశంలో మిగిలిన ప్రపంచంలోనూ ఏమేమి జరుగుతున్నదో సర్వం తెలుసుకుంటున్నాను. ఇవాళ ఉదయం ఉన్నతసభలో జరిగినదంతా తెలిసింది. ఈ పూట విచారణ జరుగుతుందని తెలిసి నేనే వచ్చాను."

"అయితే ఈ సభలో జరుగుతున్నదేదీ కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టోకి తెలియనే తెలియదా?"

"తెలియదు. కాని నా తండ్రిని ద్రోహంచేసిన పరమ శత్రువుపైన పగతీర్చుకోడానికి అవకాశం లభించినందుకు ఇవాళ నా ఆనందానికి మేరలేదు."

మార్సెర్ఫ్ ఒక్కపలుకు పలకలేదు. అధ్యక్షు డతనివంక తిరిగి "కౌంట్! మీ రీమెను గుర్తుపట్టగలరా?" అన్నాడు.

మార్సెర్ఫ్ ఒకసారి లేచి నిలబడ్డానికి ప్రయత్నించి "లేదు" అంటూ అలాగే మళ్లీ కూలబడిపోయాడు.

హైదీ ఈమారు మార్సెర్ఫ్‌వంక తిరిగి ద్వేషం వెలిగక్కుతూ తీవ్రస్వరంతో ఇలా అంది "నన్ను గుర్తుపట్టలేరా? కాని నేను మిమ్మల్ని ఎక్కడున్నాసరే ఎంతమందిలో ఉన్నాసరే గుర్తుపట్టగలను. మీ పేరు ఫెర్నాండో, నాతండ్రి సైన్యాలను నడిపినవారు మీరే. జెనీనా కోటను శత్రువుకొప్పగించినది మీరు. నా తండ్రి తరఫున రాయబారిగా కాన్‌స్టాంటినోపుల్ నగరంవెళ్ళి తిరిగివచ్చి, క్షమార్పణ సాధించివచ్చినట్లు అబద్ధమాడినది మీరు, బూటకపు ఫర్మానా చూపించి నా తండ్రివద్ద ఉంగరం తీసుకున్నది మీరు: సరస్సుమధ్య కోటను సంరక్షిస్తున్న సలీమ్‌ను పొడిచి చంపినది మీరు. నన్నూ నా తల్లినీ కబీర్‌కి అమ్మినది మీరు. హంతకుడు. ఎవరి ఉప్పుతిని ఉన్నతికి వచ్చారో వారు నెత్తికొడ్చిన కళంకం మీ ముఖాన శాశ్వతముద్ర వేసింది. చూడండి న్యాయమూర్తులైన సభ్యులందరూ ఆ ముఖంవంక జాగ్రత్తగా చూడండి."

సభ్యులందరూ మార్సెర్ఫ్‌వంక చూశారు. నుదుటిపై రక్తం తుడుచుకుంటున్నట్లు మార్సెర్ఫ్ చేతితో తుడుచుకున్నాడు. చేతికి వేడిరక్తం అంటినట్లు భయపూరిత దృష్టితో చేతివంక చూసుకున్నాడు.

"కౌంట్ మార్సెర్ఫ్, కల్నల్ ఫెర్నాండో ఒకరేనని గుర్తుపట్టగలరా?" అధ్యక్షు డడిగాడు.

"తప్పకుండా. నా తల్లి చెప్పింది. 'చూడు. అతని చేతిని జాగ్రత్తగా గమనించు. నీ తండ్రి శిరస్సు ఛేదించి శూలానికి గుచ్చి పైకెత్తినదా చెయ్యి. నిన్నూ నన్నూ బానిసలుగా తెగనమ్మినదతనే. అతని కుడిముంజేతిని జాగ్రత్తగా చూడు. పెద్ద గాయానికి చిహ్నంగా మచ్చ ఒకటుంది. ఆ చిహ్నం మరిచిపోకు. ఆ ముఖాన్ని మరిచిపోకు. ఆ వ్యక్తిని మరిచిపోకు.' నా తల్లి చెప్పిన మాటల్ని నేను మరిచిపోలేదు. నన్ను గుర్తించలేదని చెప్పగలడా? గుండెలపై చెయ్యి వేసుకుని చెప్పమనండి."

హైదీ ఉచ్చరించిన ప్రతిమాటా శూలమై పొడిచినట్లయిందతనికి. లోనిబాధ భరించలేక కుర్చీలో ఇటు మసిలి అటు మసిలి చివరికి నిస్సత్తువతో చేరగిలబడిపోయాడు. ముచ్చెమటలు పట్టాయి. అందరూ నివ్వెరపోయి అతనివంక చూస్తున్నారు.

అధ్యక్షు డిలా అన్నాడు: "కౌంట్! అధైర్య పడకండి. జవాబు చెప్పండి. ఈ సభకు మించిన న్యాయవిహితమైన సంస్థ మరొకటి లేదు. ధర్మం భగవంతుని స్వరూపమే. మీ శత్రువుల ముందు మీరు తలొగ్గవద్దు. స్థైర్యం చిక్కబట్టుకుని లేచి చెప్పండి. న్యాయనిర్ణయంకోసం సంపూర్ణమైన విచారణ జరపడానికిగాను మీరు మీ వాదాన్ని వివరించండి. ఇంకా పరిశోధ నేదైనా జరపవలసిన అవసరం ఉందంటారా? చెప్పండి. ఇద్దరు సభ్యుల్ని జెనీనా పంపుదామా? మీ జవా బేమిటి?"

"నే నివ్వగల సమాధానం లేదు" అన్నాడు మార్సెర్ఫ్ కుంగిపోతున్న కంఠస్వరంతో.

"అయితే అలీ పాషా కుమార్తె హైదీ చెప్పినదంతా సత్యమేనా? మీరు నిర్దోషినని చెప్పుకోలేని ద్రోహాన్ని ఆమె స్వయంగా చూసినట్లు చెప్పిన వివరాలన్నీ నిజమేనా? మీపై ఆరోపించబడిన నేరానికి మీరు బాధ్యులేనా?" అన్నాడు అధ్యక్షుడు.

మార్సెర్ఫ్ అతి దీనంగా చుట్టూ సభ్యులందరివంకనూ చూశాడు. తన మిత్రులముఖాలలో సంశయభావాన్ని గమనించి సహించలేక పోయాడు. తటాలున లేచి సభలోనుంచి గబగబ నడిచి వెళ్లిపోయాడు.

అధ్యక్షుడు సభ్యులను చూసి "కౌంట్ మార్సెర్ఫ్ దోషాన్ని గురించి మీ నిర్ణయమేమిటి?" అన్నాడు. అందరూ ఏకకంఠంతో "దోషి" అన్నారు.

వృత్తాంతమంతా విని ఆల్బర్ట్ లేచి నిలబడ్డాడు. రెండు చేతులతోనూ తలగట్టిగా పట్టుకున్నాడు. "అబ్బ" అన్నాడు. "బోశాంప్. నే నిది భరించలేను. ఇంక నా జీవితం ఇంతటితో ఆఖరు. కాని ఇంత పగపూని నిన్ను వెంటాడించే ఆ శత్రువెవరు? ఎక్కడున్నా సరే వేటాడి చంపుతాను. లేదా నేనే ఆశత్రువు చేతిలో చావాలి. నీ కింకా నాపట్ల సానుభూతి మిగిలిఉంటే, ఆశత్రు వెవరో తెలుసుకోడానికి సహాయంచెయ్యి"

"కాని ఇందులో నీ దోషమేముంది ఆల్బర్ట్! తండ్రి తప్పిదాలు కుమారులను వెంటాడే రోజులు గతించిపోయాయి. అలా కాదు. నా మాట విను. ఆల్బర్ట్. నీ వింకా యువకుడవు. భాగ్యవంతుడవు. పారిస్‌నగరం విడిచివెళ్లిపో. ఏ రష్యన్ రాకుమారినో పెళ్లిచేసుకుని నాలుగైదేళ్ల తరవాత తిరిగిరా. నిన్న జరిగినదానినే

మరిచిపోయే లోకం ఈ వృత్తాంతాన్ని కూడా ఇట్టే మరిచిపోతుంది."

"నీకు నాపట్ల ఇంకా స్నేహభావం ఉన్నందుకు కృతజ్ఞుణ్ని బోశాంప్. కాని ఇదిలా జరగదు. నీ కింకా నాపట్ల ఈ స్నేహం నిజంగా ఉంటే ఆ శత్రువుని కనిపెట్టడంలో సహాయ్యం చెయ్యి."

"సరే నీ యిష్టం. నా సహాయంలో లోపం ఉండదు."

"అయితే వెంటనే ప్రయత్నించాలి."

"అయితే నే నొకటి చెప్తాను విను. జెనీనానుంచి తిరిగి వచ్చిన తరవాత నేను తెలుసుకున్న ఒక విషయాన్ని మాత్రం నీకు తెలపలేదు. జెనీనా వెళ్లగానే ముందుగా అక్కడొక బాంకర్ ని కలుసుకున్నాను. నేను నీ తండ్రిపేరు చెప్పానో లేదో వెంటనే 'ఓ! మీ రెందు కొచ్చారో నాకు తెలుసును' అన్నాడు. ఎందుకని అడిగాను. 'పదిహేను రోజుల కిందట ఈ సమాచారంకోసమే నన్నొకరడిగారు' అన్నాడు. ఎవ రన్నాను. 'డాంగ్లర్' అన్నాడు."

"ఇదే నిజమైతే డాంగ్లర్ శిక్ష అనుభవించవలసిందే" అన్నాడు ఆల్బర్ట్.

"ఆల్బర్ట్! నువ్వు చేస్తున్నది తప్పనడంలేదు. కాని ఓపిక పట్టమని సలహా ఇస్తున్నాను. తొందరపడవద్దు డాంగ్లర్ తో మాట్లాడదాంరా."

ఆల్బర్ట్ సమ్మతించాడు.

76

ఇద్దరూ డాంగ్లర్ ఇంటికి వెళ్ళేసరికి, ఇంటిముందు కావల్కాంటీ బగ్గీ కనపడింది. "డాంగ్లర్ నాతో ద్వంద్వ యుద్ధానికి రాకపోతే అతని అల్లుడినైనా సరే చంపుతాను" అన్నాడు ఆల్బర్ట్. బోశాంప్ జవాబివ్వలేదు.

ఇదరూ లోనికి వెళ్లారు. పరిచారకునిద్వారా కబురు పంపకుండానే తలుపు తెరుచుకుని లోపావడి ప్రవేశించారు. డాంగ్లర్ కంగారుపడుతూ "ఈ వేళప్పుడు నాతో మీకేంపని?" అన్నాడు.

"మిమ్మల్ని ద్వంద్వయుద్ధాని కాహ్వానించడానికి" అన్నాడు ఆల్బర్ట్. డాంగ్లర్ తెల్లబోయాడు.

ఆంద్రీ కావల్కాంటీ ఒకడుగు ముందుకు వేశాడు "మీరు కూడా నాతో ద్వంద్వయుద్ధం చెయ్యాలి" అన్నాడు ఆల్బర్ట్ అతనివంక క్రోధంతో చూస్తూ. కావల్కాంటీ తెల్లబోయి డాంగ్లర్ ముఖంవంక చూశాడు.

"నా కూతుర్ని మీకు బదులు ఇతని కిస్తున్నందుకైతే, మిమ్మల్ని న్యాయాధికారి కొప్పగించడం తప్ప ద్వంద్వయుద్ధంతో నాకు పనిలేదు." అన్నాడు డాంగ్లర్.

"పొరపాటు పడుతున్నారు" అన్నాడు ఆల్బర్ట్.

"అయితే మీ తండ్రి పరాభవం చేతులారా తెచ్చి పెట్టుకుంటే అది నా తప్పా?" అన్నాడు డాంగ్లర్.

"అవును. మీరు స్వయంగా ఈ రహస్యాన్ని బయట పెట్టలేదు నిజమే. కాని దీనికి మూలం మీరే."

"నేనా?"

"అవును. మీరుకాక జెనీనాకి ఉత్తరం వ్రాసి తెలుసుకున్న దెవరు?"

"నేను వ్రాసినమాట నిజమే. కాని కూతుర్ని ఒక యింటికి పంపబోతూ, ఆ యింటి మంచిచెడ్డలు తెలుసుకోని వారెవరుంటారు?"

"అవును—మీ కెలాంటి సమాధానం వస్తుందో తెలిసే జనీనా ఉత్తరం వ్రాశారు."

డాంగ్లర్ ఈమారు కొంత తేరుకుని ఇలా అన్నాడు: "సమాధానం సంగతి నాకు ముందు తెలియదు. నా మాట నమ్మితే నమ్మండి. లేకపోతే లేదు. కాని ఉన్నది చెప్పాను."

"అయితే జెనీనా వ్రాసి తెలుసుకోమని మీకు సలహా ఎవరిచ్చారు?"

"దానికేముంది? ఎవరైన చెప్పవచ్చును—నేనొకసారి మీ తండ్రిగారి చరిత్ర గురించి ఒకరితో మాట్లాడాను. ఆయన మీ తండ్రి ఇంత భాగ్యం ఎక్కడ సంపాదించారని నన్నడిగారు. గ్రీస్ దేశంలోనని చెప్పాను. అయితే జెనీనాకు వ్రాస్తే తెలుస్తుంది కదా అన్నాడాయన. అంతే!"

"ఆయనంటే ఎవరు?"

"మీ మిత్రుడే. కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో."

ఆల్బర్ట్, బోశాంప్ తెల్లబోయారు. ఒకరివంక ఒకరు చూసుకున్నారు.

ఈమారు బోశాంప్ అడిగాడు: "జెనీనానుంచి వచ్చిన జవాబు మాంట్ క్రిస్టోకి తెలుసునా?"

"పూర్తిగా తెలుసును."

"నా తండ్రి పేరు ఫెర్నాండో అని కూడా ఆయనకు తెలుసునా?" అన్నాడు ఆల్బర్ట్.

"అదీ చెప్పాను. జవాబువచ్చిన మరుచటిరోజే మీ తండ్రి నా వద్దకు వచ్చారు. కాని కారణం చెప్పకుండా వివాహప్రసక్తి నిరాకరించాను. ఆయన మంచిచెడ్డలతో నూ కళంకంతోనూ నా కేమి పని? నాకు లాభమూ లేదు నష్టమూ లేదు.

ఆల్బర్ట్ ముఖం ఎర్రబడింది. డాంగ్లర్ ఎంత నీచుడైనా నిప్పుడు చెప్తున్న దానిలో అబద్ధంలేదని స్పష్టపడుతోనే ఉంది. ఆల్బర్ట్ ఆలోచించాడు. తన కెవరిపైన కోపం? నిజానికి డాంగ్లర్ పైనా కోపంలేదు. మాంట్ క్రిస్టో పైనా కోపం లేదు. కాని అవమానాన్ని భరించలేక ఎవరితోనో ఒకరితో ద్వంద్వ యుద్ధం చెయ్యాలని మాత్రం సంకల్పించుకున్నాడు. తనతో ద్వంద్వ యుద్ధానికి డాంగ్లర్ రాడు.

క్రమంగా అన్ని విషయాలూ ఆల్బర్ట్ కి జ్ఞప్తికి రాసాగినాయి. మాంట్ క్రిస్టోకి సర్వం తెలుసును. పాషా కూతుర్ని అతనే కొన్నాడు. అంతా తెలిసే మాంట్ క్రిస్టో జెనీనాకు లేఖ వ్రాసి వృత్తాంతం తెలుసుకోమని డాంగ్లర్ కి సలహా ఇచ్చాడు. తన తండ్రిపైన పిడుగుపాటు వస్తున్నదని తెలిసే ఉత్తరాదికి తనను సంచారానికి తీసుకువెళ్లాడు. తన తండ్రి శత్రువులతో చేరి మాంట్ క్రిస్టో కుట్ర పన్నాడు.

యువకు లిద్దరూ ఇంక జాగుచెయ్యకుండా మాంట్ క్రిస్టో వద్దకు బయలుదేరారు.

"ఆల్బర్ట్! తొందరపడకు సుమా! జాగ్రత్త" అన్నాడు బోశాంప్, దారిలో.

"ఎందుకు?"

మాంట్ క్రిస్టో సామాన్యుడుకాడు."

"బోశాంప్! నాకు కావలసినదదే. తండ్రికి బదులు ప్రాణాలు బలివ్వడం కంటె కొడుక్కి వేరే ఆనందంలేదు. ఇది అందరికీ మేలు" అన్నాడు ఆల్బర్ట్ హృదయభారంతో.

మాంట్ క్రిస్టో ఇంటిలో లేడు. కాని ఆ సాయంకాలం నాటకప్రదర్శనానికి వెళ్లనున్నట్లు పరిచారకులవల్ల యువకులు తెలుసుకున్నాడు. ఇద్దరూ ఎవరిళ్లకు వారు వెళ్లారు. సాయం

కాలం నాటకానికి రావలసిందని తన మిత్రులందరికీ కబురు పంపి ఆల్బర్ట్ తల్లిని దర్శించాడు. ఆమెను చూసీచూడగానే ఆల్బర్ట్ ఇలా అన్నాడు: "అమ్మా! తండ్రిగారికి శత్రు వెవరైనా ఉన్నాడా?"

మర్సిడా ఉలిక్కిపడింది.

"నాయనా! నీ తండ్రిస్థితిలో ఉన్నవారికి ప్రచ్ఛన్న శత్రువు లుండడంలో వింతలేదు. ప్రత్యక్ష శత్రువు లెన్నడూ ప్రచ్ఛన్న శత్రువులంత హానిపరులు కారు."

"అది నాకు తెలుసునమ్మా! కాని శ్రద్ధగా ఆలోచించు. మాంటుక్రిస్టోని నువ్వు గమనించే ఉంటావు. మన ఇంటిలో ఏ విందులోనూ ఆయన మంచినీరైనా ముట్టుకోలేదు."

మర్సిడాభీతితో లేచి నిలబడింది. "ఎవరి మాట? మాంట్ క్రిస్టో! ఆయనకీ నువ్వడిగే విషయానికీ సంబంధ మేమిటి?" అని అడిగింది.

"మాంట్ క్రిస్టోని ప్రాచ్యదేశ నివాసిగా మనం పరిగణించవచ్చును. ప్రాచ్యదేశవాసులు శత్రువుల ఇళ్ళలో మంచినీరైనా ముట్టుకోరట."

"ఏమిటి? మాంట్ క్రిస్టో మన శత్రువనా నువ్వు చెప్తున్నది?" అంది మర్సిడా కలవరంతో. "నీకలా ఎవరు చెప్పారు? నాయనా! నీకు తెలియదు. నిన్ను బ్రతిమాలుతున్నాను. ఆయన మనకి పరమ మిత్రుడు. ఆయనతో వైరం పెట్టుకోకు. ఆయన మన కేమపకారం చేశాడు? మూడ్రోజులు నువ్వాయనతో దేశ సంచారం చేశావుకదా? ఇంతలో ఏ మొచ్చింది?"

ఆల్బర్ట్ పెదవులపై వక్రమందహాస పొడగట్టింది. అది గమనించగానే మర్సిడాకు సర్వం బోధపడింది. కాని వివేకంతో, మనోస్థైర్యంతో తన భయాందోళనల్ని, భావకల్లోలాన్ని, దుఃఖాన్ని పైకి కనపడనీయకుండా విచిత్రముఖ భంగిమ చాటున కప్పుకుంది. ఆల్బర్ట్ మౌనం వహించాడు. మర్సిడా ఇలా అంది: "ఆల్బర్ట్! ఇవాళ నాకు బొత్తిగా అస్వస్థతగా ఉంది. నన్ను విడిచి ఎక్కడికీ వెళ్లకు."

"అమ్మా! నీమాట నే నెన్నడూ కాదనలేదు. ఇవాళ మాత్రం నన్ను క్షమించు. నాకు అత్యవసరమైన కార్యం ఒకటుంది." అంటూ ఆల్బర్ట్ జవాబుకోసం నిరీక్షించకుండా తల్లికి అభివాదంచేసి వెళ్ళిపోయాడు.

ఆల్బర్ట్ వెళ్ళినవెంటనే, అత నెక్కడెక్కడికి వెడుతున్నదీ, ఏమిచేస్తున్నదీ కనిపెట్టి ఎప్పటికప్పుడు తనకు తెలియపరచవలసిందని మర్సిడా పరిచారకుల కాజ్ఞ యిచ్చింది. ఏ క్షణాని కే అవసరం వస్తుందో ననే భావంతో దుస్తులు మార్చుకుని సిద్ధంగా ఉంది.

బోశాంప్ మొదలైన మిత్రులతో కలిసి ఆల్బర్ట్ సాయంకాలం నాటకప్రదర్శనానికి వెళ్లాడు. ఆల్బర్ట్ రావడం మాంట్ క్రిస్టో ఓరకంట కనిపెట్టాడు. మాంట్ క్రిస్టో ప్రక్కనే మారెల్ కూర్చున్నాడు. నాటకం కొంత జరిగినతరవాత విశ్రాంతి సమయంలో ఆల్బర్ట్ మిత్రులతోసహా లేచి వరండాలోకి వెళ్ళడం కూడా మాంట్ క్రిస్టో గమనించాడు. రానున్నదానిని అతను ముందే గ్రహించి అందుకు సంసిద్ధుడైనాడు. ఆల్బర్ట్ దగ్గరకురాగానే మాంట్ క్రిస్టో ముందు పలకరించాడు. "నువ్వు కోరుకున్నది సాధ్యపడిందనుకుంటాను ఆల్బర్ట్!" అన్నాడు.

ఆల్బర్ట్ కోపంతో ఉడికిపోతున్నాడు: "బూటకపు స్నేహభావం ప్రదర్శించుకోడానికీ, లేని మర్యాదలు చూపుకోడానికి నేను రాలేదు కౌంట్! మిమ్మల్ని సంజాయిషీ అడగడానికి వచ్చాను."

"సంజాయిషీ ఇక్కడా? ఇదేనా మీ దేశాచారం? నిన్న నా యింటికి వచ్చినప్పుడే అడగలేకపోయావా?"

"నిన్న మీ యింటికివచ్చిన మాట నిజమే! కాని అప్పుడు మీ రెవరో నాకు తెలియలేదు." ఈమారు తన మాట లందరికీ వినపడాలనే ఉద్దేశంతో ఆల్బర్ట్ బిగ్గరగా అరిచాడు.

మాంట్ క్రిస్టోకి ఈమారు కోపంవచ్చింది. "నా వద్దకువచ్చి బిగ్గరగా అరవడానికి ఎవరికీ హక్కులేదు. వెంటనే ఇక్కడినించి వెళ్లిపొండి. మీ అధికప్రసంగాలు వినడానికి నాకిక్కడ తీరిక లేదు."

ఆల్బర్ట్ కోపం మితిమీరింది. "నా కింక ప్రసంగంతో నిమిత్తంలేదు..." అని మాత్రం అనగలిగాడు.

"ఓహో! నాతో తగవుకోసం వచ్చినట్టున్నావు. కాని చీటికీమాటికీ ద్వంద్వయుద్ధమంటూ ఆగడం చెయ్యకు ఆల్బర్ట్! నా సలహా విని వెళ్లిపో."

ఆల్బర్ట్ ఇంక రోషం పట్టలేకపోయాడు. చేతిలో నున్న రుమాలు మాంట్ క్రిస్టో ముఖాన విసిరికొట్టడానికి ప్రయత్నించాడు. మాక్సిమిలియన్ ఆల్బర్ట్ చెయ్యి పట్టుకున్నాడు. కాని మాంట్ క్రిస్టో ఆల్బర్ట్ చేతిలోనున్న రుమాలు తీసుకుని, "ఆల్బర్ట్! మీ సవాలుకి నే నంగీకరిస్తున్నాను. రేపుదయానికే ఏర్పాట్లు చెయ్యండి. ఇంక వెంటనే ఇక్కడినించి వెళ్లిపొండి. లేదా నౌకర్లను పిలవవలసివస్తుంది" అన్నాడు. ఆల్బర్ట్‌ను బోశాంప్ చెయ్యి పట్టుకుని తీసుకువెళ్లిపోయాడు.

మాంట్ క్రిస్టో ఏమీ జరగనట్లు తిరిగి ప్రేక్షకులను పరిశీలించ నారంభించాడు. మారెల్, బిత్తరపోయి మాంట్ క్రిస్టోవంక చూడ నారంభించాడు.

తిరిగి నాటకం ప్రారంభమైన తరవాత బోశాంప్ మెల్లిగా మాంట్ క్రిస్టో వద్దకు వచ్చాడు: "కౌంట్! ఆల్బర్ట్ తొందరపాటుకు నేను మిమ్మల్ని క్షమార్పణ వేడుకుంటున్నాను. ఆల్బర్ట్ అడుగుతున్నదానికి సమాధానం మీరు నిరాకరించరని నా ఉద్దేశం. నాద్వారా చెప్పటం మీకు సమ్మతమేనా?"

"బోశాంప్! ఇంక మనము ప్రసక్తి విడిచిపెట్టడం మేలు. నాకు తోచిన విధంగా నేను చేస్తాను. నావల్ల తప్పు పట్టేవారింతవరకూ లేరు." అన్నాడు మాంట్ క్రిస్టో. అతని నిశ్చల భావం బోశాంప్‌కి ఆశ్చర్యం కలిగించింది. ఇలా అన్నాడు:

"గౌరవనీయులైనవారి నీవిధంగా తిరస్కరించడం తగదు. మీధర్మ నిరతి నిరూపించుకోటం న్యాయం."

"నేనే ధర్మమూర్తిని. వేరే నిరూపణల నవసరం బోశాంప్! మాయిద్దరి నాళాలలోనూ నెత్తురు ప్రవహిస్తోంది. నెత్తురోడ్చడం కంటె మించిన నిరూపణ లేదు. రేపుదయం పదిగంటలలోగా అతని నెత్తురు కంటచూస్తాను."

మాంట్ క్రిస్టో గంభీరస్వరం విని బోశాంప్ కంపించిపోయాడు. ఇతను అహంకారపూరితుడైన ఉన్మత్తుడో లేక అతీత శక్తి సంపన్నుడైన అసాధారణ పురుషుడో బోధపడలేదు.

"అయితే రేపు ద్వంద్వయుద్ధం తప్పదు. పిస్తోళ్లు తీసుకురండి" అన్నాడు బోశాంప్.

"తప్పకుండా" అన్నాడు మాంట్ క్రిస్టో.

బోశాంప్ వెళ్లిపోయాడు.

మాంట్ క్రిస్టో మారెల్ వంకతిరిగి "మాక్సిమిలియన్? నాతరఫున నువ్వు ఏర్పాట్లు చెయ్యగలవా?" అన్నాడు.

"తప్పకుండా" అన్నాడు మారెల్. "కాని ఈతగవుకి కారణం నేను తెలుసుకోకూడదా?"

"ఆల్బర్ట్‌కే తెలియదు. తండ్రిచేసిన తప్పిదాలకు కొడుక్కి పిచ్చెత్తుతోంది. సత్యమేదో నాకూ భగవంతునికీ తప్ప మరెవరికీ తెలియదు. సత్యం తెలిసిన భగవంతుడు మన పక్షానే ఉంటాడని నమ్మి మారెల్." "అది చాలు." అన్నాడు మారెల్. ★

★ ఎవరికీపట్టని సినిమా కళ ★

ఏలౌకిక సామాజిక వ్యాపారమైనా బాగుపడాలంటేనూ, అభివృద్ధి చెందాలంటేనూ, దాన్ని గురించి ఆందోళనపడే వారుండాలి, దాని కోసం త్యాగాలూ, కృషీ చేసేవారుండాలి. అంతదాకా ఆ వ్యాపారంలో ఎట్టి చలనమూ రాదు.

మన సినిమా చిత్రాలను గురించీ, వాటి నిర్మాణంలో లోపించే ఆశయాలనుగురించీ కళను గురించీ తమలో తాము విచారపడుతున్న వారూ, నిస్పృహ చెందుతున్న వారూ చాలా మంది ఉన్నారు. కాని వారి నిరాశా నిస్పృహాలవల్ల ప్రయోజనం అంతగా లేదు. ఏయే దృక్పథాలతో, ఆశయాలతో ప్రస్తుతం సినిమా చిత్ర నిర్మాణం సాగుతోందో వాటిలో అణుమాత్రమైనా మార్పు తీసుకురావటానికి ఈ నిరాశా నిస్పృహాలు తోడ్పడవు.

శిల్పంలో భారతీయ సినిమా చిత్రాలు ఇటీవల చాలా అభివృద్ధి చెందినప్పటికీ వాటిలోని కళా ఆదర్శాలూ దిగజారిపోయాయని, ప్రభుత్వంచేత నియోగింపబడిన ఫిలిం విచారణ సంఘం తన నివేదికలో తెలిపింది. బాధ్యతాయుతమైన ఇటువంటి సంఘం బహిరంగంగా ఆందోళన వెలిబుచ్చటం సినిమా పరిశ్రమకు మంచిదే. కాని దీనిని సరిచేయటానికి వారు సూచించిన మార్గమేమిటంటే ప్రభుత్వం తరఫున ఫిలిం కౌన్సిల్ ఏర్పరచి సినిమా పరిశ్రమనంతనీ దానిచేత శాసింప జేయటం. ఈ కౌన్సిల్‌లో 18 మంది సభ్యులుండాలనీ, అందులో ప్రొడ్యూసర్లూ, డైరెక్టర్లూ, ఎగ్జిబిటర్లూ, నటులూ, టెక్నీషియనులూ, కేంద్ర రాష్ట్రం నియోగించే సభ్యులూ, కార్మిక ప్రతినిధులూ ఉండాలనీ ఫిలిం విచారణ సంఘం శిఫార్సు చేసింది. 18 మందిలో ఇన్ని రకాలుండాలంటే రకానికి ఇద్దరేసి తయారవుతారు. ఇన్ని వందల మంది ప్రొడ్యూసర్లూ, డైరెక్టర్లూ, ఎగ్జిబిటర్లూ, నటులూ, టెక్నీషియనులూ కలిసి నడిపే పరిశ్రమ క్రమంగా ఆదర్శాలకు దూరమై పోతూ ఉంటే వీరిలోనుంచి ఈ తరగతుల వారికే ఇద్దరేసి చొప్పున ఫిలిం కౌన్సిల్‌లో స్థానం ఇచ్చినమాత్రాన పరి

సవరణ

14-11-51 సచిత్ర వారపత్రిక ముఖచిత్రం "రాజాంబాళ్" తమిళ చిత్రంలో పి. కె. సరస్వతి. ప్రమాదవశాన "లావణ్య" లో కుమారి కమల అని పడింది.

7-11-51 సచిత్రవారపత్రిక ముఖచిత్రం ఫోటోగ్రాఫరు : శ్రీ పి. గంగాధరరావు.



రాణీవాసంలోకి పోనున్న వాళ్లు రాళ్లుకొట్టేవాళ్లని పెళ్లాడతారా? రానున్నది తెలియక భానుమతి, రామారావును హేళనచేస్తోంది, వాహినీవారి మల్లీశ్వరిలో.

శ్రమలో కళావికాసాలు ఏర్పడతాయా? లేక అవి ఏర్పడే బాధ్యత కేంద్రప్రభుత్వ నియోజితులూ, కార్మిక ప్రతినిధులూ పుచ్చుకుంటారా? చాలాఅనుమానాస్పదం!


పోతే ఫిలిం ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు ఫిలిం కౌన్సిల్‌లో మూడో వంతు స్థానాలు ఫిలిం నిర్మాతలకూ, మరో మూడో వంతు ప్రభుత్వ ప్రతినిధులకూ, మిగిలిన మూడో వంతు ఫిలిం పరిశ్రమతో సంబంధాలుగల ఇతర పరిశ్రమల వారికీ ఇవ్వాలన్నారు. అయితే ఈ కౌన్సిలుకు సలహాలివ్వటం తప్ప పరిశ్రమమీద ఎట్టి అధికారాలూ ఉండరాదన్నారు.

చిత్ర నిర్మాణంలోని కష్ట సుఖాలూ బాధ్యతా, లాభ నష్టాలూ నిర్మాతలకేఉండనిచ్చి వారిని చిత్ర నిర్మాణం విషయంలో శాసించే అధికారాలను కౌన్సిలుకు కట్టబెట్టమని ఫిలిం విచారణసంఘం అంటుంటే; కావలయితే మాకు మార్గదర్శకులుగా మాత్రం ఉండి మమ్మల్ని స్వేచ్ఛగా చిత్రాలు తీయనివ్వండి అని ఫిలిం ఫెడరేషన్ వారంటున్నారు. మద్రాసు స్టూడియోల సంఘం వారు కూడా అదే అంటున్నారు.

నిజానికి రెండు సూచనల్లోనూ ఫిలిం ఫెడరేషన్ వారి సూచనే సవ్యంగా ఉన్నది. అయితే ప్రస్తుత చిత్రనిర్మాణంలో ఫిలిం విచారణ సంఘంవారు చూపిన లోపాన్ని సరిదిద్దటానికి ఈ రెండు సూచనలూ ఆచరణలో పనికిరావు. తీసుకుంటే చిత్ర నిర్మాణాన్ని ప్రభుత్వం పూర్తిగా తన అధీనంలోకి తీసుకుని, ప్రొడ్యూసర్లనూ, డైరక్టర్లనూ, నటీనటులనూ నియోగించి డాక్యుమెంటరీలూ వార్తాచిత్రాలూ తీస్తున్నట్టే కథా చిత్రాలూ తీసి, అందులోని మంచి చెడ్డలకూ, లాభ నష్టాలకూ పూర్తి బాధ్యత వహించాలి. లేదా సినిమా పరిశ్రమను స్వేచ్ఛగా వదిలేసి; అందులో రావలసిన సాంస్కృతిక, కళాపరిణామాలను సినిమా పరిశ్రమలోని వారికే వదలి వేయాలి. మధ్యే మార్గాలు వృథా. సెన్సార్ బోర్డులవల్ల నీతి సంరక్షించబడటం ఎంత భ్రమో, ఫిలిం కౌన్సిల్ ద్వారా జాతీయ సంస్కృతీ వికాసం సాధించబడటం కూడా అంతే భ్రమ.

కళా సంస్కృతులను గురించి సినిమా ప్రపంచంలో చైతన్యం లేక పోవటమే ఇప్పట్లో పెద్ద అవలక్షణం దీన్ని గురించే ప్రతి ఆంధ్రుడూ విచారించాలి.

మన సినిమా రంగంలో ఇప్పుడు పెద్ద సంపాదనలు గలవారు, కీర్తిమీదా, సంస్కృతిమీదా, కళమీదా శ్రద్ధ చూపదగినవారు, తాము చేసే కళాసృష్టిలో గట్టివాళ్లనిపించుకున్నవారు కొందరు తయారయారు. అంజలీదేవి, వరలక్ష్మి, నాగేశ్వరరావు, ఎన్. టి. రామారావు, రంగారావు, రేలంగి, సి. యస్. ఆర్. మొదలైన నటులు ప్రమాదవశాత్తూ సినిమా రంగంలోకివచ్చి, చెట్టులేనిచోట ఆముదపు చెట్టే మహావృక్షాలన్న లెక్కన పెద్దవాళ్లయి కూర్చున్నవారు కారు. నటనలో వీరు కళాకారులు, కళాభిమానం ఎంతైనా ఉండదగినవారు, తమ కళ ద్వారా అసంఖ్యాక ప్రజలకు



"రాజేశ్వరి"చిత్రంలో డా. గోవిందరాజులసుబ్బారావు, మాధురీదేవి చేతులుకట్టుకు నిలబడ్డవారు వెంపటి, గిడుతూరి, వంగర.



దయానావారి "రిక్షావాలా"లో వసంత.

విజ్ఞానాన్నీ ఉత్తేజాన్నీ కలిగించటానికి ఉవ్విళ్లూరవలసిన వారు. వీరికి పెట్టుబడుల మీద లాభాలు రావన్న భయంగాని, రేపు తమ గతి ఏ మవుతుందోనన్న చింత గాని ఉండే అవకాశం లేదు. వీరందరూ అనేక చిత్రాలలో పనిచేస్తున్నవారే. వీరి కోసం కొండమీది కోతులు దిగిరమ్మంటేవస్తాయి. ఏ చిత్రంలోనైనా సరే ఏదో ఒక పాత్ర దొరికితే చాలునన్న కక్కుర్తి వీరికి లేదు. వీరు తమకు నచ్చిన కథలలోనే నటిస్తామన్నరోజున ప్రొడ్యూసర్లు వీరి ఆత్మాభిమానాన్ని పాటించి తీరుతారు.

అట్లాగే సినిమా రచయితలలో తాపీ, సముద్రాల, బలిజేపల్లి, శ్రీశ్రీ, తోలేటి, గోపీచంద్, కృష్ణశాస్త్రి, సుంకర, అనిశెట్టి మొదలైన ప్రతిభావంతు లున్నారు. ఇందులో దాదాపు అందరూ సాహిత్యరంగంలో ఉన్నత శిఖరాలవంటి చూసిన వారే. వీరిలో ఒక్కరు కూడా సినిమా "ఛాన్సు" కోసం కక్కుర్తిపడ నవసరం లేదు. సినిమా కళను వీరు ఉద్ధరించ లేకపోతే వీరి ద్వారా సినిమా చిత్రాలు ఉన్నత సంస్కృతిని ప్రతిబింబించ లేకపోతే ఇక ఈ సినిమాకు గతే లేదని భావించవచ్చు. అయితే ఇందులో కొందరు ఇటీవలనే సినిమారంగంలో ప్రవేశించి ఉండటంవల్ల వీరి ప్రభావం సినిమాలపై ఏ విధంగా ఉండేదీ పై సంవత్సరంలో గాని మనకు తెలియదు.

వీరుగాక టెక్నిషియనులున్నారు. "తెర చాటున ఉన్న మా పనిని ఎవరూ గుర్తించరు. అసలు సినిమా కళా స్రష్టలం మేమే" నంటారు టెక్నిషియనులు వీరిని కాదనలేం. గడచిన పదేళ్ల కాలంలోనూ వీరి నైపుణ్యం సినిమా చిత్రాలలో మంచి పరిణామాన్ని తెచ్చింది. ఆ విషయం ఫిలిం విచారణ సంఘంవారే ఒప్పుకున్నారు. కాని ఈ టెక్నిషియనులకు తమ ప్రత్యేక శిల్పాలపై ఉన్న ఆదరంలో నూరోవంతైనా సినిమా చిత్రాలలో ప్రతిబింబించే కళా సంస్కృతులపైన ఉన్నట్టు కనిపించటం లేదు. పైపెచ్చు వీరు తమ నైపుణ్యాన్ని తుక్కు కథలమీద వినియోగపరచి వింత ఫలితాలు సాధించటం కూడా జరుగుతున్నది.

దీని కంతకూ మూలమేమంటే సినిమా ప్రపంచంలో ఇంకా సంఘం ఏర్పడలేదు. పెద్దతారలూ, చిన్నతారలూ, రచయితలూ టెక్నిషియనులూ, ఎక్‌స్ట్రాలూ పనివాళ్లూ ఎవరి మానాన వారు జీవిస్తున్నారు. ఫిలిం టెక్నిషియనులకొక సంస్థ ఉన్నది గాని అది ఏడేళ్ళుగా పనిచేస్తున్నప్పటికీ దాని ప్రభావం సినిమాలపైన అంతగా లేదు. మిగిలిన వారికి సంఘాలు కూడా లేవు.

చిత్ర నిర్మాణంలో పాల్గొనే వారు సంఘాలుగా ఏర్పడినప్పుడు చిత్రనిర్మాణ సమస్యలను గురించి నిర్ణయాలు జరగటమూ సినిమా కళాభివృద్ధికి కృషి జరగటమూ కనిపిస్తూనే ఉన్నది. హాలీవుడ్‌లో సినిమారచయితలు ప్రస్తుతం హాలీవుడ్ చిత్ర నిర్మాత



ఎవరీ సినిమా ప్రొడ్యూసరు?
భారతలక్ష్మీ వారి "ప్రియురాలు"లో రేలంగి.

లవలంబించే విధానాలకు వ్యతిరేకించటం వల్లనే అక్కడ విచారణలూ కొందరు రచయితలను కమ్యూనిస్టులని ముద్రవెయ్యటమూ వగైరా గలాటాలు జరిగాయి. రాను రాను ఈ ఉపద్రవమే నటులకూ పాకింది. అమెరికా ప్రభుత్వం అవలంబించే కమ్యూనిస్టు వ్యతిరేక విధానం హాలీవుడ్ చిత్ర కళను అపభ్రంశం చేయబూనుకునేవరకూ హాలీవుడ్ చిత్రాలపై మంచి రచయితల, నటుల టెక్నీషియనుల ప్రభావం ఉంటూనే వచ్చింది. కొన్ని హాలీవుడ్ చిత్రాలలోనైనా ఉత్తమ సాహిత్యమూ, ఉత్తమకళా సంస్కృతులూ ప్రతిబింబించాయి. అటువంటి పరిణామం మన సినిమా రంగంలో కూడా రావలసి ఉన్నది. అందుకు చిత్ర నిర్మాణంలో కృషి చేస్తున్న వారే నడుములు కట్టాలి. తుక్కు కథలతో కూడిన తుక్కు చిత్రాలకు పని చేయమని మన రచయితలు నటులూ, టెక్నీషియనులూ పట్టుబట్టిన మాత్రాన వారికి దారిద్ర్యం చుట్టుకోదు. నిజానికి చిత్ర నిర్మాతలలో చాలా మందికి తాము తుక్కు చిత్రాలు తీస్తున్నట్టు కూడా తెలియదు. వారు గుడ్డిగా ఏ తారలనో, రచయితలనో, టెక్నీషియనులనో నమ్ముకుని చిత్ర నిర్మాణంలోకి దిగుతున్నవారు. అందుచేత మంచి చిత్రాలు తీయటానికి వారు అభ్యంతరం చెప్పరు. మంచి చిత్రాలు తీయాలన్న పట్టుదల ముందుగా ఇతరులకే కలగాలి. ఆ పైన చిత్ర నిర్మాతలకు సులువుగానే కలుగుతుంది. ★

ప్రెస్ షో :

ఎన్. ఎస్. కే. వారి "పెళ్లి కూతురు"

ఎన్. ఎస్. కే. ఫిలిమ్స్ వారి తొలి తెలుగు సాంఘిక చిత్రం "పెళ్లికూతురు"— "మనమగళ్" అన్న తమిళ చిత్రానికి తెలుగు—నవంబరు 15న మద్రాసు చిత్రా టాకీసులో పత్రికలవారికి చూపారు.

ఈ చిత్రంలో అనేక సాంఘిక విషయాలమీద తీవ్రమైన విమర్శ ఉన్నది. న్యాయం, అన్యాయం, నీతీ, అవినీతీ, హింసా, సౌజన్యం, నిజాయితీ, కపటం, స్వార్థం, పరోపకారం—ఇత్యాది ద్వంద్వాల సంఘర్షణ చిత్రంలో విపులంగా ఉన్నది. "1950–1960" అన్న ప్రదర్శనం ఈ నాటి సంఘంమీద గట్టిదెబ్బ తీస్తూ సంఘంలో ఎటువంటి పరిణామం రావాలో సూచిస్తోంది.


ఈ కథలోని దుష్టపాత్ర ఒక భాగవతారు. అతను మొదట రాధ అనే ఒక వితంతువును వలలో వేసుకొని ఆమెను త్యజిస్తాడు. తరువాత తన వద్ద సంగీతం నేర్చుకొనే విజయ అనే పిల్లను-వయసు మళ్లిన కాశీ భాగ్యను-వలలో వేసుకొంటాడు. ఆఖరుకు కథానాయిక అయిన కుమారిని కూడా మోసగించటానికి యత్నిస్తాడు. కుమారిని పెళ్లాడనున్న యువకుడు చంద్రుడు కుమారిమీద తనమగదర్పాన్ని ప్రదర్శించటంవల్ల ఆగ్రహించి కుమారి పట్టుదలకు భాగవతారును పెళ్లాడుతుంది. అయితే పెళ్లి అవుతూనే ఆమెకు భాగవతారు నైజం తెలిసిపోయింది. ఎట్లానూ కుమారిని తనవశం చేసుకోలేక భాగవతారు ఆమెను చంపటానికి యత్నించి తానే దుర్మరణం పాలవుతాడు.

రాధపాత్రను మధురం ఆమెకు ఆశ్రయమిచ్చే ఆశ్రమాధికారి పాత్రను క్రిష్ణన్, భాగవతారు పాత్రను బాలయ్యా, విజయ పాత్రను లలితా, కుమారి పాత్రను పద్మినీ, చంద్రుడి పాత్రను సహస్రనామం చాలా సమర్థతతో నిర్వహించారు. ఈ నటులకు తెలుగు సంభాషణలు చెప్పినవారు (వరుసగా) కాకినాడ అన్నపూర్ణ, ఆర్. కే. రావు, వెంపటి రాధాకృష్ణమూర్తి, కోటూరి అన్నపూర్ణ, టి. జి. కమల, సదాశివరావులు.



ఎన్. ఎస్. కే. వారి "పెళ్లి కూతురు"లో పద్మిని

ఈ చిత్రంలో సముద్రాలవారి మాటలూ పాటలూ చాలా బాగున్నాయి. సుబ్బరామన్ గారి సంగీతం-ప్రత్యేకించి కర్నాటక సంగీతం-చాలా సొంపుగా ఉంది. చివరి భాగంలో కథ చాలా కృత్రిమంగా ఉన్నది. అయినప్పటికీ ప్రేక్షకులకు తృప్తి నివ్వగల చిత్రం. ★



అంజలీపిక్చర్స "పరదేశి"లో నాయికా నాయకులు అంజలీదేవి, నాగేశ్వరరావు

★ సినిమావార్తలు ★

1950 సినిమాబాలట్ ఫలితాలు

నవంబరు 4 న మద్రాసు ఫిలిం ఫాన్స్ అసోసియేషన్ వారు విజయవాడ, మద్రాసు, రాజపాలయం, మదుర నగరాలలో నడిపిన బాలట్‌లో 42, 554 మంది సినిమా ప్రేక్షకులు పాల్గొన్నారు. 4, 500 బాలట్ పేపర్లు "ఇన్వాలిడ్" అయినాయి. ఈ బాలట్, 1950 లో సెన్సారయిన 16 తెలుగు చిత్రాలలోను, 10 తమిళ చిత్రాలలోనూ ఉత్తమమైన వాటినీ, అందులో పాల్గొనిన స్త్రీ పురుష తారలలో ఉత్తములనూ నిర్ణయించటానికి గాను ఏర్పాటయింది.

బాలట్ ఫలితాలు ఈ విధంగా ఉన్నాయి:

ఉత్తమ తెలుగుచిత్రాలు:

	వోట్లు
సంసారం	(12, 974)
అపూర్వసహోదరులు	(3152)
షావుకారు	(1134)
జీవితం	(1862)

ఉత్తమ పురుష తారలు:

వి నాగయ్య	(9155)
నాగేశ్వరరావు	(5147)
ఎన్. టి. రామారావు	(4225)
ఎం. కే. రాధ	(3252)

ఉత్తమ స్త్రీతారలు:

భానుమతి	(10, 407)
అంజలీదేవి	(4817)
లక్ష్మీరాజ్యం	(3620)
జి. వరలక్ష్మి	(2795)

ఉత్తమ తమిళచిత్రాలు

ఏళై పడుంపాడు	(12 06)
మంత్రికుమారి	(5738)
లైలామజ్నూ	(1886)
దిగంబరసామియార్	(1138)

ఉత్తమ పురుష తారలు:

వి నాగయ్య	(9851)
ఎం. జి. రామచంద్రన్	(4233)
ఎన్. ఎస్. క్రిష్ణన్	(2361)
కే. ఆర్. రామసామి	(1904)

ఉత్తమ స్త్రీతారలు:

మాధురీదేవి	(6155)
ద్రౌపది	(3616)
లలిత	(2379)
ఎస్. వరలక్ష్మి	(1¯40)

ఈ బాలట్ ఫలితాలలో గమనించదగిన విషయాలు కొన్ని ఉన్నాయి. 1950 చిత్రాలలో నటించిన పురుష తారలలో తెలుగు తమిళ ప్రేక్షకులు వి. నాగయ్యకు అధిక సంఖ్య గల వోట్లనిచ్చారు. ఈక్షణ దేశమంతటా సినిమా ప్రేక్షకుల ఆదరాన్ని సంపాదించుకున్న వి. నాగయ్యగారికి ధన్యవాదాలు.

తెలుగు చిత్రాలలో రెండవస్థానం సంపాదించుకున్న "అపూర్వ సహోదరులు" చిత్రానికి తమిళ చిత్రాలలో స్థానం లేదు! దీనికి కారణం ఊహించ రాకుండా ఉన్నది.

లోగడ 1950 చిత్రాలకుగాను జరిపిన ఒక బాలట్‌లో ఉత్తమ చిత్రంగా నిర్ణయించబడిన "షావుకారు" చిత్రం ఈ బాలట్‌లో మూడవస్థానం మటుకే సంపాదించుకున్నది.



విజయా వారి "పెళ్లి చేసిచూడు"లో సావిత్రి, వరలక్ష్మి

ఈ బాలట్ 1950 చిత్రాలకు సంబంధించినది అయిఉండి 1951 కోసను జరగటం అంత ఉచితంగా లేదు. ప్రేక్షకులు 1950 చిత్రాలను దాదాపు మరిచిపోయి ఉంటారు. ఇక మీదటనుంచీ ఫిలింఫాన్స్ అసోసియేషన్‌వారు తమ బాలటులను ప్రతి సంవత్సరం జూన్, జులై మాసాలలో నడపటం మంచిది.

ప్రకాష్‌వారి "కన్నతల్లి"

ప్రకాష్ ప్రొడక్షన్స్‌వారు "దీక్ష" అనంతరం "కన్నతల్లి" అన్న మరొక సాంఘిక చిత్రం ప్రారంభించారు. ఈ చిత్రంకూడా తెలుగు, తమిళ భాషలలో తయారవుతోంది. జి. వరలక్ష్మి మరొకసారి తల్లివేషం వేస్తోంది. కొంతకాలం క్రితం సినిమారంగంలో "ప్రణయ" పాత్రలకు పనికిరాకుండా పోయినవారు "తల్లి" వేషాలకు నియోగించ బడేవారు. "మాతృప్రేమ"ను ఈ దుస్థితినుంచి మొట్టమొదట తప్పించినవారు బి. ఎన్. రెడ్డి. "వందేమాతరం" చిత్రంలో కాంచనమాల "తల్లి" వేషం వేసింది. అయితే "వందేమాతరం"లో తల్లికంటె "దీక్ష"లో తల్లి చాలా పెరిగింది. ఈ పరిణామం సాధించిన ప్రకాష్ ప్రొడక్షన్స్‌వారూ, జి. వరలక్ష్మి అభినందనీయులు.

"కన్నతల్లి" రచన శాస్త్రి, సుంకరల

చేతిలో ఉన్నది. ఈ ఇద్దరు దిగ్గజాల ప్రభావం కథపై బలంగా ఉంటుందనటానికి సందేహం లేదు.

ఈ చిత్రంలో వరలక్ష్మితోపాటు ఎన్. టి. రామారావు, ఎం. ఎన్. నంబియార్ ప్రభృతులు కూడా నటిస్తున్నారు. సంగీతం పెండ్యాల. డైరెక్షన్, నిర్మాణం: ప్రకాశరావు. షూటింగ్ వివిధ స్టూడియోలలో సాగుతుందని తెలుస్తున్నది.

శుభోదయావారి "ఆదర్శం"

శుభోదయావారు "ఆదర్శం అనే సాంఘిక చిత్రం తయారు చేస్తున్నారు. ఇందులో జానకి, సావిత్రి, రేవతి, జగ్గయ్య, ఆత్రేయ, గౌరీనాథశాస్త్రి, కృష్ణ మొదలైనవారు నటిస్తున్నారు. దీనికి రచన ఆత్రేయ, సంగీతం అశ్వత్థామ, ఫోటోగ్రఫీ అన్నయ్య, ఆర్టు ప్రసాదూ నిర్వహిస్తున్నారు. డైరక్టరు హెచ్. వి. బాబు. శోభనాచలలో షూటింగు జరుగుతోంది.

హిందీలో "పాతాళభైరవి"

తెలుగు తమిళ భాషలలో చాలా విజయవంతంగా నడిచిన విజయావారి "పాతాళభైరవి" హిందీభాషలో కూడా తయారు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈయేడు విడుదల అయిన చిత్రాలలో ఇది అధికంగా ప్రజాదరం పొందింది. హిందీలోకి అనువదిస్తే ఇది "చంద్రలేఖ" లాగా యావద్భారత ఖ్యాతి సంపాదించటానికి సందేహం లేదు. డైరెక్షన్‌లో గాని, ఆర్టు డైరెక్షలోగాని, ఫోటోగ్రఫీ సౌండు రికార్డింగులలో గాని, సన్నివేశాలలోగాని, హాస్యంలోగాని, నటనలో గాని "పాతాళభైరవి" ఉత్తమ హిందీ చిత్రాలకు ఏమాత్రమూ తీసిపోదు.

జెమినీ వాసన్, ఏ. వీ. మెయ్యప్పచెట్టియార్లు ఇదివరకే తమ హిందీచిత్రాలతో ఉత్తరదేశాన్ని దాడిచేసి జయించి ఉన్నారు. ఈతరుణంలో ఉత్తరదేశాన్ని ఆక్రమించుకున్న చిత్రనిర్మాతలకు ఉజ్వలభవిష్యత్తున్నదనటం అతిశయోక్తి కాదు. రెండో ప్రపంచయుద్ధానికి పూర్వం మన చిత్ర నిర్మాతలకు ఉత్తరదేశం తమ కందుబాటులో లేదన్న దుగ్ధ జాస్తిగా ఉండేది. ఇప్పుడు దక్షిణ దేశంవారికి రహదారి ఏర్పడింది. "చంద్రలేఖ" "సంసార్," "బహార్" చిత్రాలు ఉత్తరదేశంలో అధికంగా ప్రజామోదం సంపాదించటమే గాక, ఆ చిత్రాలలో నటించిన దక్షిణ దేశతారలు కూడా అక్కడి సినిమా ప్రేక్షకుల మన్ననలను పొందారు. "నిషాన్"లో నటించిన భానుమతి, రంజన్ గార్లకు హిందీచిత్రాలలో ప్రవేశం దొరికింది. "పాతాళభైరవి" హిందీలో వెలువడితే ఎన్. టి. రామారావు. రంగారావుల నటనను యావద్భారత సినిమా ప్రేక్షకులు ఆనందించగలుగుతారు.

అశోక్‌కుమార్ యూరప్ యాత్ర

దక్షిణదేశ చిత్రాలు ఉత్తరదేశానికి పోవటం గురించి మనం ఆనుర్దా పడుతుంటే అటు ఉత్తరదేశ చిత్రాలు దేశాంతరాలు వెళ్లేస్థితిలో ఉన్నాయి. ఇటీవల అశోకకుమార్ 12వారాలపాటు బ్రిటన్, ఫ్రాన్సు, ఇటలీ, రష్యాలు పర్యటించి వచ్చాడు. ఇతను ఇంగ్లండులో ఉన్న కాలంలో అక్కడి ప్రముఖ చిత్రనిర్మాతలయిన అలెగ్జాండర్ కోర్డా, ఆర్థర్ రాంక్, హెర్బర్ట్ విల్‌కాక్సులను చూశాడట. విల్‌కాక్సు అశోకకుమారును తన చిత్రాలలో హీరో వేషం వేయిస్తానన్నాడట, అయితే అతను తన దగ్గరనుంచి హాలీవుడ్ పోరాదని మాత్రం షరతు పెట్టాడట. ఆర్థర్ రాంక్, తనతో ఎవరన్నా సగభాగం కలిస్తే ఇంగ్లండులోనూ, ఇండియాలోనూ భారతీయ చిత్రాలు తీస్తానన్నాడట. ఒక స్టూడియో తన పరంచేసి, మంచి కథ ఇచ్చినట్టయితే కోర్డా ఇండియాకు వచ్చి తన స్వంతడబ్బుతో చిత్రం తీస్తానన్నాడట.

భారతీయ సినిమా పరిశ్రమ అర్భకస్థితిలో ఉన్న కాలంలో విదేశ చిత్ర నిర్మాతలు తమ చిత్రాలను స్వేచ్ఛగా ఈ దేశంలో ప్రదర్శించుకున్నారు రాను రాను ఇది సన్నగిలింది. బొంబాయి, కలకత్తా, మద్రాసులవంటి నగరాలలో పూర్వం ఇంగ్లీషు చిత్రాలు మాత్రమే ప్రదర్శిస్తూ వచ్చిన థియేటర్లు అనేకం

ఇప్పుడు దేశీయ చిత్రాలు ప్రదర్శిస్తున్నాయి. అందుచేత పాశ్చాత్య చిత్ర నిర్మాతలు భారతీయ చిత్రాల నిర్మాణానికి ఎగబడటంలో ఆశ్చర్యం ఏమీ లేదు.

అది ఎట్లా ఉన్నా మన సినిమా ప్రముఖులు ఇతర దేశాలు చూసిరావటం కాలక్రమాన మన సినిమా పరిశ్రమకు మంచిది. మన స్టూడియోలతోనూ చిత్ర నిర్మాణంతోనూ పోలిస్తే బ్రిటనులోని పరిశ్రమ చాలా ముందుకు పోయిందనీ, బ్రిటిష్ స్టూడియోలకంటె ఇటాలియన్ స్టూడియోలు ఇంకో బాగున్నాయనీ అశోకకుమార్ చెబుతున్నాడు. ఇటువంటి అనుభవంలోనుంచి అసంతృప్తి, అందులోనుంచి అభివృద్ధీ వస్తాయి.

వచ్చే జనవరి, ఫిబ్రవరి మాసాలలో మన దేశంలో జరగనున్న అంతర్జాతీయ సినిమా ఉత్సవాలుకూడా మన చిత్ర నిర్మాతల ఆశయాలను ఇనుమడింప చేయటానికి బాగా తోడ్పడగలవు. ☆

రషెస్:

నవయుగ వారి "జ్యోతి"

ఇటీవలనే షూటింగు ప్రారంభమైంది నవయుగ వారి "జ్యోతి". రెండు పాటలు "పిక్చరైజ్" చేశారు. అందులో మొదటి పాట గురజాడ అప్పారావుగారి "దేశభక్తి". తండ్రినీ తననూ పావుకార్లు ఇంటి నుంచి వెళ్లగొట్టేవాక జ్యోతి ఒక చిన్న గుడిసె వేసుకుని ఊళ్లో పిల్లలను చేర్చి బడి పెట్టి వారికి చదువు చెబుతుంది గాని, పనికి మాలిన రంగణ్ణి పెళ్లాడి మోసపూను అయిన గరటయ్య పంచచేర నిరాకరిస్తుంది. జ్యోతి పెట్టిన బడి ఆరంభించేటప్పుడు పిల్లలు దేశభక్తి గీతం పాడతారు. ఈ పాట "పిక్చరైజ్" చెయ్యబడింది.

రెండో పాట కామిక్ పాట. వీధిమనిషి మంగీ, దానికోసం వచ్చిన రంగడూ కలిసి పాడతారు. ఈ సమయంలోనే ఎవరో బయటినుంచి తలుపుగొళ్లెం పెట్టి రంగడి తండ్రి గరటయ్యను పిలుచుకు రావటమూ, రంగడు దూడికప్పులో బొక్కని బయట పడటమూ, రంగడి రహస్యం కనిపెట్టిన వాళ్లకి తలా ఒక పదీ సమర్పించుకుని గరటయ్య కొడుకును పట్టుకుపోవటమూ తీయబడింది.



నవయుగవారి "జ్యోతి"లో జ్యోతితండ్రి రామయ్య (పెరుమాళ్లు)

"దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్", అన్నాడు గురజాడ. "జ్యోతి" చిత్రంలో నిజమైన మనుషులున్నారు. ఈ మనుషులు నూటికి 90 పాళ్లు పల్లెల్లోనే ఉన్నారు. ఈ చిత్రంలోని వాతావరణంకూడా పల్లెటూరికి చెందినదే. డైరెక్టరు శ్రీధర్ గారు ఈ చిత్రాన్ని చాలా ప్రతిభతో తయారుచేయడానికి చేస్తున్న కృషి రషెస్‌లో స్పష్టంగా కనిపిస్తున్నది. ప్రభాకర్ ఫొటోగ్రఫీ బాగుంది. జ్యోతి బడిపిల్లల దగ్గరనుంచీ అందరూ బాగా నటిస్తున్నారు. పెండ్యాల నాగేశ్వరరావుగారి సంగీతం కథను తొక్కేయ్యకుండా నట్టు నడుస్తున్నది. చివరదాకా ఈ ప్రమాణాలపై నిలిస్తే నవయుగవారి "జ్యోతి" చాలా మంచి చిత్రమనిపించుకుంటుంది.

పాఠకుల అభిప్రాయాలు

ఆర్యా,

ఇటీవల ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రికలో ప్రచురింపబడిన రచనలలో "అంగారకుడు" వ్రాసిన "విశ్వామిత్ర సృష్టి", "ఎలక్షను ఇంజనీరు" (31-10-51) చాలా బాగున్నాయి. ముఖ్యంగా విశ్వామిత్రసృష్టి అనే వ్యంగ్యరచన అద్వితీయం.

విశాఖపట్నం }
8-11-51 } రావు

ఆర్యా,

మీ ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రికలో మంచి మంచి కథలు, వ్యాసాలు, సినీమా వార్తలు బాగా అందిస్తోంది. కథానికలు బాగా వుంటున్నవి. నవంబరు 7 వ తేదీ వారపత్రికలోని కథానికల్లో సీతారామయ్యగారి "అబ్బాయి చదువు" బాగా వుంది. బొమ్మరిల్లులో కథలు అంత యిదిగా లేవు ఈ వారం. సినీమా శీర్షిక యింకా వృద్ధిచేసి చిత్ర సమీక్షలు, ఫిలింలమీద అభిప్రాయాలు ప్రకటిస్తే యింకా బాగుంటుందనుకుంటా.

సంగారెడ్డి }
12-11-51 } వి. శ్రీహరిరావు

ఆర్యా,

......ఎన్నో నెలలనుండి సీరియల్‌గా ప్రచురితమగుచున్న "కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో" చాలా బాగున్నది. కథ పెద్దదయినను చక్కని సన్నివేశములు, చక్కటి సంభాషణలు కలిగిన ఈ ఆంగ్లనవలను చక్కగ తర్జుమా చేసి, చదువరుల అభిమానమును పొందుచున్న సీతారాంగారికి అభివందనములు. బొమ్మరిల్లు సీరియల్ కథ 'కాంచన ద్వీపం' కూడా చదువరులకు మిక్కిలి ఆనందము కలిగించుచున్నది.

క్రిందటి వారపత్రిక (31-10-51) లో శ్రీ అవసరాల రామకృష్ణరావుగారు వ్రాసిన "తలలు నున్ననైన, తలపులు నున్నవా?" అను చిన్న కథానిక బాగుగా ఉన్నది. ఈ కథానికలో ఆయన ఆడవారి సంభాషణాధోరణిని బాగుగా వ్రాశారు...

కాకినాడ }
8-11-51 } వెలువలి కృష్ణమూర్తి

ఆర్యా,...శ్రీ యం. సీతారామయ్యగారు వ్రాసిన కథ "అబ్బాయి చదువు" (7-11-51) చాలా బాగుగావున్నది. శ్రీ ఆకుండి నారాయణమూర్తిగారి "కీలు కత్తిపీట"...స్త్రీల వివిధ మనస్తత్వాలను ప్రతిబింబింప చేయుచున్నది. శ్రీ నారాయణమూర్తిగారికి నా అభివందనములు. బాలుర కుపకరించుచున్న "బొమ్మరిల్లు" అను మీ శీర్షిక ప్రశంసనీయమైనది.

నిడదవోలు }
11-11-51 } ముచుకుట్ల సత్యనారాయణ


కోదండరావుగారి సూచన

(5-వ పేజీ తరువాయి)

ప్రధానమైనది కాకతప్పదు. అలా కాకుండా ప్రజలు ప్రభుత్వాలకు దూరమైతే ఫలితం వేరే చెప్పనవసరంలేదు; ఇటీవల యూరప్ చరిత్రే నిరూపిస్తోంది.

స్వభాష, జాతీయభాష, అంతర్జాతీయ భాషలు ఈ యిరవయ్యో శతాబ్దంలో పరస్పరం ఆధారపడి ఉన్నాయి. ఏది దేనికి దూరమైనా, లేక ఏ ఒక్క భాష కాని, ఏ కొంతుభాషలమధ్య బాంధవ్యం కాని క్షీణించినా, ఇందువల్ల సంభవించిన ప్రాంతం అభివృద్ధికి దూరం కాగలదు. అంటే జాతీయభాషకే, ఇంగ్లీషుకే ఇచ్చే ప్రాముఖ్యతను ప్రాంతీయ భాషకుకూడా ఇవ్వక తప్పదు. అన్నీ సమానంగా వెంపొందవలసిందే. ఈ పరిస్థితిలో భాషారాష్ట్ర నిర్మాణంవల్ల సంస్కృతి అభివృద్ధి కాదంటం సరికాదు. ప్రాంతీయభాషలకు కూడా సంపూర్ణావకాశం లభించినప్పుడే, జాతీయ భాషాభివృద్ధికూడా సాధ్యపడుతుంది. ఇట్టి సంపూర్ణావకాశం ప్రాంతీయభాషలకు లభించాలంటే, భాషా రాష్ట్రాలైనా ఏర్పడాలి. లేదా ప్రాంతీయరాష్ట్ర పరిపాలనలోనే కాక అన్ని రంగాలలోనూ ఇతర భాషలతోపాటు సమానావకాశాలివ్వబడాలి. సమానావకాశాలు లభించనిచోట భాషారాష్ట్ర విభజన కావాలనడంలో దోషంలేదు. ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras



రష్యాలో ప్రజలకు శాస్త్రవిజ్ఞానం : మాస్కోలోని ఖగోళవిజ్ఞానప్రదర్శనం. ప్రతి నెల లక్షమంది ప్రజలు ఇక్కడికి వచ్చి ఉపన్యాసాలు వింటారు, సూర్యుణ్ణీ నక్షత్రాలనూ పరిశీలిస్తారు.

